లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక

# జనబలం

ప్రజలే ప్రభువులు

అక్టోబర్ 2019 రూ.10/-




## స్థానిక సంస్థలు ప్రజాస్వామ్య దీపికలు

## 'గాంధీటుడే'.. 150ఏళ్లు - 6 సూత్రాలు





# గాంధీని, అంబేద్కర్‌ను కలపటం నేటి చారిత్రక అవసరం

"గాంధీజీ భారతీయ సమాజంలో యధాతథస్థితిని కొనసాగనివ్వలేదు. అలా అని సంఘర్షణ స్థాయికీ పోనివ్వలేదు. సృజనశీలమైన ఉద్వేగస్థితికి మాత్రం తీసుకెళ్లారు.. మన రాజ్యాంగం చేసింది కూడా ఇదే! స్వేచ్ఛ అనే మాట మరచి వెయ్యేళ్లు దాటిపోయిన సమాజానికి ఆ స్వేచ్ఛను ఇస్తూనే, దానిని ఏకతాటిపై నిలిపింది మన రాజ్యాంగం. సమత్వం గురించి ఏనాడూ ఆలోచించని సమాజాన్ని అదే ఆశయానికి కట్టుబడి ఉండేటట్లు మలిచింది. ఫెడరల్ లక్షణం లవలేశమైనా లేని మనదేశం విజ్ఞతాయుతమైన ఒక ఫెడరల్ వ్యవస్థలో ఒదిగేటట్లు చేసింది ఈ రాజ్యాంగమే. సమాజాన్ని కలిపి ఉంచడం రాజ్యాంగం బాధ్యత. ఆ పని అది అద్భుతంగా నిర్వహించింది. మనది ఎంత వైవిధ్య సమాజం! ఇక్కడ గుర్తించిన భాషలే 22 ఉన్నాయి. ఎన్ని జీవన విధానాలు! ఎన్నెన్ని సంస్కృతులు! కానీ వివిధ కారణాల వల్ల మన రాజ్యాంగం ఆత్మ అత్యాధునికం, స్వయందిద్దుబాటు శక్తి కలిగినది.. కానీ అది నిక్షిప్తమై ఉన్న శరీరం మాత్రం పురాతనం. అందుకే 1820లలో ఎలాంటి పాలనా వ్యవస్థ అమలైందో, 2019లో కూడా అదే కొనసాగుతోంది. జిల్లా కలెక్టర్లు, వారి హోదాలు. అఫీషియల్స్, నాన్‌అఫీషియల్స్. అసలు ఈ రెండు మాటలు మన దేశంలో తప్ప ప్రపంచంలో మరెక్కడా వాడరు. కానీ ఇది రాజ్యాంగ లోపం కాదు. రాజకీయ లోపం. విస్తరించే వలయాల మాదిరిగా అధికార వికేంద్రీకరణ జరగటం ప్రజాస్వామ్య లక్షణం. కానీ మన రాజ్యాంగం అధికారాన్ని కేంద్రీకృతం చేసింది. పౌరుడూ, కమ్యూనిటీల కేంద్రంగా మన అధికార వికేంద్రీకరణ జరగలేదు. రాజ్యాంగంలో ప్రస్తావించని ప్రతి అంశం కేంద్రం పరిధిలోకి వస్తుందని ఇక్కడ అన్నారు. అదే అమెరికాలో రాజ్యాంగంలో లేనివన్నీ రాష్ట్రాలకు చెందుతాయని అన్నారు. విచిత్రం ఏమిటంటే రాజ్యాంగంలో ఎక్కడా కేంద్ర ప్రభుత్వం అన్న మాటే లేదు. అలా అధికారం కేంద్రీకృతం కావటంతో మొదట దెబ్బతిన్నది మన గ్రామీణ వ్యవస్థే. రాజ్యాంగంలో ఈ అంశాన్ని చేర్చడం దగ్గరే కొంత గందరగోళం ఉంది. చాలా పైస్థాయిలో వచ్చిన గందరగోళం. గ్రామాలు రిపబ్లిక్‌లుగా ఉండాలన్నది గాంధీజీ ఊహ. కానీ గ్రామానికి ఎక్కువ అధికారం ఉంటే పెడధోరణులు ప్రబలుతాయన్నది అంబేద్కర్ దృష్టి. ముఖ్యంగా కులప్రభావం గురించి అంబేద్కర్ ఆలోచించారు. అలా 40వ అధికరణం మేరకు పంచాయతీలు ఆదేశిక సూత్రాల్లో భాగంగా ఉండిపోయాయి. అధికారస్వామ్యం, ఎమ్మెల్యే రాజ్యం కలిసే సరికి ప్రజాభిప్రాయానికి దగ్గరగా ఏ నిర్ణయమూ జరగడం లేదు. వ్యవసాయ రంగానికి, వృత్తులకు న్యాయం జరగడం లేదు. ఇప్పుడు ఇండియాకు కావలసింది, మనం చేయాల్సింది గాంధీని, అంబేద్కర్‌ని కలపటం. అందుకే లోక్‌సత్తా భావజాల ఐకాన్లుగా వారిద్దరినీ ఎంచుకున్నాం. అధికారాన్ని వికేంద్రీకరించి.. ఓ గ్రామానికి బదులు గ్రామాల సమూహమనే పెద్ద యూనిట్‌ను గణతంత్ర భారతదేశం ప్రాతిపదికగా తీసుకుంటే, సాంప్రదాయ గ్రామాలను 20,000 - 30,000 జనాభాకొకటి చొప్పున సమూహంగా కలిపి, ఆ సముదాయాన్ని (క్లస్టర్) స్థానిక ప్రభుత్వాలకు ప్రాథమిక యూనిట్‌గా ఏర్పాటు చేస్తే ఆ ఇద్దరు మహనీయులు ఆశించిన ఓ పెద్ద మౌలిక లక్ష్యం నెరవేరుతుంది, దేశ ఉజ్వల భవితకు పటిష్ట పునాదులు ఏర్పడతాయి. దీనివల్ల ప్రాథమిక వసతులు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు కావలసిన ఆర్థిక వనరులు సమకూరతాయి, నిర్వహణ సామర్థ్యం కొరత కూడా తీరుతుంది. గ్రామాల సముదాయంగా ఉండే ఒక పెద్ద యూనిట్ ప్రాతిపదికన సార్వత్రిక ఓటు హక్కుకి ఉండే ప్రభావం వల్ల కుల అసమానతలు పలచబడతాయి. అటువంటి స్థానిక ప్రభుత్వాలకి నిజమైన సాధికారత, వికేంద్రీకరణను స్వతంత్ర అంబుడ్స్‌మన్‌కి జవాబుదారీతనంతో అందిస్తే ప్రజలకు సేవలు మెరుగవుతాయి. జనాభాలో అత్యధికంగా ఉన్న షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు, మహిళలు, పేదలకు ప్రాతినిధ్యం వహించే వారికి నిజమైన నాయకత్వం, సాధికారత లభిస్తుంది. స్థానిక ప్రభుత్వాల్లో గణనీయంగా కల్పించిన రిజర్వేషన్లకు కూడా సార్థకత చేకూరుతుంది. గ్రామ పంచాయతీల నుంచి పట్టణ వార్డుల వరకూ స్థానిక సాధికారత ఉండే మూడో అంచె ఫెడరలిజం ఇప్పుడు మనకు ఎంతో అవసరమైన మార్పు."

**- డా॥ జయప్రకాష్ నారాయణ్, లోక్‌సత్తా, ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) వ్యవస్థాపకులు**

ప్రజలే ప్రభువులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక

సంపుట 22 సంచిక 10
అక్టోబర్ 2019

సంపాదకవర్గం
బండారు రామ్మోహనరావు
శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్
దూసనపూడి సోమసుందర్

## జనబలం చందా రుసుము వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | రూ. 1200.00 |

జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.

### చందాదారులకు విజ్ఞప్తి

చాలా మంది చందా గడువు ముగిసినా జనబలం పత్రికను మీకు ప్రతీనెలా పంపుతున్నాము.అట్టివారు తప్పక తమ చందాను వెంటనే పునరుద్ధరించుకోగోరుతున్నాము. చందా డబ్బును Foundation for democratic reforms పేరున జనబలం కార్యాలయంనకు పంపగలరు.

## లోపలి పేజీల్లో...

06 'గాంధీటుడే'.. 150 ఏళ్లు - 6 ప్రజాస్వామిక సూత్రాలు

12 నేతల రాచరికాన్ని ప్రజల అరాచకత్వాన్ని కడిగేసిన గంగా ప్రవాహం..

22 'ప్రతి కుటుంబానికి ఓ డాక్టర్'..

23 వారిది జాబ్‌లెస్ గ్రోత్..

కార్యాలయ చిరునామా : తులిప్స్ అపార్ట్‌మెంట్స్ 6-3-655, ఫ్లాట్ నెం 407, సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక, సోమాజిగూడ, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288
Email: janabalam.loksatta@gmail.com, loksattaudyamasamstha@gmail.com

## కార్టూన్ కార్నర్



(క్రెడిట్: ఈనాడు)

ఒకే పార్టీ కూడా ఉంటే
బావుంటుందేమో సార్!



## జనబలంలో ప్రకటన రేట్లు



| | |
|---|---|
| కలర్‌పేజీ: | 10,000 |
| ఇన్‌సైడ్‌పేజీ బ్లాక్ అండ్ వైట్ : | 5,000 |
| ఫుల్‌పేజీ బ్లాక్ అండ్ వైట్ : | 2,000 |
| సగం పేజీ బ్లాక్ అండ్ వైట్: | 1,000 |

ప్రకటన రుసుము, ప్రకటనకు సంబంధించిన ఫొటోలు, సమాచారం ప్రతినెలా 20వ తేదీ లోపుగా మాకు అందేలా పంపించగలరు. చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను

**చిరునామా: సంపాదకుడు, జనబలం, లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక,**
*తులిప్స్ అపార్ట్‌మెంట్స్, 6-3-655, ఫ్లాట్ నెం 407, సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక,*
*సోమాజిగూడ, హైదరాబాద్-500 082*

జనబలం
అక్టోబర్ 2019

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ
మాసపత్రిక

సంపాదకీయం

# గాంధీజీ @ 150

గాంధీజీ 150వ జయంత్యుత్సవాలు ప్రపంచవ్యాప్తంగా ఘనంగా జరుగుతున్నాయి. గాంధీ ఆలోచనల ప్రాసంగికతపై పారిస్‌లో యునెస్కో ఆధ్వర్యంలో ఒక సదస్సు జరిగింది. అనేక దేశాలలో విశ్వవిద్యాలయాల్లో గాంధీ అధ్యయన సంస్థలు అనేక సమాలోచన గోష్టులను నిర్వహిస్తున్నాయి. సత్యం, శాంతి, అహింస వంటి భావనలను రాజకీయ కార్యాచరణలో భాగంగా మార్చడంలో గాంధీజీ సాగించిన కృషిని పలువురు దేశాధినేతలు, శాస్త్రవేత్తలు, చరిత్రకారులు, రచయితలు, సామాజిక వేత్తలు ప్రశంసాపూర్వకంగా ప్రస్తావిస్తున్నారు. చైనా జాతీయ విముక్తి పోరాటానికి మావో అందించిన నాయకత్వస్థాయిలోనే భారత జాతీయ విముక్తి పోరాటంలో మహాత్మాగాంధీ నాయకత్వం వహించారని చైనా అధికార రేడియో ఒక ప్రత్యేక కథనంలో పేర్కొనడం గమనించాల్సిన విశేషం. షాంఘై విశ్వవిద్యాలయంలో గాంధీ అధ్యయన కేంద్రం ప్రారంభమైంది. నగరంలోని ఒక ప్రధాన కూడలిలో గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. గాంధీ జయంతి రోజున పలువురు స్థానికులు అక్కడ చేరి నివాళులర్పించారు. తమకు తెలిసిన భారతీయ ప్రముఖులు ఎవరన్న ప్రశ్నకు ఒకప్పుడు జవహర్‌లాల్ నెహ్రూ పేరును మాత్రమే చెప్పిన చైనీయుల సంఖ్యను గాంధీజీ తెలుసన్న వారి సంఖ్య ఈ మధ్య అధిగమించింది. కన్ఫ్యూషియస్, తావో వంటి తాత్వికుల మార్గంలోనే గాంధీ జీ ఆలోచనలు వున్నాయని చైనీయులు భావిస్తున్నారు. ప్రపంచంలో పలు దేశాలు గాంధీజీ 150వ జయంతి సందర్భంగా తపాల బిళ్ళలను విడుదల చేశాయి. ఆసియా, ఆఫ్రికా, దక్షణ అమెరికా ఖండాలలోని పలు దేశాలు గాంధీ ఆదర్శాలను నూతన సామాజిక విలువలుగా భావిస్తున్నాయి. గాంధీ జీవితాన్ని, కృషిని నేటి తరానికి తెలియజేయడానికి డిజిటల్ మీడియాను, సాంకేతికతను వినియోగిస్తున్నాయి.

అంతర్జాతీయంగా ఎంతగా ఆసక్తి రేకెత్తిస్తున్నప్పటికీ గాంధీజీకి మాత్రం మన దేశంలో అవమానాలు ఎదురవుతున్నాయి. 150వ జయంత్యుత్సవాలను ఏడాది పొడవునా ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గాంధీజీ ఆలోచనలలోని ప్రధానాంశాలను పక్కనపెట్టి కేవలం పారిశుద్ధ్యం మాత్రమే గాంధేయవాదమన్న రీతిలో బీజేపీ ప్రభుత్వం స్వచ్ఛ భారత్ అభియాన్ ప్రారంభించింది. ఇంటింటికీ మరుగుదొడ్డి నిర్మాణం, పరిసరాల పరిశుభ్రత వంటి నినాదాలను ఆర్భాటంగా ప్రచారం చేస్తోంది. స్వచ్ఛ భారత్ అభియాన్ ప్రచారానికే పరిమితమైపోయింది. కట్టిన మరుగుదొడ్లు వాడటానికి అనుకూలంగా లేవని, వాటిని శుభ్రం చేయడానికి నీటి సదుపాయం లేదని పలు అధ్యయనాలు వెల్లడించాయి. పాకీపని వారి పాదాలు కడిగిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ వారి జీవితాల్లో ఏమాత్రం మార్పులు తేలేకపోయారు. మరుగుదొడ్లు శుభ్రం చేయడానికి ట్యాంకుల్లోకి దిగి ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య ఏ మాత్రం తగ్గలేదు. మత సామసర్యం కోసం హిందూ ముస్లిం ఐక్యత కోసం, అంటరాని కులాల వారి ఉన్నతి కోసం గాంధీజీ బోధించిన ఆదర్శాలు నేడు కనుమరుగై పోతున్నాయి. ముస్లిములపై, దళితులపై, మహిళలపై అత్యాచారాలు హెచ్చుమీరిపోతున్నాయి. విదేశి వస్త్ర దహనం ద్వారా స్వదేశీ ఉద్యమానికి ఊపిరులూదిన గాంధీజీ ఆశయాలను నేటి పాలకులు తుంగలోకి తొక్కారు. గాంధీజీ చేతిలోని ఊతకర్రను పోరాట సంకల్పానికి, స్వయం పోషకత్వానికి, స్వావలంబనకీ సంకేతంగా అప్పట్లో భావించారు. ప్రస్తుతం పాలకులు ఆ కర్రకు ఒక చీపురు తగిలించి స్వచ్ఛ భారత్ అభియాన్‌కు సంకేతంగా కుదించివేశారు. విదేశీ కార్పొరేట్ సంస్థలకు తలుపులు బార్లా తెరిచారు.

గాంధీజీ ఆలోచనలంటే ఏ మాత్రం గిట్టని మత ఛాందసవాద శక్తులు నిరంతరం ఆయన స్మృతికి అపచారం చేస్తూనే ఉన్నాయి. ఆ మధ్య గాడ్సే అభిమానులు కొందరు గాంధీజీ దిష్టి బొమ్మను తుపాకితో కాల్చి, కృత్రిమ రక్తాన్ని చిందేటట్లు చేసి తమ కిరాతక ఆనందాన్ని వికృతంగా ప్రదర్శించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం రేవాలోని బాపూ భవన్‌లో భద్రపరిచిన చితాభస్మాన్ని అపహరించిన దుండగులు అక్కడే ఉన్న గాంధీజీ చిత్ర పటంపై దేశ ద్రోహి అని రాసి, తమ విద్వేషాన్ని వ్యక్తం చేశారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ అనుబంధ సంస్థలకు గాంధీజీ పట్ల ఉన్న విద్వేషం తెలియనిది కాదు. పైకి గాంధీజీ పట్ల కపట వినయాన్ని ప్రదర్శిస్తూ నాథూరామ్ గాడ్సేని అభిమానించే గణాలు వీధుల్లో వీరంగం చేస్తున్నాయి. గాడ్సేకు పూజా మందిరాలు నిర్మించే సాహసానికి పూనుకున్నాయి. గాంధీజీ భౌతికంగా హతమార్చిన ఆలోచనా విధానమే నేడు ఆయన ఆలోచనలను నిర్మూలించే ప్రయత్నం సాగిస్తోంది. రాజ్యాంగ మౌలిక విలువలను ధ్వంసం చేస్తున్నది.

హిందూ సామాజిక వ్యవస్థకు మాయని మచ్చగా, తీరని కళంకంగా పరిణమించిన అంటరానితనాన్ని అంతం చేయడం కోసం జాతీయ కాంగ్రెస్ ఉద్యమాన్ని సమాయత్తం చేయడంలో గాంధీ నిర్వహించిన పాత్ర ప్రముఖమైనది. ఎస్సీ, ఎస్టీల ప్రత్యేక నియోజకవర్గాల ఆలోచన హిందూ సమాజాన్ని విచ్ఛిన్నం చేస్తుందని గట్టిగా వాదించినందుకు ఈరోజుకూ అంబేద్కర్‌వాదులు గాంధీజిని నిందిస్తూనే ఉన్నారు. ఆయన్ని దళిత వ్యతిరేకిగా చిత్రిస్తూనే ఉన్నారు. ద్విజాతి సిద్ధాంతం పేరుతో సావర్కర్ ఒక పక్క, మహ్మద్ అలీ జిన్నా మరో పక్క దేశంలో విద్వేష బీజాలు నాటుతున్న సమయంలో ప్రత్యేక నియోజకవర్గాలు వస్తే సమాజం మరింతగా విచ్ఛిన్నం అవుతుందని, కులమత ఘర్షణలతో రక్తపాతం జరుగుతుందని గాంధీజీ గట్టిగా నమ్మారు. ప్రధాన లక్ష్యమైన స్వాతంత్ర్యోద్యమం నీరుకారుతుందని ఆయన వాదించారు. బైటివారిని సాగనంపాక ఇంటిలోని సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవచ్చని గాంధీజీ భావించారు. ప్రత్యేక నియోజకవర్గాల భావన విభజించి పాలించే కుటిలనీతికి మార్గం సుగమం చేస్తుందని గాంధీజీ చెప్పారు. అయితే డా॥ అంబేద్కర్ కూడా ద్విజాతి సిద్ధాంతాన్ని తిరస్కరించారని , దేశ విభజన తప్పని భావించారని గమనించాలి. కోట్లాది మంది ప్రజల్ని రాజకీయ కార్యాచరణలోకి సమీకరించిన రాజకీయవేత్తగా గాంధీజీని అంబేద్కర్ ప్రశంసించిన విషయాన్ని కూడా గుర్తుంచుకోవాలి. అంబేద్కర్‌వాదులు, కమ్యూనిస్టులు గాంధీజీని ఈనాటికీ ఈసడిస్తూనే ఉన్నారు. మనువాదులకు గాంధీజీ అంటే ఎలాగూ గిట్టదు. దీనినిబట్టి గాంధీజీని అర్థం చేసుకోవడంలో మన సమాజం ఇంకా విఫలం అవుతూనే ఉందని స్పష్టం అవుతోంది. 150వ జయంతి సందర్భంగా దీనిపై మరింత చర్చ జరగాల్సి ఉంది.


డి. సోమ సుందర్




# 'గాంధీటుడే'..

## 150 ఏళ్లు - 6 ప్రజాస్వామిక సూత్రాలు

డా॥ జయప్రకాష్ నారాయణ్



గాంధీజీ ఫోటో, ప్రస్తావన, చెప్పిన, రాసిన మాటలు ఇప్పటికీ మనలోని చాలామందిలో ఎటువంటి భయంలేని భక్తి, గౌరవ భావాల్ని అప్రయత్నంగానే కలిగిస్తాయి. కానీ గాంధీ గురించి.. ఆయన ఆలోచనలు, లక్ష్యాల గురించి మనకి ఇంకా స్పష్టతలేదని ఒక జాతిగా, సమాజంగా, వ్యక్తులుగా మన తడబాటు, నివారించదగ్గ బాధలతో కోట్లాదిమంది కంటనీరు రుజువు చేస్తున్నాయి. "గాంధీని ఎందుకు గుర్తుంచుకోవాలి? ఆయన్ని మనం స్మరించుకుంటున్న కారణాలు దీర్ఘకాలిక ప్రాతిపదిక కలిగినవేనా? గాంధీలోని నిజమైన దీర్ఘకాలిక ప్రాతిపదికలు ఏమిటి?" .. గాంధీజీకి మూడు యాభైలు, దేశంలో అడుగడుగునా యువజనాభా తరుణంలోనైనా భారత్ ఈవేళ స్పష్టమైన జవాబుల్ని తెల్చుకోవాలి.

గాంధీ గారిని గుర్తుంచుకోవాల్సింది విదేశీ వస్త్ర బహిష్కారం కోసం కాదు, ఆయన్ని గుర్తుంచుకోవలసింది తెల్లోడ్ని వెళ్లగొట్టాడని కాదు, ఆయన్ని గుర్తుంచుకోవాల్సింది మువ్వన్నెల జెండాల కోసం కాదు, ఆయన్ని గుర్తుంచుకోవాల్సింది కొల్లాయి కట్టాడని కాదు, ఆయన గోవును ప్రేమించాడని కాదు, ఆయన మాంసం ముట్టలేదని కాదు.. గాంధీజీని గుర్తుంచుకోవాల్సింది– అహర్నిశం, అనుక్షణం, కణం కణం తహతహలాడి చేసిన ఒక జాతి నిర్మాణం కోసం, మానవాళి ఔన్నత్యం కోసం, మనిషి ఎదగడం కోసం. ఇది అర్థమైతే యువత గాంధీని వదలరు. ఇది అర్థం కాకుంటే, మనం ఎన్ని మాటలు చెప్పినా ఇది ముసలివాళ్ల ప్రేలాపనగా ఉంటుందికానీ.. గాంధీజీ జీవితానికి, వచ్చే తరం భవిష్యత్తుకి మధ్య సంబంధం ఉండదు. గాంధీజీ కులమేంటో, ఎక్కడ పుట్టాడో మనకనవసరం. ఆయన్ని వ్యక్తిగా చూడకూడదు. తన జీవితమే సందేశంగా జీవించిన గాంధీజీ నైతికత, ఆయన నమ్మిన నమ్మకాలు మనకి పనికివచ్చే సూత్రాలు. భవిష్యత్తుని, ప్రపంచమంతా, ముఖ్యంగా మనదేశంలో మనం తలుచుకుంటే ప్రభావితం చేస్తాయి. మన బిడ్డల బతుకుల్ని సార్థకం చేస్తాయి.

మహాత్మాగాంధీ మౌలికంగా ఆరు ప్రజాస్వామిక విలువలు, సూత్రాలకు ప్రాతినిధ్యం వహించారు. ఈ ఆరింటికీ మన ఆలోచనలో, ఆచరణలో ఎంత స్థానం కేటాయిస్తే గాంధీజీ 150వ జయంతి సంవత్సరాన్ని అంత ఘనంగా జరుపుకున్నవారమవుతాం.

మొదటిది, జీవితమంతా గాంధీగారు పోరాడింది 'రాజకీయం పవిత్ర వ్యాసంగం' అని. ఒకరకంగా దానికి నేను పేటెంట్ తీసుకున్నాను. రాజకీయం పవిత్ర వ్యాసంగం అన్న మాట నా నోటి నుంచి కొన్ని వేలసార్లు వచ్చి ఉంటుంది. అది మనసా, వాచా, కర్మణా నమ్మి ఆచరించిన మహనీయుడు మహాత్మాగాంధీ! అధికారం.. ఒక లక్ష్యానికి మార్గమే తప్ప అంతిమం కాదు అని చాటి చెప్పారు. కానీ మనమేం చేస్తున్నాం?.. దేశవ్యాప్తంగా పార్టీలకతీతంగా, ప్రాంతాలకతీతంగా ఎవరు అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా ఎంత హింసావాదాన్ని, ఎంత అసహ్యాన్ని, ఎంత ద్వేషాన్ని పెంచుకుంటున్నాం, ఎంత అశ్లీలతని రాజకీయంలో చొప్పిస్తున్నాం, ఎంత వల్గారిటీని ప్రవేశపెట్టాం, ఎంత మనిషి హుందాతనాన్ని కించపరిచాం!? రాజకీయాన్ని బూతు పదంగా మార్చిన జాతికి.. రాజకీయమే ఒక పవిత్ర వ్యాసంగం అని నమ్మినటువంటి, జీవించినటువంటి మహనీయుడికి నివాళులు అర్పించే అర్హత ఉందా? అర్హత ఎక్కడుంది, ఎట్లాఉంది మనకి? చెప్పండి ఎక్కడుంది?.. దాన్ని ఎలా తీసుకొస్తాం? తీసుకొస్తామా, లేదా?.. తీసుకొస్తే అప్పుడు గాంధేయం, అది లేకపోతే బూటకం.

రెండోది, అన్యాయాన్ని కొనసాగించే యథాస్థితిని ప్రశ్నించాలని గాంధీ అన్నారు. 'అన్యాయాన్ని ఏనాడూ సహించబోకు, మౌనప్రేక్షకుడిగా మిగిలిపోబోకు, ఎదురుతిరుగు. కానీ అదే సమయంలో సంఘర్షణ హింసకు వెళ్లనీబోకు. అది.. ఆ సంఘర్షణ.. హింసకు తక్కువగా ఉండాలి, మౌన అంగీకారానికి ఎక్కువగా ఉండాలి, మధ్యలో ఉండాలి. సంభాషణ – సంఘర్షణ. క్రియేటివ్ టెన్షన్. అది కులవ్యవస్థ కావచ్చు, లైంగిక వివక్ష కావచ్చు, వర్ణ వివక్ష కావచ్చు, భాషల మధ్య వైరుధ్యం కావచ్చు, భారత్–పాకిస్తాన్ మధ్య విభేదాలు కావచ్చు. ఏనాడూ అన్యాయాన్ని సహించకు, చూస్తూ కూర్చోబోకు. ఎదురుతిరుగు, పోరాడు, గొంతువిప్పు. మార్పు కోసం నిరంతరం ప్రయత్నం చెయ్యి. కానీ అది హింసాత్మక సంఘర్షణ దారికి వెళ్లనీయబోకు' అన్నారు. కానీ మన పోరాటాలు సోషల్ మీడియాలో కావచ్చు, బయట కావచ్చు.. ఎంత అనాగరికంగా, బాధ్యతారహితంగా, రాజ్యాంగ వ్యతిరేక ధోరణులతో ఉంటున్నాయి? పరిష్కారంలో కాకుండా మనల్ని సమస్యలో భాగం చేస్తున్నాయి. తన భావజాల సత్తా, నాయకత్వ నైపుణ్యాల ద్వారా క్రియేటివ్ టెన్షన్ అనే నాగరిక పోరాట పద్ధతిని ఎంతో విస్తృతమైన రాజకీయాల స్థాయికి విస్తరించటం ద్వారా గాంధీ.. ఎన్నో రకాల నేపథ్యాలున్న ప్రజలున్నప్పటికీ సమన్వయంతో ఈ గడ్డ మీద గొప్ప దేశాన్ని నిర్మించగలిగారు. మరీ పరమ మూర్ఖులున్న సందర్భాల్లో తప్ప నూటికి తొంభై చోట్ల ఫలితాలు సాధించే పోరాటపంథా ఇది.

మూడోది, అవకాశాలు అందరికీ అందాలని, ఏ తల్లి గర్భాన పుట్టినా ఎటువంటి వివక్షా ఉండకూడదని గాంధీజీ నిరంతరం చెప్పేవారు. గుండె మీద చెయ్యి వేసుకోండి. మన మనసుల్లో ఒక మనిషిని చూడగానే.. వాడి కులం ఏంటి? వాడి ఊరేంటి, ప్రాంతమేంటి? వాడి మతమేంటి? వాడు ఏ పార్టీ? వాడు వేరే పార్టీ అయితే వాడి ఇంటి మీద కాకి మన ఇంటి మీద వాలడానికి వీల్లేదు, వాడు వేరే కులమైతే వాడిని చులకన చెయ్యాలి, మన

కులం అయితే పనికిమాలినవాడైనా వాడిని పెంచాలి.. ఈ ట్రైబలిజం ధోరణి మనందరి మనసుల్లో ఉందా లేదా?.. చిన్నారులకు లేదు ఇది. అయితే చాలామందిలా వాళ్ల తల్లిదండ్రులకు ఉందా, లేదా?..ఈవేళ గాంధీ గారికి అపచారం జరిగితే సమాజంలో పట్టించుకునే స్థితి లేకుండా పోయింది. ఎందుకంటే, గాంధీగారికి కులం లేదు, ఆయనకి మతం లేదు! ఈ కులం, మతం, ప్రాంతం, భాషకి అతీతంగా, ఈ ట్రైబలిజానికి అతీతంగా మన జాతికందరికీ ఉమ్మడి ప్రయోజనాలు ఉన్నాయన్న స్పృహ మనందరినీ కూడా ప్రేరేపించకపోతే.. మన దేశభక్తి అబద్ధము, మన ప్రజాస్వామ్యం బూటకము, గాంధీజీ పట్ల మనం చూపెట్టే ఆదరణ అసత్యము!

నాలుగోది, ఏ పని చేసినా కూడా.. చిన్న పని, పెద్ద పని అంటూ ఉండదు. పదిమందికి పనికివచ్చే ప్రతి పని కూడా గౌరవప్రదమైనదే. డిగ్నిటీ ఆఫ్ లేబర్. నేను ఎన్నో సందర్భాల్లో చెప్పాను పబ్లిగ్గానే – ఎక్కడో దూరంగా ఉన్న జిల్లా కలెక్టర్ కంటే, మనింట్లో తూములు నిర్మించే ప్లంబర్ మిన్న అని! గాంధీజీ దాన్ని నిరంతరం పాటించారు. మనకి రోజూ చెప్పారు– మానవ విలువల కోసం, హుందాతనం కోసం, వివక్ష లేని సమాజం కోసం. చిన్న పని, పెద్ద పని అనే విభజన రూపంలో, ఇంకా వివిధ రూపాల్లో ఇవాళ వివక్ష ఉంది. కొత్త రూపాల్లో వస్తున్నది. పాత రూపాల్లో ఇంకా కొన్ని సందర్భాల్లో కొనసాగుతోంది. దాన్ని నివారించటం కోసం, నిర్మూలించటం కోసం, హింసలేని రీతిలో మార్పు తేవటం కోసం నిరంతరం పోరాడితే.. అప్పుడు గాంధీ బతికి ఉన్నట్టు లెక్క.

ఐదోది, నాకు అన్నిటింకంటే ప్రియమైనది, అన్ని పార్టీలను ప్రతిరోజు నేను తిట్టిపోసేది, గాంధీజీ ప్రతిక్షణం బతికింది– సామాన్యుడి సాధికారత కోసంగానీ, ఢిల్లీలో ఎర్రకోట దగ్గర మువ్వన్నెల జెండా కోసం కాదు. ప్రధానమంత్రి ఆధిపత్యం కోసం కాదు. అమరావతి సీమలోనో, హైదరాబాద్ నగరంలోనో, బెంగలూరు శివార్లలోనో ముఖ్యమంత్రుల రాచరిక స్వభావం కోసం కాదు. ఏ ఊరుకావూరు, ఏ వీథికావీథి, ఏ పట్నానికాపట్నంలో పన్నులు కట్టే వాడికి అధికారం ఇవ్వటం ఎట్లా, ఓటు వేసే వాళ్లకి వాళ్ల భవిష్యత్తును నిర్దేశించే నిర్ణయం స్థానికంగా జరగటం ఎట్లా, ఆ ఓటు విలువ సామాన్యులకు అర్థమయ్యేలా వ్యవస్థ నిర్మాణం చేయటం ఎట్లా? ఇవి కొరవడటం వల్లే.. ఆయన స్వతంత్రం వచ్చిందని నమ్మలా. తెల్లోడు పోయాడుగానీ, ఇది స్వరాజ్యం కాదని నమ్మాడు. 'స్వాతంత్ర్యం అంటే కొందరు పెద్దలు గద్దెనెక్కి కూర్చోవడం కాదు.. ఈ దేశంలో చిట్టచివరన ఉన్న సామాన్య పౌరునికి తన జీవితం మీద తనకు సాధికారత, తన బతుకుకు తానే యజమానిననే విశ్వాసం కలిగించటమే నిజమైన స్వాతంత్ర్యం' అని గాంధీజీ ప్రగాఢంగా నమ్మేవారు. అందుకే గ్రామస్వరాజ్యం, స్థానిక ప్రభుత్వాల సాధికారత కోసం గాంధీ నిరంతరం పోరాడారు. కానీ ఈవేళ ఈ దేశంలో ప్రభుత్వాలు, పార్టీలు చేస్తున్న దాదాపు ప్రతి పని సామాన్యుడి ఆత్మగౌరవాన్ని భంగం చేసేది, సామాన్యుడ్ని బిచ్చగాడిగా మార్చేది, సామాన్యుడి స్వావలంబన తగ్గించేది, సామాన్యుడి సాధికారతకు నిప్పు పెట్టేది! అధికార కేంద్రీకరణ– జనాన్ని బిచ్చగాళ్లలాగా చిన్నచూపు చూసేటి వ్యవహారం, నిజాయతీ, సామర్థ్యం, సేవాభావం గల యువ నాయకులను ఎదగనీయకుండా చేసేటి వ్యవహారం!! పన్నులు కట్టే ప్రజలకి నేను నీకు ఇది ఇస్తానని చెప్పడమా? సిగ్గుందా మనకి? ప్రపంచంలో అత్యంత హీనస్థానంలో విద్యను, ఆరోగ్యాన్ని పెట్టి ఈ సమాజాన్ని కాపాడుతున్నామని మీరు బీరాలు పలుకుతారా? బీద కుటుంబంలో పుట్టిన పాపానికి తెలివి ఉన్నా కూడా చదువందని వ్యవస్థ నిర్మాణం చేసి మేము గాంధీని గురించి మాట్లాడుతున్నామని అహంకరిస్తారా? ఎన్నారై, అంతర్జాతీయ వేదికల మీద డాంబికాలు పలుకుతారా? ఏ అర్హత ఉంది మనకి? ఒక సమాజంగా మనందరం ఆ పాపంలో భాగస్వాములం. జనం చేతికి అధికారమిచ్చే పరిమిత ప్రభుత్వాన్ని, నైతిక రాజకీయాలనూ ప్రజాసేవకు మార్గంగా మనం గుర్తిస్తేనే గాంధీని గౌరవించినట్లు.

ఆరవది, ప్రకృతితో సామరస్యంగా ఉంటూ అవసరానికి మించిన సంపదకు ధర్మకర్తలా వ్యవహరించాలని ప్రజలకు ఆయన బోధించేవారు. ఈనాటి ప్రపంచ సమాజంలో బిల్‌గేట్స్, వారన్ బఫెట్, అజీమ్ ప్రేమ్‌జీ, మరెందరో వదాన్యులు గాంధీ చూపిన మార్గాన్ని ఎంచుకుని ధర్మకర్తలుగా వ్యవహరిస్తున్నారు. గాంధీజీ ప్రపంచంలో ఎలాగైతే ఆధునికకాలంలో మొదటితరం ఫెమినిస్టో, మొదటితరం ఎన్విరాన్‌మెంటలిస్టు.. పర్యావరణవేత్త కూడా. గ్రేటా థన్‌బెర్గ్ ఈవేళ గాంధీ మార్గంలోనే ఈ లక్ష్యం కోసం పోరాడుతోంది. ప్రకృతికి – మనిషికి సమతూకం లేకపోతే మనందరం నష్టపోతాం, మానవాళి నష్టపోతుందని చాలా స్పష్టమైన అవగాహనతో అనితరసాధ్యమైనటువంటి సాధారణమైన శైలిలో గాంధీజీ చెప్పారు. 'మనిషి అవసరాలకు తగినంతగా ప్రకృతి మనకి ఇస్తున్నది, మనిషి అత్యాశకు మాత్రం ప్రపంచంలో ఉన్న వనరులు చాలవని' ఆయన పదేపదే చెప్పిన మాటలు ఎంత విలువైనవో ఇప్పుడు ప్రతి రుతువులోనూ అనుభవపూర్వకంగా తెలుసుకుంటున్నాం.

.. కాలాతీతమైన, సార్వజనీనమైన ఈ గాంధీజీ సూత్రాలు, విలువలు మనలాంటి విస్తృతమైన, సంక్లిష్టమైన, వైవిధ్యమైన, ప్రాచీనమైన సమాజానికి సరిగ్గా సరిపోతాయి, ప్రపంచీకరణసమాజానికి తగినట్లు విశ్వమానవులుగానూ ఎదిగేలా చేస్తాయి. ఒకరకంగా చెప్పాలంటే, భారత మొదటి స్వతంత్ర పోరాటంలో కన్నా ఈ రెండో స్వతంత్ర పోరాటంలో విజయమే గాంధీజీ మౌలిక లక్ష్యం.

మహాత్ముడి కొన్ని చర్యలతో నేను ఇప్పటికీ విభేదిస్తున్నాను. ఆయన చేసినవి మొత్తం అంగీకరించాల్సిన అవసరం లేదు. కానీ మౌలికంగా ఈ జాతినిర్మాణం, ఇన్ని కోట్లమందిని కలిపి ఉంచిన జాతినిర్మాణం పూర్తిగా గాంధీజీ వల్లే జరిగింది. ఒక ప్రజాస్వామ్య సమాజంలో మన ఆచరణ, నిత్య జీవితంలో పదిమందితో మన ఆచరణ ఏరీతిలో ఉండాలో గాంధీ స్వయంగా ఆచరించి చూపారు. ప్రపంచంలో మరే దేశంలో ఎవరూ చేయలేని రీతిలో అనేకమంది నాయకుల్ని జాతీయోద్యమంలో తయారుచేసి మన దేశానికి అందించారు. అందుకే రాజకీయాలలో ఉన్నవారు, రాజకీయాలను ద్వేషించేవారు, పౌరసమాజం అందరూ ఈ గాంధేయ విలువలు, విధానాలను జీవితంలో భాగం చేసుకోవాలి. యాదృచ్ఛికంగానే అయినా మన దేశంలో గాంధీ పుట్టినందుకు ఆ విశ్వనాయకుడ్ని జాతిపిత అని పిలుచుకునే అర్హతను భారత జాతి నిలబెట్టుకోవాలి. ఆయన విలువల్లో కొన్నయినా పాటించి మన బిడ్డల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలి. ఈ విషయంలో ప్రపంచ దేశాలను చూసైనా నేర్చుకోవాలి. మనకున్నంత ఘన నాగరికత, సంస్కృతి ఆ దేశాలవారికి లేకపోవచ్చు.. కానీ గాంధీ విలువను గుర్తించే సమాజాన్ని తయారుచేయగలిగిన రాజకీయ, పాలనా వ్యవస్థల్ని వారు నిర్మించుకున్నారు. మన దేశంలో నేతలతోపాటు గురువులు, సాధువులు, తారలు, కవులూ, మీడియా గాంధీ బోధించి ఆచరించిన ఈ విలువలను ప్రచారం చేసి ప్రజలను మేల్కొలపాలి, అవి వేళ్లూనుకునేందుకు తగిన వ్యవస్థల్ని నిర్మించాలి, రెండో స్వాతంత్ర్యాన్ని సాధించాలి.. నామమాత్రపు స్వరాజ్యాన్ని నిజమైన స్వరాజ్యంగా, సురాజ్యంగా మార్చాలి. ఈ రకమైన బేరీజు, దిద్దుబాటు ఆచరణే మహాత్ముడి 150వ జయంతి ఉత్సవాల్ని జరుపుకోవటం!

# శాంతి + క్రాంతి = గాంధీ



**వినోబా భావే**

చిన్నప్పటి నుండి నా ధ్యాస బెంగాల్ మీద, హిమాలయ పర్వతాల మీద కేంద్రీకరించబడి ఉండేది. హిమాలయాలకు, బెంగాలుకు వెళ్లాలని భావిస్తూ ఉండేవాణ్ని. ఒకవైపున బెంగాల్‌లో సాగిన వందేమాతరం ఉద్యమం నన్ను ఆకర్షిస్తూ ఉంటే, మరోవైపున హిమాలయ పర్వతాల జ్ఞానయోగం నన్ను లాగుతూ ఉండేది. అటు హిమాలయాలకు, ఇటు బెంగాలుకు మధ్యన కాశీ ఉన్నది. కర్మవశాత్తూ నేను అక్కడికి వచ్చాను. కానీ ఊహించినట్లుగా నేను హిమాలయాలకు వెళ్లలేదు. బెంగాలుకూ వెళ్లలేదు. కానీ మనస్సు ద్వారానే నేను ఆ రెండు ప్రదేశాలు ఒకేసారి చూచివచ్చినట్లు అనిపించింది. గాంధీజీ దగ్గరకు వెళ్లాను. వారి సన్నిధిలో నాకు హిమాలయాలలో లభించే శాంతి, బెంగాలులో లభించే క్రాంతి రెండూ లభించాయి. శాంతి, క్రాంతి రెండింటి సంగమం గాంధీజీలో దర్శించాను.



నేను కాశీ వెళ్లినపుడు అక్కడ గాంధీ గారి ఉపన్యాసం గురించి చర్చ జరుగుతున్నది. అక్కడి హిందూ విశ్వవిద్యాలయంలో జరిగిన సభలో బాపూ ఉపన్యసించారు (1916 నాటి గాంధీజీ బనారస్ వర్సిటీ ప్రసంగ పాఠాన్ని కూడా 'జనబలం' ఈ సంచికలో అందిస్తున్నాం). ఆ ఉపన్యాసంలో వారు అహింసను గురించి అనేక విషయాలు పేర్కొన్నారు. "నిర్భయత్వంలేని అహింస నడవదు. లోలోపల హింసాభావం పెట్టుకుని వ్యవహరించే కంటే బహిరంగంగా హింస చేయడం తక్కువ హింస కింద పరిగణించవచ్చు. మానసిక అహింసయే ముఖ్యమైన అహింస. నిర్భయత్వం లేనిదే అది సాధ్యం కాదు" ఇదీ గాంధీ గారి ప్రసంగ సారాంశం. రకరకాల ఆభరణాలు అలంకరించుకొని ఆ మీటింగుకు వచ్చిన రాజాలను, రాణాలను, మహారాజాలను గాంధీజీ నిశితంగా విమర్శించారు. నేను కాశీకి వెళ్లేందుకు ఒక మాసం రోజులకు పూర్వం గాంధీగారి ఉపన్యాసం అక్కడ జరిగింది. అయినా ఆ ఉపన్యాసం గురించి ఇంకా చర్చ జరుగుతూనే ఉంది. నేను వారి ఉపన్యాసం చదివాను. అనేక సందేహాలు నాకు కలిగాయి. జిజ్ఞాస బయలుదేరింది. నా జిజ్ఞాసను పేర్కొంటూ బాపూ పేరిట జాబు రాశాను. నా జాబుకు బాపూ చక్కని

సమాధానం పంపారు.

15 రోజుల తరువాత కొన్ని సందేహాలు వ్యక్తం చేస్తూ మళ్లీ ఒక జాబు రాశాను. అహింసను గురించి జాబుల ద్వారా సందేహ నివృత్తి కావించడం సులువైన పని కాదు. నిత్యజీవితంలో ఆచరణ ద్వారానే అది సాధ్యం. మీరు మా ఆశ్రమానికి రండి. ఇక్కడ కొద్దిరోజులు ఉండండి. చర్చిద్దాం అని బాపూజీ సమాధానం రాశారు. వారి సలహా నాకు నచ్చింది. జీవితంలో ఆచరణ అన్న వాక్యం నన్ను ఆకర్షించింది. ఆ జాబుతోపాటు తమ ఆశ్రమనియమావళి ప్రతిని కూడా పంపారు. ఆ నియమావళి నాకు నచ్చింది. అప్పటి వరకు అటువంటి నియమావళి ఏ ఆశ్రమాన్ని గురించి నేను చదవలేదు. "ఈ ఆశ్రమ లక్ష్యం విశ్వహితానికి వ్యతిరేకంకాని దేశసేవ. అందునిమిత్తం సత్యం, అహింస, బ్రహ్మచర్యం, అస్తేయం, అపరిగ్రహం, శరీర శ్రమ మొదలుగాగల ఏకాదశ వ్రతాలు ఈ ఆశ్రమంలో ఆచరించబడును" అని ఆ నియమావళిలో రాసి ఉన్నది. నాకు ఆశ్చర్యం కలిగింది. నేను చాలా దేశ చరిత్రలు చదివాను. నేను ఎక్కడా ఇలాంటి విషయాలు చదవలేదు. యోగ శాస్త్రం, ధార్మిక విషయాలు భక్తిమార్గంలో పేర్కొనబడి ఉంటాయి. కానీ అవి దేశసేవకు కూడా అవసరం అనే విషయం మొదటిసారి ఆ ఆశ్రమ నియమావళిలో నేను చూశాను. అందువల్ల నా మనస్సు అటు ఆకర్షితమైంది. ఈ వ్యక్తి దేశానికి రాజకీయ స్వాతంత్ర్యంతోపాటు, ఆధ్యాత్మిక వికాసాన్ని కూడా ఒకేసారి సాధించాలని భావిస్తున్నాడని నాకు అనిపించింది. నాకూ అదే ఇష్టం. 'మీరు ఇక్కడికి రండి' అని బాపూ రాశారు. నేను బాపూ దగ్గరికి చేరుకున్నాను. 1916 జూన్ 7వ తేదీ. నేను అహ్మదాబాద్ రైలు స్టేషన్‌లో దిగాను. నా దగ్గర సామాను ఎక్కువగా లేదు. ఆ కొద్ది సామాను తీసుకొని కాలినడకన కనబడ్డ వాళ్లను అడుగుతూ బయలుదేరాను. ఎలిస్ బ్రిడ్జి తోవన నడిచి ఉదయం 8 గంటలకు కోచరబ్ ఆశ్రమం చేరాను.

ఒక కొత్త సోదరుడు వచ్చాడని బాపూజీకి వార్త అందజేయబడింది. మంచిది, స్నానం చేసి వచ్చి తనను కలవమని కబురు పంపారు. స్నానం చేసి వారి దగ్గరికి వెళ్లాను. ఆయన కూరలు తరుగుతున్నారు. నాకు అది కూడా కొత్త విషయమే. దేశ నాయకులు కూరలు కూడా తరుగుతూ ఉంటారని నేనెప్పుడూ వినలేదు. వారి ప్రథమ దర్శనంలోనే నాకు శరీర శ్రమను గురించిన ప్రథమ పాఠం లభించింది. బాపూ నాకు కూడా ఒక చాకు అందించారు. నేను అంతకు ముందు ఎప్పుడూ అటువంటి పని చేసి ఉండలేదు. కానీ ఆ రోజున అట్టి పాఠం లభించింది. జీవితంలో ప్రథమంగా నాకు లభించిన ప్రథమ దీక్ష ఇది. అది బాపూ సన్నిధిలో లభించింది.

కూరలు తరుగుతూనే వారు నన్ను గురించి అడిగారు. "మీకు ఇక్కడి నియమాలు, దినచర్య నచ్చితే, మీ జీవితం సేవాకార్యక్రమాలలో గడపతలచుకుంటే ఇక్కడ ఉండండి. నాకు సంతోషం కలుగుతుంది" అని బాపూ అన్నారు. నా జిజ్ఞాస వారు గుర్తించారు. "కానీ మీరు చాలా దుర్బలంగా కనబడుతున్నారు. ఆత్మజ్ఞానులు సామాన్యంగా శారీరకంగా బలహీనంగా ఉంటారు. కానీ మీరు జబ్బు పడ్డ మనిషిగా కనబడుతున్నారు. ఆత్మజ్ఞానులు ఎన్నడూ జబ్బుపడరు" అని వారు అన్నారు.

ఇది అక్కడ నాకు లభించిన రెండో పాఠం. బాపూ ఆనాడు అన్న మాటలు నేను ఎన్నటికీ మరచిపోలేను.

కూరలు తరుగుతూ ఉన్నప్పుడు జరిగిన సంభాషణ అంతే. ఆ తరువాత పనికి సంబంధించిన మాటలు అప్పుడప్పుడూ మాకు జరుగుతూ ఉండేవి. మిగతా సమయమంతా పనిలో మునిగి ఉండేవాణ్ణి. బాపూ చాలామందితో మాట్లాడుతూ ఉండేవారు. ఆ మాటలు నేను వింటూ ఉండేవాణ్ణి. ఈ పిల్లవాడు సద్భావంతో వచ్చాడని బాపూ గ్రహించారు. కానీ మిగతావాళ్లంతా నన్ను ఒక జడ పదార్థమని భావించారు. ఒకరోజున ఒక వ్యక్తి "ఇతడు గౌణ భాష" అన్నారు నన్ను గురించి. వెంటనే "కాదు, భక్తి భాష" అని అన్నాను. 'నిజమే, జ్ఞాన భాష మరియు భక్తి భాష' అని బాపూ అన్నారు. ఇదీ బాపూ గొప్పతనం. నావంటి బాలుడి మాటకు కూడా విలువనిచ్చి అంగీకరించగలిగిన వినమ్రత వారికి ఉంది. అప్పుడు అక్కడివారంతా ఇతడికి మాటలు కూడా వచ్చు అని తెలుసుకున్నారు. ఈ విషయంలో వాళ్ల పొరపాటు కూడా ఏమీ లేదు. ఆ రోజుల్లో నేను కోపంగా ఉండేవాణ్ణి. 21 సంవత్సరాల వయసులో ఉన్న కుర్రాణ్ణి. సభ్యత, శిష్టత నాలో బహు తక్కువ అనే విషయం నా స్నేహితులందరికీ తెలుసు. ఎవ్వరితోను మాట్లాడేవాణ్ణి కాను. నా పనిలో మునిగి ఉండేవాణ్ణి. లేకపోతే అధ్యయనం, ధ్యానం, చింతనం. అంతకంటే మరో ధ్యాస నాకు లేదు.

ఒకరోజు ఉదయాన్నే లేచి నేను నా గదిలో ఉపనిషత్తులు వినిపించసాగాను. ఆశ్రమవాసులు విన్నారు. ఇతడికి సంస్కృతం వచ్చని వాళ్లు బాపూకు చెప్పారు. తరువాత బాపూ వివరం అడిగారు. అప్పుడప్పుడు ప్రార్థనా సమయంలో ఏమైనా చెప్పమని నాకు బాపూ అవకాశం ఇవ్వడం ప్రారంభించారు. ఇలా నడిచింది నా వ్యవహారం.

బాపూ నన్ను తీర్చిదిద్దాలని నిర్ణయించుకొన్నారు. జనాన్ని నా దగ్గరకు పంపుతూ ఉండేవారు. వార్ధా వెళ్లిన తరువాత సేవాగ్రామ్ వచ్చిన ప్రతి జిజ్ఞాసువును.. 'వినోబాను కలిసివచ్చారా' అని బాపూ అడుగుతూ ఉండేవారు. కలవకపోతే తప్పక కలిసి రమ్మని చెప్పేవారు. ఒకసారి బాపూ ఒక వ్యక్తిని నా దగ్గరికి పంపారు. వారు భారతదేశానికి చెందిన ఒక గొప్ప విప్లవవాది. బాపూ చెప్పినందున వారు

కాలినడకన పవనార్ ఆశ్రమం వచ్చారు. నేను పొలంలో తవ్వకం పనిచేస్తున్నాను. తలపైకెత్తి చూద్దును కదా.. ఎదురుగా ఆ సోదరుడు నిలబడి ఉన్నాడు. ఎందుకొచ్చారని అడిగాను. ఊరికినే, దర్శనం కోసం వచ్చానని అన్నాడు. అంతే. ఇక మాటలు లేవు. నేను నా పనిలో లీనమైపోయాను. ఆ సోదరుడు నిలబడే ఉన్నాడు. ఏమీ మాట్లాడలేదు. ఆయన తిరిగి వెళ్లిపోయారు. 'ఏం మనిషండీ, ఏమీ మాట్లాడలేదు' అని నన్ను గురించి బాపూజీతో ఆరోపణా ధోరణితో అన్నాడు. బాపూజీకి అంతా అర్థమైంది. మీరు వెళ్లినప్పుడు వినోబా ఏం చేస్తున్నాడని బాపూ అడిగారు. పొలంలో తవ్వకం పని చేస్తున్నాడు.. అని ఆ వ్యక్తి జవాబిచ్చాడు. 'అయితే కోపం ఎందుకు?.. తన పని చేసుకొంటూ ఉన్నాడు. వినోబా నీతో ఎలా మాట్లాడతాడు? పెద్దమనిషినెవరినైనా కలవాలనుకుంటే ముందుగా వారి దగ్గర సమయం తీసుకోవాలి కదా!' అని వ్యక్తికి బాపూ నచ్చచెప్పారు. కానీ ఆ తరువాత నన్ను కలిసినప్పుడు "పెద్దమనిషీ! ఎవరైనా దగ్గరకు వస్తే వాళ్లతో మాట్లాడవద్దా? అది కూడా ఒక పనే కదా" అని బాపూ ప్రేమగా మందలించారు. ఈ విధంగా నెమ్మదినెమ్మదిగా బాపూ నన్ను తీర్చిదిద్దారు. నేను ఒక అడవిమృగంగా ఉండేవాణ్ణి. బాపూజీ నన్ను పెంపుడు అడవి జంతువుగా తీర్చిదిద్దారు. వారి చరణ సాన్నిధ్యంలో కూర్చొని.. అసభ్యతగా ఉండే నేను సేవకునిగా రూపొందాను. బాపూ వెంట ఉన్నందువల్ల నాకు సేవాభావం యెడ అభిరుచి పెరిగింది. సేవానిరతి భగవంతుని పూజాసాధనమనీ, ప్రజలు భగవత్‌స్వరూపులని తెలుసుకున్నాను. దాన్ని జీవితలక్ష్యంగా మలచుకున్నాను.

నన్ను బాపూ పరీక్షించారో లేదో నాకు తెలియదు. కానీ నేను మాత్రం నా బుద్ధి అనే ఒరిపిడిరాయి మీద వారిని బాగా పరీక్షించి చూశాను. నా పరీక్షలో బాపూ ఏమాత్రం పాస్ కాకపోయినా నేను ఆయన దగ్గర ఉండేవాణ్ణి కాదు. నాలో ఎన్ని దోషాలు వారు చూశారో నాకు తెలియదు కాని, నన్ను మాత్రం తన దగ్గర ఉండనిచ్చారు. అది వారి గొప్పతనం. నాకు వారి సత్యనిష్ఠలో ఏమాత్రం లోటు కనబడినా, దోషం కనబడినా నేను వారి దగ్గర ఉండగలిగే వాడిని కాదు. తాము పూర్ణపురుషులమని, ముక్తపురుషులమని తమను తాము భావించుకునే చాలామంది మహాపురుషుల్ని నేను చేశాను. అటువంటి వారెవ్వరూ నన్ను ఆకర్షించలేకపోయారు. కానీ ఎల్లప్పుడూ తాను అపూర్ణుడనని భావిస్తూ ఉండే బాపూ మాత్రం నన్ను అమోఘంగా ఆకర్షించారు. నేను ఇంకా సత్యానికి చాలా దూరంలో ఉన్నానని బాపూ పదే పదే చెబుతూ ఉండేవారు. నా మీద బాపూ ప్రభావం పడినంతగా పూర్ణ పురుషులమని చెప్పుకునే మరెవ్వరి ప్రభావం పడలేదు. నేను బాపూను కలిశాను. ముగ్ధుడ్ని అయిపోయాను. అందుకు కారణం వారి అంతర్బాహ్య సమైక్యత సమానత్వం. కర్మయోగమంటే ఏమిటో వారి దగ్గరే తెలుసుకున్నాను. ఆ దీక్ష వారి దగ్గర పొందాను. భగవద్గీతలో కర్మయోగాన్ని గురించి వర్ణించారు. కానీ ఆ యోగాన్ని ప్రత్యక్షంగా బాపూ జీవితంలో నేను దర్శించాను. గీతలో స్థితప్రజ్ఞుడి లక్షణాలు వర్ణించబడ్డాయి. కానీ అట్టి స్థితప్రజ్ఞ లక్షణాలు తమ జీవితంలో మూర్తీభవించుకొన్న మనుషులు లభించే అదృష్టం కలగడం దుర్లభం. కానీ ఆ లక్షణాల సమీపానికి వెళ్లగలిగిన మనిషిని మాత్రం బాపూలో నేను కండ్లారా చూశాను. బాపూ సన్నిధిలో ఆశ్రమ జీవిత స్వరూపం నా దృక్పథంతో చూశాను. చాలా విషయాలు గ్రహించాను. జీవితం అఖండమని, ఏకబిగిన సాగే విధానమని తెలుసుకొన్నాను. బాపూ తాను గురువునని ఎన్నడూ భావించలేదు. చెప్పకోలేదు. అలాగే ఫలానా వారి శిష్యుడినని కూడా చెప్పుకోలేదు. అలాగే నేను కూడా ఎవ్వరికీ గురువును కాదు, శిష్యుణ్ణీ కాదు. అయితే గురువు అవసరం, గొప్పతనాన్ని నేను ఎరుగుదును. స్పర్శ చేతను, దర్శనం చేతను, శిష్యులను గురువు ఉద్ధరించగలడు. కేవలం సంకల్పం ద్వారా శిష్యుణ్ణి ఉద్ధరించగల పూర్ణాత్ములైన గురువులు కూడా ఉంటారు. అయితే ఇదంతా ఊహాజనితమని భావిస్తున్నాను. పూర్ణాత్ములైన గురువులను కూడా నేను చూడలేదు. గురువును గురించిన ఈ వివరం మాని నా విషయంలో మాత్రం బాపూ ఆశ్రయం లభించిన తరువాత నేను చాలా నేర్చుకొన్నానని, నేర్చుకొన్న ఆ విషయాలు జీవితాంతం నాకు ఉపయోగపడగలిగినవని స్పష్టం చేస్తున్నాను. బాపూ ఆశ్రయం నాకు మార్గం చూపించే మాతృస్థానం.

బాపూ ఆత్మకథ ప్రచురణ కాబోవుటకు పూర్వం నాతో ఆ విషయమై ఒక పర్యాయం మాట్లాడారు. "మీరు సత్యవాదులు, మిథ్యలేమీ రాయరు. అందువల్ల ఎవరికీ నష్టం కలగదు. కానీ ఏమి లాభం కలుగుతుందో తెలియదు. అయినా ఎవరికి ఏది అవసరమో అదే గ్రహిస్తారు" అని నా అభిప్రాయం చెప్పాను.

'మీ మాటల వల్ల నాకు కావలసింది లభించింది.. నష్టం అయితే కలుగదు అని అన్నారే, అదీ ముఖ్యం' అని బాపూ అన్నారు. బాపూ గుజరాతీ భాషలో మాట్లాడుతున్నారు. "అపణాంబధాం కామోనుంపరిమాణ మీడుంఛే" మన పనులన్నింటి పరిణామం శూన్యమే అని అంటూ వారు తన వేలితో శూన్యంలో గాలిలో పెద్ద సున్నా చుట్టి చూపించారు. "అపణేతో సేవాకరీ ఛూటియే" మనం సేవ చేసి వెళ్లిపోవాలి.. అని అన్నారు. వారు ఆనాడు అన్న ఆ మాట నా హృదయంలో నాటుకుపోయింది. బాపూ బోధల తత్వజ్ఞానమంతా ఆ మాటల్లో ఇమిడి ఉంది.

## వైక్కమ్ సత్యాగ్రహ సమయంలో..

1925 నాటి మాట. కేరళ ప్రాంతంలో వైక్కమ్‌లో హరిజనుల దేవాలయ ప్రవేశం కోసం సత్యాగ్రహం

జరుగుతున్నది. ఆ తోవన కూడా హరిజనుల్ని నడవనిచ్చేవారు కాదు. అందువల్ల సత్యాగ్రహం ప్రారంభమైంది. చాలాకాలం నడిచింది. పరిణామం అనుకూలం అవుతుందనే ఆశ కలుగలేదు. అప్పుడు నేను వార్ధా ఆశ్రమంలో ఉన్నాను. బాపూ సబర్మతీలో ఉన్నారు. సత్యాగ్రహం ఎలా జరుగుతున్నదో చూసి రమ్మని బాపూ నన్ను ఆదేశించారు. నా వల్ల రెండు పనులు జరగాలని వారి భావన. సనాతనవాదులతో చర్చలు జరిపి పని జరుగుతుందేమో చూడటం మొదటి పని. సత్యాగ్రహ విధానంలో మార్పు అవసరమైతే సూచించడం రెండవ పని. అప్పుడు నాకు అంత జ్ఞానమే లేదు, అనుభవమూ లేదు. కానీ బాపూజీకి నాయెడ శ్రద్ధ మాత్రం అధికం. నేను అమితశ్రద్ధతో అక్కడికి వెళ్లేందుకు సిద్ధపడ్డాను. అనేకసార్లు పండితులతో చర్చలు జరిపాను. వారు సంస్కృతంలోనే చర్చలు జరగాలని కోరారు. అందువల్ల నేను వారితో సంస్కృతంలోనే మాట్లాడేందుకు ప్రయత్నించాను. కానీ వారి హృదయాల్ని నేను మార్చలేకపోయాను. ఇక సత్యాగ్రహ విధానంలో మార్పు సూచించవలసిన పని మిగిలింది. పరిశుద్ధ విధానంతో సత్యాగ్రహం జరిగితే మంచి ఫలితం తప్పక లభిస్తుందని నా విశ్వాసం. సత్యాగ్రహం జరిపే విధానంలో కొన్ని మార్పులు సూచించాను. ఆ వివరం బాపూజీకి చెప్పాను. ఆ తరువాత బాపూ స్వయంగా అక్కడికి వెళ్లారు. సమస్య పరిష్కారం అయిపోయింది.

బాపూ సూచించిన కార్యక్రమాలన్నింటిలోను నా శక్తికి తగ్గట్టు పాల్గొనేందుకు ప్రయత్నించేవాణ్ణి. 1921లో గాంధీ గారు కాంగ్రెస్‌కు ఒక కోటి మంది మెంబర్లను చేర్చి ఒక కోటి రూపాయల తిలక్ నిధిని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అప్పుడు నేను వార్ధాలోనే ఉన్నాను. వార్ధాలో ఆ పనికి పూను కున్నాను. ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ సిద్ధాంతాల్ని చెప్పేవాణ్ణి. నచ్చినవారిని కాంగ్రెస్ సభ్యులుగా చేర్చేవాణ్ణి. ప్రతిరోజు అయిదు లేక ఆరు గంటల పాటు తిరిగి పనిచేసేవాణ్ణి. అయినా ఆరు లేక ఏడుగురిని మాత్రం మెంబర్లుగా చేర్చగలిగేవాణ్ణి. ఇతరులు అంతే సమయంలో 150 లేక 200 మందిని మెంబర్లుగా చేర్చేవారు. కారణం ఏమిటో నాకు బోధపడలేదు. 'నేనూ మీ వెంట వస్తాను. పని ఏ విధంగా చేయాలో అయిదారు రోజుల్లో నేర్చుకుంటాను' అని వారికి చెప్పాను. అప్పుడు వారు రెండు చేతులు జోడించి, 'అయ్యా, మీరు మా వెంట రావద్దు. మీరు చేస్తున్నదే సరైన పని. మేము ఏ మిల్లు యజమానినో పట్టుకొని 50 రూపాయలు ఆయన దగ్గర తీసుకుంటాము. ఆ డబ్బుతో అక్కడ పని చేసే కార్మికుల్ని మెంబర్లుగా చేర్చుకుంటున్నాము' అని నిజం చెప్పారు. ఆ తరువాత నేను ఆ కార్యక్రమం విరమించుకున్నాను.

ఆ రోజుల్లో నేను స్వయంగా కాంగ్రెస్ మెంబరును. 1925 నుంచి నేను ఆ సభ్యత్వాన్ని విరమించుకున్నాను. బాపూ 1934 నుంచి మానుకున్నారు. కొందరు మిత్రులు నన్ను అడగకుండా నాపేరు నాగపూర్ కాంగ్రెసు కమిటీలో చేర్చారు. అందుకు సంబంధించిన ఒక సమావేశంలో పాల్గొనేందుకై మధ్యాహ్నం 12 గంటలకు నాగపూర్‌కు బయలుదేరాను. మూడు గంటలకు మీటింగు. రైల్లో చదవడానికి రుగ్వేదం వెంట తీసుకెళ్లాను.

నాగపూర్‌లో మూడు గంటలకు సభ ప్రారంభమైంది. మెంబర్లందరికీ సంస్థ నియమావళి ఒక్కొక్క కాపీ ఇచ్చారు. సమావేశ ప్రారంభంలోనే ఒక సోదరుడు లేచి.. ఈ సమావేశానికి నోటీసు అందలేదు, అందువల్ల ఈ సమావేశం చట్టప్రకారం చెల్లదు అని, సమావేశానికి కనీసం ఇన్ని రోజుల ముందుగా నోటీసు పంపాలి, చూడండి నియమావళి నాలుగవ పేజీలో గల అయిదవ క్లాజు అని ఆక్షేపణ తెలియజేశాడు. మేమంతా ఆ పేజీ తెరిచి చూశాము. ఇంతలో మరో సోదరుడు లేచి, మీరు చెప్పింది నిజమే. కానీ ప్రత్యేక పరిస్థితిలో ఆ నియమం పాటించనవసరం లేదు. చూడండి ఫలానా పేజీ.. అని సవరణ ప్రతిపాదించాడు. ఇక నియమావళిని గురించి చర్చ ప్రారంభమైంది. నేను కూడా నియమావళిని తిరగేశాను. మీటింగు జరగకపోతే మేమంతా మూర్ఖులం కింద పరిగణించబడతామని నాకు అనిపించింది. నేను ఆ నియమావళిని అధ్యయనం చేయలేదు. చివరకు సమావేశం చట్టవిరుద్ధం కాదని తేల్చారు. చర్చ ప్రారంభమైంది. ఇంతలో భోజనాలకు సమయం అయినందున సమావేశం ఆపివేశారు. రాత్రి తిరిగి సమావేశం ప్రారంభమైంది. నేను ఆ సమావేశానికి వెళ్లలేదు. మరునాడు వార్ధా చేరగానే ఆ కమిటీ సభ్యత్వానికి, కాంగ్రెస్ ప్రాథమిక సభ్యత్వానికి కూడా రాజీనామా పంపించి వేశాను. అందుకు కారణం స్పష్టం. ఈ మీటింగుల్లో ఎదురుబదురుగా కూర్చోగానే మెంబర్లు మానవత్వాన్ని మరచిపోయి నియమాల్ని గురించి ఎక్కువగా పట్టించుకోవడం ప్రారంభిస్తారు. నాకు అదంతా శుష్క వ్యవహారంగాను, నీరస వ్యవహారంగాను అనిపిస్తుంది. ఇక అట్టి దాని జోలికి పోలేదు.

వారు (బాపూ) ఆజ్ఞాపించడం, నేను వారి ఆజ్ఞను పాటించడం ఇదే ఈనాటి వరకు నా జీవన విధానం. దేశ సేవారంగంలో హింసతో కూడిన రెండు మూడు పరాక్రమాలు చేసి ఆహుతి అయిపోయి ప్రతిష్ఠ పొందాలని కోరిక నాకు ఉండేది. బాపూ నా హృదయంలో నుంచి ఆ భావాన్ని పారద్రోలారు. ఆశ్రమంలో కార్యక్రమాలు నిర్వహిస్తూ నిత్యమూ వికాసం పొందుతూ ఉండేవాణ్ణి.

(1917లో బాపూ దీనబంధు అండ్రూస్‌తో వినోబాను గురించి చెబుతూ, వారు ఆశ్రమంలో గల దుర్లభమైన రత్నాల్లో ఒకరు. ఏదో తీసుకొని వెళ్లడానికి వారు ఇక్కడకు రాలేదు, ఇచ్చేందుకు వచ్చారు.. అని చెప్పారు)


జనబలం
అక్టోబర్ 2019
లోక్‌సత్తా ఉద్యమ సంస్థ
మాసపత్రిక

### నేతల రాచరికాన్ని, ప్రజల అరాచకత్వాన్ని కడిగేసిన

# గంగా ప్రవాహం..

## గాంధీజీ బనారస్ హిందూ యూనివర్సిటీ ప్రసంగం!

దక్షిణాఫ్రికాలో అహింసాపోరాటం చేసి గణనీయ ప్రభావం చూపిన అనంతరం గాంధీజీ **1915**లో భారత్‌కు తిరిగి వచ్చారు. అదే సమయంలో బనారస్ హిందూ యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో తన రాజకీయ ఆలోచనలను వెల్లడించారు. అది సత్యాన్వేషణ ఆలోచనలను ప్రజల ముందుంచే అసాధారణ రాజకీయ సంభాషణ తప్ప.. వాగాడంబరాల ఉపన్యాసం కాదు. బ్రిటీషువాళ్లున్నా, పోయినా, అధికారంలో ఎవరున్నా మనల్ని మనం పరిపాలించుకోవాలంటే కొన్ని మౌలికమైన దిద్దుబాట్లు అవసరమని ఆనాడే గాంధీజీ సురాజ్య గళాన్ని వినిపించారు. “స్వరాజ్యమంటే కొంతమంది పెద్దలు గద్దెనెక్కటం కాదు.. ఎక్కడో మారుమూలనున్న సామాన్యునికి కూడా తన జీవితం మీద తనకు అధికారం ఏర్పడటం” అంటూ నిజమైన స్వయంపాలనను సుమారు **103** ఏళ్ల క్రితం అర్థం చేసుకుని అందుకోసం ఆ గొప్ప భారతీయుడు పోరాడటం జాతీయోద్యమానికి ఘననివాళి.



సంచికలోని ఇంతకుముందు వ్యాసంలో వినోబా భావే చెప్పినట్లు.. గాంధీజీ బనారస్ వర్సిటీ ప్రసంగం పెద్దఎత్తున చర్చనీయాంశమైంది.

బనారస్ హిందూ విశ్వవిద్యాలయ ప్రారంభం సందర్భంగా ప్రసంగించవలసిందిగా గాంధీజీని పండిత మాలవీయ ఆహ్వానించారు. యూనివర్సిటీ ప్రధాన ప్రాంగణానికి పునాది రాయి వేయటానికి వైస్రాయ్ లార్డ్ హార్డింజ్ ప్రత్యేకించి విచ్చేశారు. ఆయన ప్రాణరక్షణ కోసం పోలీసులు అదనపు జాగ్రత్తలు తీసుకున్నారు. ఎటుచూసినా పోలీసు వలయం. వైస్రాయ్ ప్రయాణించే మార్గంలోని ఇళ్లన్నీ పహారాలోకి వచ్చేశాయి. బనారస్ దిగ్బంధంలోకెళ్లింది.

భారతదేశంలోని సుప్రసిద్ధులు వచ్చారు. వారిలో చాలామంది ఉపన్యాసాలిచ్చారు. ఫిబ్రవరి **4, 1916**న గాంధీజీ వంతు వచ్చింది. విరిసీవిరియని ఆలోచనల టీనేజ్ యువత ఎక్కువగా ఉన్న సభనుద్దేశించి ఆయన మాట్లాడారు. ధగధగలాడే ఆభరణాలతో సర్వాలంకార భూషితులైన యువరాజవంశీయులతో వేదిక మిరుమిట్లుగొలుపుతోంది. దర్భాంగ మహారాజు అధ్యక్ష స్థానంలో ఆసీనులై ఉన్నారు.


చిన్నపాటి ముతక ధోతీ, కథియవాడి గడియారం, తలపాగా ధరించిన గాంధీ మాట్లాడటానికి లేచి నిలబడ్డారు. తన చుట్టూ ఉన్న పోలీసుల భద్రతా ఏర్పాట్లు, విలాసవంతమైన వాతావరణం ఆయన్ను ఎంతగానో బాధించాయి. సభికులవైపునకు తిరిగారు. ఎటువంటి భేషజాలూ లేకుండా మనసులోని ఆలోచననే బైటికి చెబుతానని, అదే తన ఉపన్యాసమని మనవి చేశారు..

నేను ఇక్కడికి చేరుకోగలగడానికి ముందు జరిగిన సుదీర్ఘ ఆలస్యానికి వినమ్రంగా క్షమాపణ చెప్పాలనుకుంటున్నాను. ఆలస్యానికి నేనుగానీ ఇతరులుగానీ కారణం కాదని, ఇందులో మానవ ప్రమేయం లేదని తెలుసుకుంటే మీరంతా తక్షణం నా క్షమాపణను అంగీకరిస్తారు. నిజానికి నేను ప్రదర్శనలో జంతువులాంటి వాడిని. ఈ ప్రదర్శనల్లో మన ప్రమేయం లేకుండా కొన్ని అనివార్య ఘటనలు జరుగుతుంటాయి. వాటి వల్ల తలెత్తే ఇబ్బందుల్ని నా నిర్వాహకులు దాటవేస్తుంటారు. ఇందుకోసం పాపం వారు శక్తికిమించి దయను కనబరుస్తుంటారు కూడా. కానీ ఈవేళ అనుకోకుండా జరిగిన పలు ఘటనల విషయంలో అలాంటి ఏర్పాట్లు లేవు. మీకు, నాకు, నిర్వాహకులకు, నన్ను తీసుకొచ్చినవారికి అందరికీ అనుకోనివి ఇవి. అందుకే ఈ ఆలస్యం.

మిత్రులారా, ఇప్పుడే ప్రసంగించి కూర్చున్న శ్రీమతి బీసెంట్ అసమాన ప్రసంగ ప్రవాహంలో కొట్టుకుపోయి, మన యూనివర్సిటీ ఏదో పరిపూర్ణ స్థాయిని అందిపుచ్చేసుకుందని నమ్మేయకండి. ఇంకా ఉనికిలోకి రావాల్సిన, ఎదగాల్సిన విశ్వవిద్యాలయమిది. మున్ముందు రావాల్సిన యువజనులంతా కూడా వచ్చేశారు, ఓ పెద్ద సామ్రాజ్యంలో సంపూర్ణ పౌరులుగా రూపుదిద్దుకున్నారు.. అనుకోబోకండి. ఆ తరహా అభిప్రాయాలలో కొట్టుకుపోవద్దు. ఈ

సాయంత్రం వేళ నేను మాట్లాడాల్సింది ప్రధానంగా మిమ్మల్ని, అంటే విద్యార్థి ప్రపంచాన్ని ఉద్దేశించే! ఏ ఆధ్యాత్మిక జీవనం విషయంలో ఈ దేశం ఖ్యాతిని గడించిందో, ఏ ఆధ్యాత్మిక జీవనం విషయంలో ఈ దేశానికి సాటిలేదో, దాన్ని పెదవుల ద్వారానే వ్యాపింపచేయవచ్చు అని ఒక్క క్షణం పాటు మీరు అనుకున్నా.. మీ ఆలోచన తప్పు అని చేతులు జోడించి చెబుతున్నాను. నన్ను నమ్మండి. భారతదేశం ఏదోకరోజు ప్రపంచానికే దిశానిర్దేశం చేస్తుందని మీరు కేవలం మాటల ద్వారా ఎప్పటికీ సందేశాన్ని ఇవ్వలేరు. నా మట్టుకు నాకు ప్రసంగాలు, ఉపన్యాసాలు అంటే విసుగొచ్చేసింది. గత రెండు రోజులుగా ఇక్కడ ఇస్తున్న ప్రసంగాలను మాత్రం ఆ విభాగంలో చేర్చకుండా మినహాయిస్తున్నాను. ఎందుకంటే, అవి అవసరమైనవి! కానీ ఉపన్యాసాల-తయారీలో మన వనరులు దాదాపు ఖాళీ అయ్యాయని చెప్పటానికి నేను సాహసిస్తున్నాను. మనకు వీనుల విందు, కనువిందు చేస్తే చాలదు.. మన హృదయాలను తాకాలి, మన చేతులను, కాళ్లను కదిలించగలగాలి.

భారతీయ స్వభావంలోని నిరాండబరతపై మన పట్టును కాపాడుకోవాలంటే.. మన కాళ్లు, చేతులు మన హృదయాలకనుగుణంగా ఏకతాళంలో స్పందించటం ఎంత అవసరమో గత రెండు రోజులుగా మనకు చెబుతున్నారు. కానీ అవి తొలిపలుకుల్లాంటివే. ఈ గొప్ప కళాశాల నీడలో, ఈ పవిత్ర నగరంలో నాకు విదేశీ అయిన భాషలో నా దేశస్తులనుద్దేశించి మాట్లాడాల్సి రావటం తీవ్ర బాధాకరం, అవమానకరం అని స్పష్టంగా చెప్పదలచుకున్నాను. నాకు తెలుసు- ఈ రెండు రోజుల్లో వరస ప్రసంగాలకు హాజరైనవారిని పరీక్షించటానికి నన్ను ఎగ్జామినర్‌గా నియమిస్తే, పలువురు ఫెయిలవుతారు. ఎందుకంటే, ఆ ప్రసంగాలు వారిని తాకలేదు.




డిసెంబర్‌లో జరిగిన కాంగ్రెస్ మహాసభల్లో నేను పాల్గొన్నాను. సభికులు ఇంకా ఎక్కువసంఖ్యలో ఉన్నారు. మీరు నమ్ముతారో లేదో.. బొంబేలోని ఆ సభల్లో ఎక్కువమంది శ్రోతల్ని ప్రభావితం చేసిన ప్రసంగాలన్నీ కేవలం హిందుస్తానీలో చేసినవే! జాగ్రత్తగా వినండి, అందరూ హిందీ మాట్లాడే బనారస్‌లోకాదు.. బొంబేలో సంగతి నేను చెబుతున్నది. బొంబే ప్రెసిడెన్సీ యాసలు ఒకపక్క, హిందీ మరోపక్క ఉన్నా కూడా.. ఇంగ్లీష్‌కి, భారతీయ సోదర భాషకి మధ్య ఉన్నంత పెద్ద అంతరం వాటి మధ్య కనిపించదు. హిందీలో మాట్లాడిన వక్తల భావాలను కాంగ్రెస్ శ్రోతలు మెరుగ్గా అర్థం చేసుకోగలిగారు. ఈ యూనివర్సిటీకి వచ్చే యువతకు వారి స్థానిక భాషలో చదువు చెప్పేందుకు చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నా. మన భాషలంటే మనల్ని మనం సమీక్షించుకోవటం. అత్యుత్తమ ఆలోచనల్ని వ్యక్తం చేసే శక్తి మన భాషలకు లేదు అంటే.. మనం ఎంత త్వరగా మనుగడను కోల్పోతే మనకు అంత మంచిది అంటాను. ఇంగ్లీష్ ఎప్పటికైనా భారతదేశ జాతీయ భాష అవుతుందని కలలుగనే వారెవరైనా ఉన్నారా? ఎందుకు దేశం మీద ఈ వైకల్యాన్ని రుద్దుతున్నాం? ఇంగ్లీష్ పిల్లతోనో, పిల్లవాడితోనో మన పిల్లలు పోటీపడితే.. సమానత్వం ఏ స్థాయిలో ఉంటుందో ఒక్కసారి ఊహించుకోండి.

కొంతమంది పూణె ప్రొఫెసర్లతో సన్నిహితంగా మాట్లాడే సదవకాశం నాకు లభించింది. ఇంగ్లీష్ భాష ద్వారా పరిజ్ఞానాన్ని పెంచుకున్న ప్రతి భారతీయ యువతా తన జీవితంలో కనీసం ఆరు విలువైన సంవత్సరాలను కోల్పోయినట్టని వారు నాకు తేల్చిచెప్పారు. మన స్కూళ్లలో, కాలేజీల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్యతో ఆ సంవత్సరాలను గుణించండి. ఎన్ని వేల సంవత్సరాలను ఈ దేశం కోల్పోయిందో మీకే అర్థమవుతుంది. 'చొరవ లేదు' అన్నది మన మీదున్న ఆరోపణ. మన జీవితంలో విలువైన సంవత్సరాలను ఒక విదేశీ భాషలో ప్రావీణ్యం సంపాదించుకోవటానికే వెచ్చిస్తుంటే.. మనకు చొరవ ఎలా వస్తుంది? ఈ ప్రయత్నంలో కూడా మనం విఫలమయ్యాం. హిగ్గిన్‌బాథమ్ తరహాలో తన శ్రోతల్ని ప్రభావితం చేయటం నిన్న, ఈరోజు ఏ వక్తకయినా సాధ్యమైందా? సభికులను ఆకట్టుకోలేకపోవటం ఆ వక్తల తప్పు కాదు. కావలసినదానికన్నా ఎక్కువ విషయాన్నే వారు మన కోసం తమ ప్రసంగాల ద్వారా అందించారు. కానీ వారి మాటలు మన ఇంటి దాకా రావు. ఇంగ్లీష్ చదువున్న భారతీయులే ముందున్నారు, నాయకత్వం వహిస్తున్నారు, దేశానికి అన్ని పనులు చేస్తున్నారు.. అని చెప్పుకోవటం నేను విన్నాను. అలాకాకుండా ఇంకోలా అయితే భయంకర ఉపద్రవమే! మనకు అందుతున్న చదువు.. ఆంగ్ల విద్య మాత్రమే. కచ్చితంగా దాని పట్ల మనం ఎంతోకొంత సానుకూలంగా స్పందించాలి. కానీ ఒక్కసారి ఊహించండి- గత యాభై ఏళ్లుగా మన స్థానిక భాషల్లో మనకు చదువు అందుతుందనుకోండి, ఇప్పుడు ఎలా ఉండేవాళ్లం? మనకు ఏమి సమకూరేది?.. మనకు స్వతంత్ర భారతదేశం ఉండేది, చదువుకున్న స్వదేశీయులుండేవారు, సొంత దేశంలోనే విదేశీయుల్లా కాకుండా భారతదేశ అంతరాత్మతో మాట్లాడుతుండేవాళ్లం. అలాంటి స్వదేశీ విద్యావంతులు అత్యంత నిరుపేదల మధ్య పనిచేస్తుండేవారు. ఈ యాభై ఏళ్లలో వారు సాధించింది దేశ వారసత్వ సంపదగా ఉండేది. ఈవేళ మన భార్యలు కూడా మన అత్యుత్తమ ఆలోచనలో భాగస్వాములు కాలేకపోతున్నారు. ప్రొఫెసర్ బోస్, ప్రొఫెసర్ రే ని చూడండి. వారి పరిశోధనలు సామాన్య ప్రజల ఉమ్మడి ఆస్తి కాకపోవటం అవమానకరం కాదా?

ఇంకో అంశానికి వెళ్దాం.

స్వయంపాలనపై కాంగ్రెస్ ఓ తీర్మానాన్ని ఆమోదించింది. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ, ముస్లిం లీగ్ తమ బాధ్యతను

నెరవేరుస్తాయని, ఆచరణాత్మకమైన సూచనలను అందిస్తాయని నేను నిస్సందేహంగా నమ్ముతున్నాను. అదేసమయంలో దాపరికం లేకుండా అంగీకరిస్తున్నాను– వాళ్లు ఎంతమేర చేయగలరు అనే దాని మీద నాకు అంత ఆసక్తి లేదు. నాకున్న ఆసక్తంతా– ఈ దేశ విద్యార్థి ప్రపంచం ఏం సాధిస్తుంది? సామాన్య ప్రజలు ఏం సాధిస్తారు? అనే అంశాల మీదే! కాగితాల్లో వక్కాణించటం ద్వారా మనకు స్వయంపాలన రాదు. ఎన్ని ప్రసంగాలైనా మనల్ని స్వయంపాలనకు తగురీతిలో సిద్ధం చేయలేవు. మన ప్రవర్తన మాత్రమే మనల్ని స్వయంపాలనకు అర్హులుగా తయారుచేస్తుంది. మనల్ని మనం పరిపాలించుకోవటానికి మనం ఏ విధంగా ప్రయత్నిస్తున్నాం మరి?

నాలో ఆలోచిస్తున్న విషయాల్నే ఈ సాయంత్రం వేళ బైటికి చెబుతున్నాను. ప్రసంగం చేయదలచుకోలేదు. దాచుకోకుండా ఉన్నదున్నట్టు మాట్లాడటాన్ని.. తన అంతరంగాన్ని వివరిస్తున్న వ్యక్తి ఆలోచనలను పంచుకోవటంగానే భావించండి. సభామర్యాదల్ని నేను అతిక్రమించినట్టు అనిపిస్తే.. నేను తీసుకుంటున్న స్వేచ్ఛకు క్షమించండి. నేను గత సాయంత్రం విశ్వనాథ ఆలయాన్ని సందర్శించాను. ఆ వీథుల్లో నుంచి నడుస్తున్నప్పుడు నన్ను కదిలించిన ఆలోచనలే ఇవి. ఈ గొప్ప దేవాలయానికి ఎక్కడినుంచో ఓ అపరిచితుడు వస్తే.. హిందువులుగా మనమేంటి అని ఆలోచనలో పడక తప్పదు. అతను మన తీరుని ఖండిస్తే.. అన్యాయం అనగలమా? మన స్వభావానికి ఈ సమున్నత దేవాలయం సంకేతం కాదా? ఒక హిందువుగా మనసు నిండా భావోద్వేగంతో మాట్లాడుతున్నాను. మన పవిత్ర దేవాలయం వీథులు అంత మురికిగొట్టుగా ఉండటం సరైనదేనా? చుట్టూ ఉన్న ఇళ్లను.. ఏదోలా అన్నట్టు కట్టేశారు. వీథులు మెలికలతో ఇరుకిరుకుగా ఉన్నాయి. మన దేవాలయాలు విశాలతకు, పరిశుభ్రతకు నమూనాలు కాకపోతే, మన స్వయంపాలన ఏ రకంగా ఉంటుంది? తమకిష్టానుసారమో లేక తప్పదనో ఆంగ్లేయులు భారతదేశం నుంచి మూటాముల్లెతో వెళ్లాక.. మన దేవాలయాలు పవిత్రతకు, పరిశుభ్రతకు, శాంతికి నిలయాలుగా ఉండాలా లేదా?

మనం స్వయంపాలన గురించి ఆలోచించే ముందు అవసరమైన కసరత్తు చేయాలని కాంగ్రెస్ అధ్యక్షుడు అన్న మాటలతో నేను పూర్తిగా ఏకీభవిస్తాను. ప్రతి నగరంలో రెండు విభాగాలున్నాయి. కంటోన్మెంట్, ప్రధాన నగరం. నగరం చాలావరకు దుర్గంధం వెదజల్లే కొట్టంలా ఉంది. మనం నగర జీవనం అలవాటు లేని ప్రజలం. కానీ మనకు నగర జీవనం కావాలంటే, పల్లెసీమల్లోలా ఇష్టమొచ్చినట్టు వ్యవహరించటం సాధ్యం కాదు. భవనాల అంతస్తుల్లో ఉన్నవారు తమ మీద ఉమ్మి వేస్తారనే భయం వల్ల.. భారతదేశ బాంబేలో రోడ్ల మీద నడవాలి అన్న ఆలోచనే ఇబ్బందికరంగా ఉంటుంది. నేను రైలు ప్రయాణాలు చాలా ఎక్కువగా చేస్తుంటాను. మూడో తరగతి ప్రయాణీకుల కష్టాల్ని చూస్తుంటాను. కానీ వారి కష్టాలకు రైల్వే యంత్రాంగాన్ని ఏ రకంగానూ నిందించలేం. పరిశుభ్రతకు సంబంధించిన ప్రాథమిక సూత్రాలు కూడా మనకు తెలియవు. రైల్వే పెట్టెలో ఎక్కడబడితే అక్కడ ఉమ్మి వేస్తుంటాం. మళ్లీ ఇక్కడే పడుకుంటామన్న స్పృహ కూడా ఉండదు. దాన్ని ఎలా ఉపయోగిస్తామన్న ఆలోచన సైతం బరువనుకుంటాం. ఫలితంగా రైలుపెట్టెలు చెప్పటానికి వీల్లేనంత రోతగా తయారవుతున్నాయి. ఇక మనలాంటి సామాన్య సహోదరులకు పైన ఉన్నత తరగతి ప్రయాణికులు ఉంటారు. వాళ్లలో విద్యార్థులను కూడా చూశాను. కొన్నిసార్లు వాళ్లు సైతం భిన్నంగా ఏమీ ప్రవర్తించరు. వాళ్లు ఇంగ్లీష్‌లో మాట్లాడగలరు. నార్ఫోక్ జాకెట్లు వేసుకుంటారు. కాబట్టి లోపలికి దూసుకొచ్చి సీటు కోసం దబాయిస్తారు.

అన్వేషణకు కావలసిన కాంతిని నేను అంతటా ప్రసరింపచేశాను. మీతో మాట్లాడే అవకాశాన్ని నాకు ఇవ్వటంతో, నా హృదయం మొత్తాన్నీ ఇక్కడ పరుస్తున్నాను. స్వయంపాలన దిశగా మన పురోగతిలో భాగంగా మనం ఆ విషయాలన్నిటినీ సరిదిద్దుకోవాలి. మీకు మరో సన్నివేశాన్ని ఇప్పుడు పరిచయం చేస్తాను. నిన్న కార్యక్రమానికి అధ్యక్షత వహించిన (హిజ్ హైనెస్) మహారాజా వారు భారతదేశంలో పేదరికం గురించి మాట్లాడారు. మిగతా వక్తలు కూడా దాని మీద గొప్ప వక్కాణింపునిచ్చారు. కానీ వైస్రాయ్ పునాది రాయి వేసిన ఆ గొప్ప మంటపంలో మనం ఏం చూశాము? అది అత్యంత ఘనమైన ప్రదర్శన అనటంలో సందేహం లేదు. ఆ ఆభరణాల ప్రదర్శన.. పారిస్ నుంచి పనిగట్టుకుని వచ్చిన విఖ్యాత జ్యూయెలర్‌కు కన్నుల విందు చేసే ప్రదర్శన. ఆభరణాలతో మెరిసిపోతున్న సంపన్న సంస్థానాధిపతులను, కోట్లాది పేద ప్రజలను నేను పోలుస్తాను. ఈ సంపన్నులకు చెప్పాలని నాకనిపిస్తున్నది– "మీరు మీ ఆభరణాలను స్వచ్ఛందంగా త్యజించి భారత్‌లోని మీ దేశ ప్రజల కోసం ధర్మకర్తలుగా వ్యవహరించకపోతే భారత్‌కు విముక్తి ఉండదు". బ్రిటిష్ రాజ-చక్రవర్తికి విధేయతను ప్రకటించటానికి మన ఆభరణాల పెట్టెలను కొల్లగొట్టి తల నుంచి బొటనవేలు దాకా అలంకరించుకోవాలని రాజ-చక్రవర్తి మాత్రమే కాదు, లార్డ్ హార్డింజ్ కూడా కోరుకోరని చెప్పగలను. అటువంటిదేమీ తాను కోరుకోవటం లేదని స్వయంగా జార్జి చక్రవర్తి చెప్పిన సందేశాన్ని నా ప్రాణాన్ని పణంగా పెట్టయినా తేవటానికి సిద్ధం.

అయ్యా, బ్రిటిష్ ఇండియాలో కావచ్చు, మన గొప్ప సంస్థానాధిపతులు పాలిస్తున్న భారతదేశంలో కావచ్చు.. ఏ గొప్ప నగరంలో గొప్ప భవంతి నిర్మాణం గురించి విన్నా నాకు వెంటనే అసూయ కలుగుతుంది. "మన వ్యవసాయదారుల నుంచి వచ్చిన డబ్బు గదా ఇది" అనేస్తాను. డెబ్బయి అయిదు శాతానికి పైగా దేశ జనాభా వ్యవసాయంలో ఉన్నారు. హిగ్గిన్‌బాథమ్ తన భాషలో గత రాత్రి అతికినట్టు చక్కగా చెప్పారు– ఒకటి పండే చోట రెండు పండించిన కష్టజీవులు వారు. ఆ కష్టం ఫలితాలన్నిటినీ వారి నుంచి మనం లాగేసుకున్నా, ఇతరులు లాగేసుకోవటానికి అనుమతించినా.. మనకు స్వయంపాలన స్ఫూర్తి పెద్దగా ఉండదు. మన విముక్తి రైతు ద్వారా మాత్రమే వస్తుంది. న్యాయవాదులో, డాక్టర్లో, సంపన్న భూస్వాములో దాన్ని సాధించలేరు.

చివరిదే అయినా ఇప్పుడు, ఓ ముఖ్యాంశం చెబుతాను. ఈ రెండు మూడు రోజుల్లో మన మెదళ్లని కుదిపేసిన అంశం గురించి ప్రస్తావించటం నా విద్యుక్త బాధ్యత. వైస్రాయ్ బనారస్ వీథుల గుండా వెళ్తున్నప్పుడు మనందరిలో ఎంతో ఉత్కంఠ నెలకొంది. అనేక ప్రాంతాల్లో డిటెక్టివ్‌లను ఏర్పాటుచేయటం కనిపించింది. మనల్ని భయభ్రాంతులకు గురిచేశారు. మనలో మనం ప్రశ్నించుకున్నాం– "ఎందుకీ అపనమ్మకం? బతికుండి చచ్చే కంటే లార్డ్ హార్డింజ్ చావటం మేలు కదా?". కానీ ఓ బలసంపన్నమైన సామ్రాజ్యానికి ప్రతినిధి అలా చేయకపోవచ్చు. మన మీద డిటెక్టివ్‌లను రుద్దటం

అవసరమని ఆయన అనుకుంటూండవచ్చు. మనం పళ్లు నూరవచ్చు, ఆదుర్దా పడొచ్చు, మన పట్ల వ్యవహరిస్తున్న తీరుకి ఆగ్రహోదగ్రులం కావచ్చు.. కానీ అసహనానికి లోనై ఈవేళ భారతదేశం సాయుధ అరాచకవాదుల్ని సృష్టించిందని మనం మర్చిపోకూడదు. నా మట్టుకు నేను అరాచకవాదిని. కానీ మరోరకంగా! మనలో ఒక వర్గం అరాచకవాదులున్నారు. ఆ వర్గంతో మాట్లాడే అవకాశం వస్తే.. భారతదేశం గెలవాలంటే, వారి అరాచకవాదానికి భారత్‌లో స్థానం ఉండదని చెబుతాను. మనం దైవాన్ని నమ్మి దైవభీతితో ఉంటే.. మనం ఎవరికీ భయపడాల్సిన పన్లేదు. మహారాజాలు, వైస్రాయిలు, డిటెక్టివ్‌లు, చివరికి జార్జి చక్రవర్తికి కూడా.

అరాచకవాదికి దేశం పట్ల ఉన్న ప్రేమ కారణంగా అతన్ని గౌరవిస్తాను. తన దేశం కోసం మరణించటానికి సిద్ధపడే అతని ధైర్యాన్ని గౌరవిస్తాను. కానీ అదేసమయంలో అతన్ని అడుగుతాను– చంపటం గౌరవనీయమైన పనా? హత్య చేసే కత్తిని చేబూనటం శ్లాఘనీయ మరణానికి అర్హతవుతుందా? నేను దాన్ని తిరస్కరిస్తాను. ఏ పవిత్ర గ్రంథంలోనూ అటువంటి ధోరణులను ప్రోత్సహించే రాతలు లేవు. బ్రిటీష్‌వారు వైదొలిగితేనే భారతదేశానికి విముక్తి, వారిని బైటికి గెంటటం అవసరం అని నేను అనుకుంటే.. వారు వెళ్లితీరాల్సిందే అని ప్రకటించటానికి నేనేమీ సందేహించను. ఆ విశ్వాసం కోసం మరణించటానికి కూడా సిద్ధపడతాను. అది, నా ఉద్దేశంలో, ఘనమైన మరణం. బాంబులు విసిరేవ్యక్తి రహస్య కుట్రలు పన్నుతాడు, అందరిలోకీ రావటానికి భయపడతాడు, పట్టుబడ్డప్పుడు తప్పుదారిపట్టిన తన మహోత్సాహానికి మూల్యం చెల్లిస్తాడు.

"మనం ఇలా చేయకపోతే, కొంతమంది బాంబులు వేసి ఉండకపోతే.. మనం సాధించింది ఎప్పటికీ సాధించి ఉండేవాళ్లం కాదు అని (బెంగాల్) విభజన ఉద్యమాన్ని ఉటంకిస్తూ" నాకు చెప్పారు. (ఈ సమయంలో అనిబిసెంట్ జోక్యం చేసుకుని గాంధీనుద్దేశించి 'దయచేసి ఆ మాటలు ఆపండి' అన్నారు).

బెంగాల్‌లో లియాన్ నిర్వహించిన సమావేశంలో నేను ఇదే చెప్పాను. నేను చెబుతున్నది అవసరమని అనుకుంటున్నాను. ఆపేయమంటే ఆపేస్తాను. (ఛైర్మన్ వైపునకు తిరిగి) మీ ఆదేశాల కోసం చూస్తున్నాను. నా ఆలోచనలను ఉన్నదున్నట్టుగా చెప్పటం వల్ల నేను దేశానికి, సామ్రాజ్యానికి సేవ చేయటం లేదు అనుకుంటే.. నేను మాట్లాడటం ఆపేస్తాను. ('కొనసాగించండి' అని అరుపులు). (దీంతో ఛైర్మన్ 'మీ లక్ష్యమేంటో చెప్పండి' అని గాంధీనుద్దేశించి అన్నారు). నేను కేవలం (మరో ఆటంకం).. నా స్నేహితులారా, ఈ అంతరాయాన్ని నిరసించకండి. నేను మాట్లాడటం ఆపేయాలని ఇప్పుడు శ్రీమతి బీసెంట్ సూచిస్తున్నారు అంటే.. ఆమె భారతదేశాన్ని ఎంతగానో ప్రేమిస్తున్నారు. నేను యువజనుల ముందు నా ఆలోచనలను బాహాటంగా చెప్పటం ద్వారా పొరపాటు చేస్తున్నానని ఆమె అభిప్రాయం. అయినా కూడా, ఇరుపక్షాల్లో ఉన్న పరస్పర అనుమానాల నుంచి భారత్‌ను విముక్తి చేయాలనుకుంటున్నాను. మన లక్ష్యాన్ని చేరుకోవాలంటే, పరస్పర ప్రేమ, నమ్మకం ఉన్న సామ్రాజ్యం ఉండాలి. మనం ఇళ్లల్లో బాధ్యతారహితంగా మాట్లాడుకునేకంటే ఈ కళాశాలలో మాట్లాడుకోవటం మెరుగైన విషయం కాదా? ఈ విషయాల్ని బాహాటంగా మాట్లాడుకోవటం మరింత మెరుగని భావిస్తాను. ఈ రకంగా చేయటం ద్వారా గతంలో అద్భుత ఫలితాల్ని సాధించాను. విద్యార్థులకు తెలియనిదేదీ లేదని నాకు తెలుసు. కాబట్టి, అన్వేషణను మనవైపే మళ్లిస్తున్నాను. నేను నా దేశాన్ని ఎంతగానో ప్రేమిస్తాను కాబట్టే.. ఈ ఆలోచనల్ని మీతో పంచుకుంటున్నాను, భారత్‌లో అరాచకత్వానికి తావులేదని విన్నవిస్తున్నాను. పాలకులకు ఏం చెప్పాలనుకుంటున్నామో వాటిని నిర్మొహమాటంగా, బహిరంగంగా చెబుదాం. మనం చెప్పింది వారికి నచ్చకపోతే, పర్యవసానాల్ని ఎదుర్కొందాం. కానీ దూషించటం మనం చేయొద్దు.


పలురకాలుగా దూషణలకు గురవుతున్న ఇండియన్ సివిల్ సర్వీస్ సభ్యునితో ఇటీవల మాట్లాడాను. ఆ సర్వీసులోని సభ్యులతో నేను పంచుకోగలిగిన అంశాలు తక్కువే అయినా, అతను నాతో మాట్లాడిన తీరును ప్రశంసించకుండా ఉండలేకపోయాను. "మిస్టర్ గాంధీ, సివిల్ సర్వీసెస్‌లో ఉన్న మేం చెడ్డవాళ్లమని, ఏ ప్రజలను పరిపాలించటానికి వచ్చామో వారిని అణచివేయాలనుకుంటున్నామని ఎప్పుడైనా అనుకున్నారా?" అని ఆయన అడిగారు. "లేదు" అని సమాధానం చెప్పాను. "అలాంటపుడు ప్రజల్లో చెడ్డపేరున్న సివిల్ సర్వెంట్లకు మద్దతుగా అవకాశం వచ్చినప్పుడు ఓ మంచి మాట చెప్పండి" అని కోరారు. ఆ సందర్భం ఇప్పుడు, ఇక్కడ వచ్చింది. అవును, ఇండియన్ సివిల్ సర్వీస్‌లోని పలువురు సభ్యులు అహంకారపూరిత దాష్టీకాలకు పాల్పడుతుంటారని నిర్వంద్వంగా చెప్పొచ్చు. వాళ్లు క్రూరంగా, కొన్నిసార్లు మతిలేకుండా వ్యవహరిస్తారు. ఇలా అనేక విశేషణాల్ని వారి వ్యవహారశైలిపై ఉపయోగించవచ్చు. ఈ విషయాలన్నిటితోపాటు ఇంకోటి కూడా మనం గుర్తించాలి. భారత్‌లో కొన్నేళ్లపాటు గడిపాక వారిలో కొందరు కొంతమేర దిగజారిపోయారు. అది దేన్ని సూచిస్తోంది? ఇక్కడకు రాకముందు వాళ్లు పెద్దమనుషులు. ఇక్కడికొచ్చాక వాళ్లు తమ నైతికతను కొంత కోల్పోయారంటే, అది మనం కూడా ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అంశం.

మీరే ఆలోచించండి, నిన్న మంచిగా ఉన్న వ్యక్తి నాతో కలిసున్నాక చెడ్డగా మారాడంటే, అతను దిగజారిపోవటానికి అతనే కారణమా? నేనా కారణం?.. భారత్‌లోకి అడుగుపెట్టాక వాళ్లను చుట్టుముట్టే స్వార్థపూరిత పొగడ్తలు, తప్పుడు ధోరణులు వారిని దిగజారుస్తున్నాయి. ఆ స్థితిలో మనలో చాలామంది కూడా అలాగే అవుతారు. కొన్నిసార్లు నిందను తీసుకోవటం మంచిది. మనం స్వయంపాలనను అందుకోవాలంటే, నిందను స్వీకరించక తప్పదు. మనకు స్వయంపాలనను పళ్లెంలో పెట్టి అందించటమనేది ఎప్పటికీ జరగదు. బ్రిటీష్ సామ్రాజ్య, బ్రిటీష్ దేశ చరిత్రను చూడండి. స్వేచ్ఛను ప్రేమిస్తుంది, కానీ తమంతట తాము స్వేచ్ఛను తీసుకోలేనివారికి మాత్రం స్వేచ్ఛను ఇవ్వదు. కావాలంటే బోయర్ యుద్ధం నుంచి పాఠం నేర్చుకోండి. కేవలం కొన్ని సంవత్సరాల క్రితం వరకు ఆ సామ్రాజ్యానికి శత్రువులుగా ఉన్నవారు ఇప్పుడు స్నేహితులుగా మారారు....

**(ఈ సమయంలో వేదిక మీద ఆందోళన రేగి అంతరాయం ఏర్పడింది. దిగిపొండి అనటంతో, గాంధీ తన ప్రసంగాన్ని మధ్యలోనే ఆపాల్సివచ్చింది).**

# 'గ్రామన్యాయాలయాలు'.. చట్టం అమల్లోకొచ్చి పదేళ్లు - ఇప్పటికీ నత్తనడకనే అడుగులు!

'జనం కోసం జేపీ' సురాజ్య యాత్రలోని 6 లక్ష్యాలలో చట్టబద్ధపాలన-మహిళా రక్షణకు 'స్థానిక కోర్టుల ఏర్పాటు' ఒకటి. దీనివల్ల చిన్న కేసులకు కొన్ని వారాలలో తీర్పులు వెలువడి, సామాన్యులకు వెంటనే చౌకగా న్యాయం అందుతుంది, పెద్దనేరాలు జరగకముందే నివారించే సంస్కృతి పెరుగుతుంది. ముఖ్యంగా మహిళలపై అత్యాచారాలు, తీవ్ర నేరాలు జరగకుండా ఈవ్‌టీజింగ్ స్థాయిలోనే అడ్డుకట్ట వేసే అవకాశముంటుంది. ఈ స్థానిక కోర్టుల ఏర్పాటుకు పూర్తిగా లోక్‌సత్తా కృషి వల్ల 2008లో వచ్చిన 'గ్రామ న్యాయాలయాల' చట్టమే మూలం (2003లో గ్రామన్యాయాలయాల చట్టం ముసాయిదాను జేపీ రూపొందించి భారత ప్రభుత్వం




ముందుంచారు. 2005లో ఇది కేబినెట్ ఆమోదం పొంది, ఆ తర్వాత మూడేళ్లకు పార్లమెంటు ఆమోదం పొందింది. 2009 బాపూ జన్మదినోత్సవం నుంచి అమల్లోకి వచ్చింది). ఈ చట్టాన్ని వెంటనే అమలు చేయాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జేపీ అసెంబ్లీలో అడిగారు. మౌలిక సదుపాయాల ఖర్చును కేంద్రం భరిస్తున్నా, మహిళలపై నేరాలు తగ్గించటానికి, సామాన్యులకు సత్వర న్యాయం అందించటానికి అవకాశమున్నా రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక కోర్టుల ఏర్పాటును పట్టించుకోకపోవటాన్ని సభలో ప్రశ్నించారు. ఇద్దరు ముఖ్యమంత్రులకు లేఖలు రాశారు. అయితే అప్పట్లో తెలంగాణ ఉద్యమ ఘోషలో ఆ ప్రజాప్రయోజనకర వాదన వినిపించలేదు.

గ్రామన్యాయాలయాల చట్టం వచ్చిన దాదాపు పదేళ్ల తర్వాత (బిల్లు తొలి డ్రాఫ్ట్‌ను లోక్‌సత్తా తయారుచేసిన 16 ఏళ్ల తర్వాత) 2019లో తెలంగాణలో అమలు మొదలైంది. అది కూడా వనస్థలిపురం నివాసి నరేంద్రగౌడ్ దాఖలు చేసిన వ్యాజ్యంపై హైకోర్టు మొట్టికాయలు వేయటం వల్ల. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో కూడా అవనిగడ్డకు చెందిన బిక్షం అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై స్పందిస్తూ, గ్రామన్యాయాలయాలు ఏర్పాటు చేయాల్సిందేనని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టం చేయటంతో కదలిక ప్రారంభమైంది. ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కూడా గ్రామన్యాయాలయాల ఏర్పాటు ఎంతవరకు వచ్చిందని గ్రామసచివాలయాల సమీక్షలో అడిగినట్లు వార్తలు వచ్చాయి.

వాస్తవానికి లోక్‌సత్తా రూపొందించిన బిల్లు గ్రామాలు, పట్టణాలు తేడా లేకుండా అన్ని ప్రాంతాలకూ వర్తించే 'స్థానిక కోర్టుల ఏర్పాటు'కు ఉద్దేశించినది. అయితే గ్రామాల వరకు ఏర్పాటుకు మాత్రమే కేంద్ర ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేయటంతో.. సవరణలు, కుదింపులు చేసి ముందుగా

**గ్రామన్యాయాలయాలకవరకే బిల్లును పరిమితం చేశారు. ఆ పేరుతోనే చట్టం తెచ్చారు. స్థానిక కోర్టులు ఏర్పాటు చేసే విధంగా గ్రామన్యాయాలయాల చట్టంలో స్వల్ప మార్పులు చేసి పట్టణ ప్రాంతాలకు కూడా వర్తింపచేయాలని, ప్రతి లక్ష జనాభాకూ ఒక కోర్టును ఏర్పాటు చేయాలని, దీనివల్ల ప్రజాస్వామ్యానికి మూలమైన న్యాయం సామాన్యులకు త్వరగా అందుబాటులోకి రావటంతోపాటు, మహిళల రక్షణ కూడా మెరుగుపడుతుందని లోక్‌సత్తా పేర్కొంటోంది. ఈ రకంగా దేశవ్యాప్తంగా సుమారు 5,000 స్థానిక కోర్టుల్ని ఏర్పాటు చేయాలని కోరుతోంది. ప్రస్తుతం కొన్ని రాష్ట్రాల్లో, వందల సంఖ్యలో మాత్రమే గ్రామన్యాయాలయాలు పనిచేస్తున్నాయి. దేశంలో మొట్టమొదటిసారిగా మధ్యప్రదేశ్ 2009లోనే వీటిని ప్రారంభించి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచింది. కేరళలో 2012 నుంచి ఇవి అమలవుతున్నాయి. వారంలో రెండు రోజుల పాటు న్యాయాధికారులు గ్రామాల్లోనే ఉండి కేసులను పరిష్కరిస్తున్నారు. తీర్పులు కూడా మలయాళంలోనే ఇస్తున్నారు. తెలుగు రాష్ట్రాలు ఈ విషయంలో చాలా వెనుకబడి ఉన్నాయి. దీనిపట్ల పాలకుల్లో, రాజకీయ పార్టీల్లో పెద్ద వ్యతిరేకత లేకున్నా.. ఇది ఓట్లు తెచ్చే సంచలన అంశంగా కనిపించక పోవటం, సంస్కరణాభిలాష లేకపోవటం, తమ డిమాండ్ పడిపోతుందేమోన్న భావన హైకోర్టు న్యాయవాదుల్లో కూడా కొంత ఉండటం వంటి కారణాల వల్ల ప్రజలకు ఎంతో మేలు చేసేదైనా, న్యాయ పట్టభద్రులకు యువతకు ఉపాధి కల్పించేదైనా ఈ చట్టాన్ని అమలు చేయటానికి నేతలు చొరవ చూపలేదు.**




**గ్రామన్యాయాలయాలపై ఇటీవల బీవీ ప్రసాద్ ఓ దినపత్రికకు రాసిన వ్యాసమిది..**

గెలవాలనే తపనతో కేసులు వేసే వారంతా చివరికి అవి పెండింగ్‌లో పడేసరికి, దశాబ్దాల తరబడి కోర్టుల చుట్టూ తిరగలేక ఏదో ఒకటి తేల్చేస్తే బావుణ్ణు అనే పరిస్థితికి వస్తున్నారు. దశాబ్దాల అనంతరం కూడా నష్టపోవడానికి కక్షిదారులు సిద్ధమవుతున్నారు. దీనికి కారణం న్యాయస్థానాల్లో సామాన్యుడు ఆశించే వ్యవధిలోగా పరిష్కారాలు లభించకపోవడమే. దిగువస్థాయి న్యాయస్థానాల నుండి జిల్లా కోర్టులకు, అక్కడి నుండి హైకోర్టుకు, సర్వోన్నత న్యాయస్థానానికి వెళ్లి న్యాయం కోసం పోరాటం చేస్తున్నవారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోవడం, అధికారులు, ప్రజల మధ్య సరైన సమన్వయం లేకపోవడం, స్వల్పకాలానికి అధికారంలోకి వస్తున్న పార్టీలు వ్యవస్థను అతలాకుతలం చేయడంతో వ్యాజ్యాలు పెరిగాయి. నిన్నటికి నిన్న లెక్కలు తీస్తే సుప్రీంకోర్టులో కేసుల సంఖ్య 59,291కు పెరిగింది. ఏడాది క్రితం కేసుల సంఖ్య 57,987 మాత్రమే. అడ్మిషన్ దశలో 38,201 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. 9 మంది న్యాయమూర్తులతో కూడిన పూర్తిస్థాయి రాజ్యాంగ ధర్మాసనం ముందు అత్యంత కీలకమయిన 137 పిటిషన్లు, ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ముందు 13, ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ముందు 401 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. వివిధ కోర్టుల్లో లక్షకుపైగా కేసులు 50 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల జరిగిన ఒక సమావేశంలోనే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఈ విషయాన్ని స్వయంగా చెప్పారు. మరో రెండున్నర లక్షల కేసులు పాతికేళ్లుగా కోర్టుల్లో నలుగుతున్నాయి. 90 లక్షలకు పైగా సివిల్ కేసులు పెండింగ్ పడటానికి కారణాలు అన్వేషిస్తే అందులో 20 లక్షల కేసుల్లో ఇంతవరకూ సమన్లు కూడా జారీ కాలేదు. అలహాబాద్ హైకోర్టులో 7.26 లక్షల కేసులు పెండింగ్‌లో ఉండగా, రాజస్థాన్ హైకోర్టులో 4.49 లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ గణాంకాలను గమనించినపుడు సామాన్యుడికి సైతం భయం కలుగుతుంది.

దేశంలో కొత్త కేసులు నమోదు కాకుండానే ప్రస్తుత కేసులను విచారించాలంటే కనీసం 324 ఏళ్లు పడుతుందని కొందరి అంచనా. అన్ని కోర్టుల్లో కేసుల పరిష్కారానికి సకల సదుపాయాలు కల్పించాలంటే కనీసం ఇప్పటికిపుడు రూ.54,000 కోట్లు కావాలి. ఎప్పటికీ న్యాయం గెలిచితీరుతుందనే సామాన్యుడి నమ్మకాన్ని న్యాయస్థానాలు నిలుపుకుంటూనే ఉన్నా, ధైర్యాన్ని మాత్రం ఇవ్వలేకపోతున్నామని జస్టిస్ రంజన్ గొగోయ్ ఒక సందర్భంలో వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టు, హైకోర్టులు ఎన్ని మార్గదర్శకాలు జారీ చేసినా, దిగువ కోర్టులు క్రియాశీలంగా వ్యవహరించలేకపోవడం కూడా కేసుల పెండింగ్‌కు మరో కారణమవుతోంది. బాలుడిగా కేసులను ఎదుర్కొన్నవారు తుది తీర్పు వచ్చేసరికి వయోజనుడిగా, మధ్యవయస్కుడిగా మారిన సందర్భాలున్నాయి. ప్రతి ఏటా జిల్లా కోర్టులు, దిగువస్థాయి కోర్టుల్లో రెండు కోట్ల కేసులు నమోదవుతుండగా హైకోర్టుల్లో 17 లక్షల కేసులు నమోదవుతున్నాయి.

కేసుల పెండింగ్‌కు న్యాయస్థానాలో, న్యాయమూర్తులో కారణం కాదు. చట్టంపై అవగాహన లేకపోవడం, అనుభవం లోపించడం, వ్యవస్థల నిస్తేజం, నిస్పృహలు ఒక కారణం అయితే.. కేసుల పెండింగ్‌కు దర్యాప్తు సంస్థలు, కక్షిదారులు, న్యాయవాదులు, పాలనా వ్యవస్థ, అధికార యంత్రాంగం, మౌలిక సదుపాయాల లేమి, సిబ్బంది లోపం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సంపూర్ణంగా అందుబాటులోకి

రాకపోవడం, సమాజమూ మరో కారణమవుతున్నాయి. పెండింగ్ అనగానే సహజంగానే ఎవరైనా న్యాయస్థానాలనే నిందిస్తారు. కేవలం కోర్టులు సకాలంలో తీర్పులు ఇవ్వడం లేదనే నింద వేయడం వినా మిగిలిన పరిస్థితులు ఎవరికీ పట్టటం లేదు. న్యాయస్థానాల్లో సౌకర్యాలు, సదుపాయాలు తమకెందుకు పట్టాలి అన్నట్లు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు వ్యవహరించడం సుదీర్ఘకాలంగా కొనసాగిన అతి పెద్ద సమస్య.

1986లోనే 'లా' కమిషన్ గ్రామన్యాయాలయాల ఏర్పాటు అంశంపై నివేదికను ఇచ్చింది. 2002లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం 2007 నాటికి ప్రతి పది లక్షల మంది జనాభాకు 50 మంది న్యాయమూర్తులు ఉండాలి. ఇప్పుడున్నది కేవలం 16 మంది మాత్రమే.

కేంద్రం న్యాయమిత్ర పథకాన్ని 2017 ఏప్రిల్‌లో ప్రారంభించింది. రిటైరైన న్యాయమూర్తులను, న్యాయాధికారులను తిరిగి నియమించి పదేళ్లపైబడిన కేసులను పరిష్కరించాలని కేంద్రం చేసిన ప్రయత్నాలు ముందుకు సాగలేదు. అదే బాటలో నేటికీ న్యాయాలయాల అంశం కూడా ఉంది. భారత రాజ్యాంగం 39వ ఆర్టికల్ ఆదేశిక సూత్రాల్లో భాగంగా గ్రామన్యాయాలయాల ముసాయిదా బిల్లును రాజ్యసభలో 2007లో ప్రవేశపెట్టింది. రాజ్యసభ, బిల్లును అన్ని ప్రభుత్వ శాఖలకు, స్టాండింగ్ కమిటీలకు, న్యాయశాస్త్ర కోవిదులకు పంపించి, ప్రజాభిప్రాయ సేకరణ చేసి, హైకోర్టు రిజిస్ట్రార్లతోనూ ఒక భేటీ నిర్వహించి వారి అభిప్రాయాలను కూడా తీసుకుని ఆ తర్వాత ముసాయిదాలో సవరణలు తెచ్చారు. లోక్‌సభలో ఆమోదం అనంతరం కేంద్ర ప్రభుత్వం 2008లో బిల్లుగా తీసుకువచ్చింది. ఈ బిల్లు 2009 అక్టోబర్ 2 నుండి అమల్లోకి వచ్చింది. దేశవ్యాప్తంగా ఆరు వేల న్యాయాలయాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. పేదలకు వారి ఇంటి వద్దనే న్యాయం అందించటం వీటి లక్ష్యం. కొత్త కేసులతో పాటు పాత కేసులను కూడా ఈ న్యాయాలయాలకు బదిలీ చేయాలని తొలుత భావించారు.

గ్రామన్యాయాలయాలను కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా ఏర్పాటు చేయాల్సి ఉంది. కనీసం ఏడాది పాటు వ్యయాన్ని కేంద్రం భరిస్తుంది. తర్వాత్తర్వాత కాలంలో కేంద్రం కొంతమేర ఆర్థికసాయం చేస్తుంది. కేవలం చట్టాల పరిధికే పరిమితం కాకుండా సహజ న్యాయసూత్రాలకు లోబడి పనిచేయాలనే కీలక అంశం ఈ గ్రామన్యాయాలయాల నిర్వహణలో ఉండటం అందరికీ కలిసొచ్చే పాయింట్. గ్రామాల్లో న్యాయసహాయాన్ని తక్షణమే అందించేందుకు, సలహా సంప్రదింపులకు, మధ్యవర్తిత్వానికి, లోక్‌అదాలత్ ఏర్పాటుకు, ఉచిత న్యాయసహాయం, పేదలకు, బాలలకు, మహిళలకు, అల్పసంఖ్యాకవర్గాల వారికీ తక్షణ సాయం అందించేందుకు వీలుగా గ్రామన్యాయాలయాలు పనిచేయాల్సి ఉంటుంది.

గ్రామన్యాయాలయాల చట్టం-2008ని హైకోర్టుకు పంపించి, గ్రామ న్యాయాధికారులను నియమించాలి. వారికి ప్రథమ శ్రేణి మేజిస్ట్రేట్ హోదాతోపాటు సమాన జీతభత్యాలను చెల్లించాలి. నగర పంచాయతీ, గ్రామ పంచాయతీల్లో కోర్టులను ఏర్పాటు చేయాలి. మొబైల్ కోర్టులను ఏర్పాటు చేయటంతోపాటు సివిల్, క్రిమినల్ కేసులను కూడా విచారించే అధికారం ఈ న్యాయాలయాలకు ఉంటుంది. ఆస్తి కొనుగోలు, కాలువ నీరు వినియోగంలో వివాదాలు, కనీస వేతన చట్టం అమలు, వ్యవసాయ భూమి భాగస్వామ్య వివాదాలు గ్రామన్యాయాలయాల పరిధిలోకే వస్తాయి. సివిల్ కేసులను తొలుత రాజీమార్గంలో పరిష్కరించాల్సి ఉంటుంది. గ్రామన్యాయాలయాలు ఇచ్చే తీర్పులపై ఒక అప్పీలుకు వీలుంటుంది. తీర్పు అనంతరం 30 రోజుల్లో అసిస్టెంట్ సెషన్స్ జడ్జి వద్ద అప్పీలు చేసుకోవచ్చు. తర్వాత ఈ తీర్పులపై అప్పీళ్లు ఉండవు. తద్వారా హైకోర్టులపై భారాన్ని తగ్గించవచ్చు. ఈ చట్టాన్ని 8 చాప్టర్లు, 40 క్లాజులతో రూపొందించారు.

ఇంత స్పష్టంగా రూపొందించిన చట్టం అమలులో మాత్రం రాష్ట్ర ప్రభుత్వాలు సాచివేత ధోరణితో వ్యవహరిస్తున్నాయని 'నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ సొసైటీస్ ఫర్ ఫాస్ట్ జస్టిస్' సంస్థ ఇటీవల పిటిషన్ దాఖలు చేసింది.

దేశంలో 11 రాష్ట్రాల్లో 320 పంచాయతీల్లో మాత్రమే న్యాయాలయాల ఏర్పాటుపై నోటిఫై చేయగా అందులో 204 మాత్రమే తమ కార్యకలాపాలు ప్రారంభించాయి. దేశవ్యాప్తంగా 50 వేల పంచాయతీల్లో న్యాయాలయాలు ప్రారంభం కావాల్సి ఉంది. కనీసం 6 వేల న్యాయాలయాల ఏర్పాటు.. పదేళ్లు గడిచినా, కలగానే మిగిలిపోయింది. అనిత కుష్వా వెర్సెస్ పుష్పా సదన్ (2016)8 ఎస్సీస్సీ 509 కేసులో సుప్రీంకోర్టు చాలా స్పష్టంగా గ్రామీణ ప్రజలకు న్యాయం వారి హక్కుగా పేర్కొంది. గ్రామ న్యాయాలయాల ఏర్పాటులో సాచివేత వైఖరి చూస్తుంటే రాజ్యాంగంలోని 21వ అధికరణం, 14వ అధికరణంలో కల్పించిన హక్కులను కాలరాయడమే. న్యాయం కల్పించొచ్చు అని కాకుండా.. కల్పించాల్సిందే అని దిలీప్‌కుమార్ బసు వెర్సెస్ స్టేట్ ఆఫ్ వెస్ట్ బెంగాల్ కేసులో సర్వోన్నత న్యాయస్థానం చాలా స్పష్టంగా పేర్కొంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో సైతం గ్రామన్యాయాలయాల ఏర్పాటులో జరుగుతున్న జాప్యంపై హైకోర్టుల్లో పిటిషన్లు దాఖలయ్యాయి. తొలిదశలో తెలంగాణలో 55, ఆంధ్రప్రదేశ్‌లో 75 గ్రామన్యాయాలయాలు ఏర్పాటు కావాల్సి ఉంది. ప్రభుత్వం తనకు మేలు కలిగించే అంశాల్లో స్పందించే తీరు ప్రజల లక్ష్యాలను నెరవేర్చడంలో లేదనడం నిర్వివాదాంశం. ఇప్పటికైనా ప్రభుత్వాలు మేల్కొంటే న్యాయం జరిగేది ప్రజలకే కాదు, పరోక్షంగా ప్రభుత్వానికి కూడా అనేది గ్రహించాలి.

# స్థానిక సంస్థలు ప్రజాస్వామ్య దీపికలు

## (గాంధీజీ గ్రామస్వరాజ్య భావన)

మహాత్మాగాంధీ మనకు అందించిన గొప్ప వరం– అందరినీ ఒక్క తాటిపైకి తీసుకురావడం! విభిన్న కులాలు, భాషలు, విశ్వాసాలు, సంస్కృతులు, మతాలకు చెందిన ప్రజలందరినీ ఓ జాతిగా ఏకం చేశారు. ఒక లక్ష్యాన్ని ముందుంచారు. గుర్తింపు కల్పించారు. భారతదేశం నుంచి ఆంగ్లేయులు ఎప్పటికైనా వెళ్లిపోక తప్పదని ఆయన గ్రహించారు. 1916 ఫిబ్రవరి నాలుగున బనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో ప్రసంగిస్తూ, ఇష్టపూర్వకంగాగాని, విధిలేని పరిస్థితుల్లోగాని ఆంగ్లేయులు నిష్క్రమించక తప్పదని గాంధీ వ్యాఖ్యానించారు. బ్రిటిష్ పాలకులు స్వాతంత్ర్యం ఇచ్చేసి, భారత్ వదిలి వెళ్లిపోవడమే గాంధీజీ ప్రధాన ఉద్దేశం కాదు. మనకు స్వపరిపాలన సామర్థ్యం ఎంతమేర ఉందనేదే అప్పట్లో ఆయన ఆలోచన. 1916 ప్రారంభంలో ప్రతి భారతీయుడూ స్వాతంత్ర్యం గురించి మాట్లాడుతున్న వేళ గాంధీజీ ఓ మాట అడిగారు. మన దేవాలయాలే శుభ్రతకు నమూనాలుగా లేవు... మన స్వపరిపాలన ఎలా ఉంటుందని ప్రశ్నించారు. దేవాలయాలు పవిత్రతకు, పరిశుభ్రతకు, శాంతికి నిలయాలుగా మారతాయా అని అడిగారు. నిజమైన స్వపరిపాలన అంటే హక్కులతోపాటు బాధ్యతలపైనా అవగాహన కలిగి ఉండటమేనన్నది గాంధీజీ భావన. పౌరులు – ప్రభుత్వం మధ్య, పన్నులు – సేవల మధ్య సంబంధంపై గాఢమైన అవగాహన ఉండటం అవసరమని ఆయన విశ్వసించారు. అందువల్లే గాంధీజీ సదా స్థానిక ప్రభుత్వాల గురించే మాట్లాడుతుండేవారు. ఆ రోజుల్లో దేశంలో 90 శాతం గ్రామీణ ప్రాంతమే కావడంతో గ్రామస్వరాజ్య భావనకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు.




డాక్టర్ జయప్రకాష్ నారాయణ్

స్థానిక ప్రభుత్వాలు అత్యుత్తమ ప్రజాస్వామిక పాఠశాలలు. స్థానిక ప్రభుత్వం మాత్రమే రోజూ ప్రజలకు చేరువగా ఉంటూ అధికారాలను నిర్వర్తించగలదు. ప్రజలు సైతం స్థానిక ప్రభుత్వాల నిర్ణయాలు, నిష్క్రియాపరత్వాల వల్ల తమ జీవితాలపై పడే ప్రభావాలను అర్థం చేసుకోగలుగుతారు. దీనివల్ల తమ ఓటుకు, దాని ఫలితానికి మధ్య సంబంధం ప్రజలకు సులువుగా బోధపడుతుంది. స్థానిక స్థాయిలో ఒకవేళ ప్రజలు తప్పుడు నిర్ణయం తీసుకున్నా, తెలివిలేని నేతల్ని ఎంచుకున్నా– వాటి ఫలితాన్ని వారే చవిచూస్తారు. ఓటు హక్కును సద్వినియోగం చేసుకోకుంటే పరిణామాలు ఎలా ఉంటాయో వారికి స్వయంగా బోధపడుతుంది. స్థానిక స్థాయిలో తాము కట్టిన పన్నుల సొమ్ము ఎక్కడికి వెళ్తోందో వారికి తెలిసి వస్తుంది. స్థానిక నాయకత్వం తీసుకునే నిర్ణయాల వల్ల వనరుల కేటాయింపు, తమ జీవితాలపై ఎలాంటి ప్రభావం పడుతోందనేది అర్థమవుతుంది. స్థానికంగా అధికారగణం జవాబుదారీతనంతో వ్యవహరిస్తుంది. తప్పు జరిగితే... ప్రజలు వ్యక్తిగతంగా లేదా సమష్టిగా ప్రశ్నించి పరిస్థితుల్ని చక్కదిద్దే అవకాశం ఉంటుంది. స్థానిక ప్రభుత్వంలో విధులు, బాధ్యతల సమ్మిళితత్వం కారణంగా జవాబుదారీతనం ఎవరిదో ప్రజలకు తెలుస్తుంటుంది. ఈ కారణంగానే మహాత్మాగాంధీ అధికార వికేంద్రీకరణ, గ్రామస్వరాజ్య భావనను ప్రోత్సహించేవారు. గాంధీజీ ఆశీస్సులతో 1920ల్లో మన జాతీయ నేతల్లో చాలామంది స్థానిక ప్రభుత్వాలకు నేతృత్వం వహించారు. ప్రభుత్వంలో తమ నైపుణ్యాల్ని మెరుగుపరచుకున్నారు. కలకత్తాలో చిత్తరంజన్‌దాస్, సుభాష్ చంద్రబోస్, పట్నాలో రాజేంద్రప్రసాద్, అహ్మదాబాద్‌లో వల్లభాయ్ పటేల్, అలహాబాద్‌లో జవహర్‌లాల్ నెహ్రూ... వీరంతా స్థానిక ప్రభుత్వాల్ని అద్భుతంగా నిర్వహించినవారే. రాజమండ్రిలో ప్రకాశం పంతులు, సేలమ్‌లో సి.రాజగోపాలాచారి స్థానిక ప్రభుత్వాలపై తమదైన ముద్ర వేశారు.

### పౌరుల సంక్షేమమే ప్రాథమిక హితం

పౌరులు, వారి కుటుంబం కేంద్రకంగానే దేశం ఉండాలనే భావనను గాంధీజీ విశ్వసించేవారు. పౌరుల సంక్షేమమే దేశ ప్రాథమిక హితంగా ఉండాలని భావించారు. ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం రూపంలో సమాఖ్య ప్రభుత్వం ఉండటాన్ని ఆయన ఎన్నడూ యోచించలేదు. ఆయన ఉద్దేశంలో అధికారం అనేది పైస్థాయి నుంచి కిందకు వచ్చేది కాదు. పౌరులే కేంద్రకంగా అధికార విస్తరణ జరగాలని భావించేవారు. దేశం, స్వపరిపాలన విషయంలో ఆయన ఆలోచనలు 19వ శతాబ్దంలోని క్యాథలిక్ సామాజిక తత్వంలోని అనుబంధ (సబ్సిడరీ) సూత్రాలకు దగ్గరగా ఉండేవి. వాటిని తరవాత జర్మన్ రాజ్యాంగంలోనూ చేర్చారు. ప్రస్తుత ఐరోపా సమాఖ్య సాధారణ న్యాయసూత్రాల్లోనూ అవి భాగమయ్యాయి. రాజకీయాలకు, వ్యవస్థలో పైస్థాయి నుంచి ఉత్పతన్నమయ్యేవి కావు. గాంధీ విశ్వసించిన గ్రామస్వరాజ్య భావన ఈ అనుబంధ సూత్ర ఉద్దేశాలకు చక్కగా సరిపోతుంది. అది మన చారిత్రక భావనలకూ అనుగుణంగా ఉంది.

అయిదు వేల ఏళ్ల నాటి హరప్పా నాగరికత నుంచి సింధులోయ నాగరికత వరకు స్థానిక స్వపరిపాలన విధానాలు అమలయ్యేవని తెలుస్తోంది. ఉత్తరమేరూరు శాసనం ప్రకారం పదో శతాబ్దంలోని చోళుల కాలంలో గ్రామస్థాయిలో అత్యంత వ్యవస్థీకృత పద్ధతిలో స్థానిక పాలన సాగింది. బ్రిటిష్ పాలనలోనూ పురపాలక సంస్థలు



పాలనకు స్థానిక ప్రభుత్వాలే ప్రధాన పీఠమనే ముఖ్య సూత్రంపైనే అమెరికా పౌరసమాజం పునాది నిర్మితమైంది. అనుబంధ సూత్ర నియమావళికి పొడిగింపుగానే అమెరికా రాజ్యాంగంలో రాష్ట్రాల హక్కుల నియమాల్ని చేర్చారు. ఆక్స్‌ఫర్డ్ ఆంగ్ల నిఘంటువు ప్రకారం సబ్సిడరీ సూత్రానికి అర్థం.. 'ఒక కేంద్ర ప్రాధికార సంస్థకు అనుబంధ విధులు మాత్రమే ఉండాలి. స్థానిక స్థాయిలో నిర్వర్తించలేని విధులను మాత్రమే అది నిర్వర్తించాలి'. మరో మాటలో చెప్పాలంటే– కింది అంచెల్లో ఉండే ప్రభుత్వం నుంచి పైస్థాయుల్లోని ప్రభుత్వ వ్యవస్థకు అధికారం అప్పగిస్తారు. పౌరులు, సమాజం అధికారాలే ప్రాథమికం. అవి అధికార స్వయంపాలనతో శక్తిమంతంగా ఉండేవి. స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో నిర్ణయాధికారంలో జిల్లా బోర్డులు సైతం శక్తిమంతమైన పాత్ర పోషించేవి. అయిదు వేల సంవత్సరాల చరిత్రలో స్థానిక ప్రభుత్వాల పాత్రను పరిశీలిస్తే, స్వతంత్ర భారతంలోనే అత్యధిక స్థాయిలో కేంద్రీకరణ జరిగినట్లు తెలుస్తోంది. మన రాజ్యాంగం మానవత్వంతో కూడిన ఉదార పత్రం.

అధికార వికేంద్రీకరణతో పరిమిత స్థాయిలో స్థానిక ప్రభుత్వాలు ఏర్పడాలని గాంధీజీ అభిలషించారు. తద్వారా ప్రజలు తమ జీవితాలను తీర్చిదిద్దుకుంటారని భావించారు. కాని కులప్రీతి, అవినీతికి అడ్డాలుగా మారిన

పంచాయతీలకు అధికారాల్ని బదిలీ చేసే విషయంలో అంబేద్కర్ ఆలోచన పూర్తిగా భిన్నం. ఇరువురి వాదనల్లోనూ బలముంది. కేంద్రీకరణ, రాజ్య నియంత్రణ భావనలే గాంధీజీ వలస పాలన వ్యతిరేకతలో కీలకంగా నిలిచాయి. అగ్రకుల పెద్దల అధికార ఏకస్వామ్యం వంటివి కుల వ్యవస్థ, పుట్టుక నుంచే వ్యవస్థీకృతమైన అసమానత్వం న్యాయబద్ధమైన భయాందోళనల్ని లేవనెత్తాయి. గాంధీజీ, అంబేద్కర్‌ల పరస్పర వ్యతిరేక అభిప్రాయాల మధ్య సయోధ్య కుదర్చడంలో మన జాతి నిర్మాతల వైఫల్యం ప్రజాస్వామిక భారత్‌కు చాలా చేటు తలపెట్టినట్లు తేలింది. ఒక సమాజంలో కేంద్రీకరణ ఫలితంగా పౌర భావన, ఓటు పరిణామాలు, పన్నులు – సేవల మధ్య సంబంధాలు అర్థం చేసుకోవడం కష్టమవుతుంది. ఓటు కొనుగోలు చేసే క్రమంలో ప్రజాస్వామ్యం క్షీణ దిశగా నడిచింది. ప్రభుత్వ ప్రాథమిక విధుల్ని పణంగా పెట్టి తాయిలాల పంపిణీ సంస్కృతి పెచ్చరిల్లింది. కులాలు, ఇతర అంశాల పేరిట చీలికలు తెచ్చి, భావోద్వేగాల ఆధారంగా ఓట్లు సేకరించే అలవాటు అధికమైంది. ప్రజాస్వామిక పాఠశాలలుగా వెలగాల్సిన స్థానిక ప్రభుత్వాలు స్వీయపాలన, నిర్ణయాధికారంపై అవసరమైన నైపుణ్యాల్ని సంతరించుకోలేకపోతున్నాయి. ఫలితంగా నిరంతర మెరుగుదల, స్వీయదిద్దుబాటు వ్యవస్థ లేని స్థితిలో ప్రజాస్వామ్యం– ఓటింగ్, నిరసనలకే పరిమితమైపోతోంది.




## కేంద్రీకృత వ్యవస్థతో నష్టాలు

కేంద్రీకృత వ్యవస్థలో తప్పులు దొర్లితే అవి దేశం పాలిట శాపాలవుతాయి. నవకల్పనలు, కొత్త ఆలోచనల అమలు క్లిష్టతరమవుతుంది. వికేంద్రీకృత వ్యవస్థలో పొరపాట్ల పర్యవసానం స్థానిక ప్రభుత్వానికే పరిమితమవుతాయి. నవకల్పనలు, కొత్త ఆలోచనలు స్థానిక ప్రభుత్వాలకూ విస్తరిస్తాయి. పౌరులు ప్రభుత్వంలో భాగస్వాములవుతారు. ప్రజల జీవితాలు గణనీయంగా మెరుగవుతాయి. అధికారాల బదిలీ, స్వీయపాలన ప్రయోజనాలు ప్రజలకు దక్కుతాయనేందుకు స్వయంపాలిత పాడి సహకార సంఘాల అద్భుత విజయాలే ప్రత్యక్ష సాక్ష్యం. మహారాష్ట్ర, గుజరాత్, ఏపీ, కేరళ, తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో నాయకత్వం, స్థానిక ప్రభుత్వ నేతల నవకల్పనల కారణంగా పాఠశాల విద్య, సామాజిక మౌలిక సదుపాయాల అభివృద్ధి రంగాల్లోనూ విజయగాథలు నమోదయ్యాయి. సరైన జాగ్రత్తలు తీసుకుంటే అధికార వికేంద్రీకరణ విజయం సాధిస్తుందనేందుకు చిన్న తరహా ఎత్తిపోతల ప్రాజెక్టులను విజయవంతంగా, వేగంగా అమలు చేసేందుకు స్థానిక ప్రజల్ని సమీకరించిన ఉదంతంలో, స్వయంపాలక పారిశ్రామిక స్థానిక ప్రాధికార సంస్థల ఏర్పాటులో నా అనుభవాలే ప్రత్యక్ష ఉదాహరణ.

ఒక దేశంగా మనం గాంధీజీ, అంబేద్కర్ ఆదర్శాలను సమ్మిళితం చేయాల్సిన అవసరం ఉంది. శక్తిమంతమైన స్థానిక ప్రభుత్వాల్ని నిర్మిస్తే అవి ప్రజలకు సాధికారత కల్పిస్తాయి. కులాల అడ్డుగోడల్ని కూలదోసే అవకాశం ఉంది. దళితులు, వెనకబడిన వర్గాలు, మహిళలకు సాధికారత కల్పించేందుకు స్థానిక ప్రభుత్వాల్లో ఇప్పటికే మనకు రిజర్వేషన్లు ఉన్నాయి. వీటికి అదనంగా 20 వేల నుంచి 25 వేల దాకా జనాభాతో కొన్ని గ్రామాలను పంచాయతీ సమూహాలుగా మార్చగలిగితే సంప్రదాయ కుల వ్యవస్థను బలహీనపరచే అవకాశం కలుగుతుంది. ప్రజాస్వామిక ఓటు శక్తితో అణగారిన వర్గాలకు విముక్తి కలిగించే వీలు దక్కుతుంది. రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం 25 శాతాన్ని పాఠశాల విద్య, ప్రాథమిక ఆరోగ్య మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్యం, మురుగునీటి పారుదల వంటి అవసరాలకు బదిలీ చేస్తే ప్రజలు తమ జీవితాల్ని మెరుగుదిద్దుకునే పద్ధతుల్ని వేగంగా నేర్చుకోగలుగుతారు. అధికార దుర్వినియోగాన్ని వేగంగా గుర్తించి బాధ్యులు శిక్షిస్తారు. పౌర సేవలకు హామీని కల్పిస్తారు. నిర్దిష్ట కాలవ్యవధితో సేవలు అందించే శక్తిమంతమైన స్వతంత్ర స్థానిక అంబుడ్స్‌మన్ వ్యవస్థ ఉంటే జవాబుదారీతనం ఇనుమడిస్తుంది. రాష్ట్రం, కేంద్రం రాజ్యాంగం పరిధిలో తమకు దఖలుపడిన విధుల్ని నిర్వర్తించడం కొనసాగిస్తాయి. ఈ నమూనాలో గాంధీజీ ఆదర్శాలను, అంబేద్కర్ జాగ్రత్తల్ని సమ్మిళితం చేయొచ్చు. ప్రజల జీవితాల్ని జవాబుదారీతనంతో స్థానిక పాలన పద్ధతిలో మెరుగుపరచవచ్చు. తద్వారా ప్రజలు స్థానిక స్వయంపాలన కళను అందిపుచ్చుకుంటారు. అప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది. మహాత్మాగాంధీ కలలుగన్న సిసలైన 'స్వరాజ్' సిద్ధిస్తుంది!

**(ఈనాడు సౌజన్యంతో)**

# ‘ప్రతి కుటుంబానికీ ఓ డాక్టర్’..



## ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థ పునాదిగా అందరికీ ఆరోగ్యాన్ని అందించే విధానాన్ని తెండి

### ఆరోగ్య సంస్కరణ నమూనాతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు జేపీ లేఖ

**ఆంధ్రప్రదేశ్‌లో ప్రజారోగ్య వ్యవస్థను సమూలంగా మార్చి మెరుగుపరచాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించినందున, దీన్నో అవకాశంగా తీసుకుని అందరికీ ఆరోగ్యాన్ని అందించే సార్వత్రిక ఆరోగ్య సంరక్షణ (యూనివర్సల్ హెల్త్‌కేర్) విధానాన్ని ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో అమలు చేయాలని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా రూపొందించిన ఆరోగ్య సంస్కరణ నమూనాను వివరిస్తూ లేఖ రాశారు. ప్రతి కుటుంబానికీ ఒక్కో డాక్టర్ ‘ఫ్యామిలీ ఫిజీషియన్’ (ఎఫ్‌పీ)గా ఉండేలా, అందులోనూ తమకు నచ్చిన డాక్టర్‌ని ప్రజలు ఎంచుకునేలా ప్రాథమిక ఆరోగ్యాన్ని బలోపేతం చేయటం ఈ ఆరోగ్య సంస్కరణ నమూనాకు పునాదిగా ఉంటుంది. ఈ పునాది మీద ద్వితీయ స్థాయి వైద్య సేవల విస్తరణ, తృతీయ స్థాయి సేవల బలోపేతం జరగాలని జేపీ సూచించారు. ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య రంగ సమస్యల్ని వివరిస్తూ, ఈ మార్పుల్ని ఆయన ప్రతిపాదించారు. ఈ ఆరోగ్య నమూనా అమలుకు భారీ ఖర్చు కూడా అవదని, కేవలం రూ.2,900 కోట్లు, అంటే రాష్ట్ర జీఎస్‌డీపీలో 0.27% అదనంగా కేటాయిస్తే చాలని జేపీ తెలిపారు. దీనిపై వివరాలను ప్రభుత్వంతో చర్చించేందుకు తాము సిద్ధమన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రికి జేపీ రాసిన లేఖ పాఠం స్థూలంగా..**

“ప్రియమైన శ్రీ జగన్మోహన్ రెడ్డి గారు,

ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్య, వైద్య సేవల్ని మెరుగుపరచాలని మీ ప్రభుత్వం సంకల్పించటం సంతోషకరం. ప్రభుత్వ ఆస్పత్రులలో సేవల సమూల ప్రక్షాళనకు, ప్రభుత్వ ఆస్పత్రులను ఆదర్శ ఆస్పత్రులుగా మార్చటానికి చర్యలు తీసుకోవటం ఆరోగ్య వ్యవస్థను మెరుగుపరచేందుకు సరైన దిశలో వేస్తున్న అడుగులు. అందరికీ ఆరోగ్యాన్ని అందించేలా పటిష్ఠమైన, ఆచరణసాధ్యమైన, ప్రభావశీలమైన, ఆర్థిక భారంలేని సార్వత్రిక ఆరోగ్య పథకాన్ని (యూనివర్సల్ హెల్త్‌కేర్ ప్రోగ్రాం)ను ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో ఏర్పాటు చేయటానికి కూడా ఇదే సరైన సమయం, అవకాశం కూడా.

మన ప్రజారోగ్య వ్యవస్థ ప్రజల అవసరాలను, ఆకాంక్షలను అందుకోలేకపోతున్నది. ఈ వైఫల్యం వల్ల అనేకమంది అంతులేని వేదనకు గురవుతున్నారు. అనారోగ్యం, బాధతో నలిగిపోతూ దుర్భర పేదరికంలోకి జారిపోతున్నారు. ఆరోగ్య, వైద్య రంగాన్ని సమూలంగా ప్రక్షాళించే క్రమంలో మనం ఈ రంగంలోని కొన్ని బలాల్ని, బలహీనతల్ని గుర్తించటం అవసరం. వ్యవస్థలో ఉన్న బలాల మీద మార్పుల్ని నిర్మిస్తూ బలహీనతల్ని తొలగించాలి. కొద్దిపాటి అదనపు వ్యయంతోనే రాష్ట్రంలో అందరికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని అందించే వ్యవస్థను నిర్మించగలగాలి. ప్రభుత్వం జీడీపీలోని 1% మాత్రమే ఆరోగ్య సంరక్షణ మీద ఖర్చు చేస్తుండగా, అందులో ఖర్చు చేసే ప్రతి రూపాయికీ రూ.4-10లను సేవల రూపంలో ప్రజలు పొందుతున్నారు. కాబట్టి మనం ప్రజారోగ్యంపై మరింత ఖర్చు చేయాలి, అది కూడా విజ్ఞతతో.

**ఆంధ్రప్రదేశ్‌లో కావచ్చు, ఆ మాటకొస్తే భారతదేశంలోని ఏ ఇతర రాష్ట్రంలోనైనా కావచ్చు ఆరోగ్య సంరక్షణ రంగంలో ఉన్న ప్రధాన సమస్యలు ఇవీ:**

1. **బలహీనమైన ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ:** ఒక కుటుంబంలోనివారి ఆరోగ్యానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ), కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ) స్థాయిలో వైద్య సేవలే కీలకం. సాధారణ, చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకు తొలి దశ ఆస్పత్రి సేవలను అందిస్తూ ఈ కేంద్రాలు రోగుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి. అయితే ఈ పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలను సక్రమంగా ఉపయోగించుకునే పరిస్థితి

ఇప్పుడు లేదు. కుటుంబ ఆరోగ్య సేవలకు తొలిదశలో వెళ్లేందుకు ప్రభుత్వం నుంచి విశ్వసనీయ సదుపాయమనేదే లేకుండా పోయింది. టీకాలు, ఫ్యామిలీ ప్లానింగ్ వంటి పరిమిత సేవల కోసం తప్ప పీహెచ్‌సీలను తమ కుటుంబానికి ఆరోగ్యం అందించే కేంద్రాలుగా ప్రజలు భావించటం లేదు. పలువురు డాక్టర్లు ప్రాథమిక స్థాయి వైద్యసేవల కేంద్రాలలో పనిచేయటానికి ఇష్టపడటం లేదు. వాటిల్లో పోస్టింగు తీసుకున్నవారు కూడా గైర్హాజరవటమో, నామమాత్రంగా పనిచేయటమో జరుగుతోంది. ఎటువంటి జవాబుదారీతనం, విశ్వసనీయత లేకుండా పోయింది.

2. **ప్రభుత్వాస్పత్రుల్లో రోగులు కిటకిట, నిధులకు కటకట:** ప్రాథమిక, కుటుంబ ఆరోగ్య సంరక్షణను మెరుగుపరచకపోవటం వల్ల, తృతీయ స్థాయి వైద్యాన్నందించే





పెద్దాస్పత్రులకే దాదాపు అందరూ వచ్చేస్తున్నారు. చాలా ఆస్పత్రుల్లో, పడకల సామర్థ్యం కన్నా రెట్టింపు సంఖ్యలో రోగుల్ని చేర్చుకుంటున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సాధారణ వైద్యుడు, వైద్యురాలు చికిత్స చేయగలిగే చిన్న ఆరోగ్య సమస్యలున్నవారు కూడా వేల సంఖ్యలో పెద్దాస్పత్రులకు రోజూ ఔట్‌పేషెంట్లుగా వస్తున్నారు.

3. **ఆరోగ్య సిబ్బందికి అరకొర జీతభత్యాలు:** మన ఆరోగ్యరంగానికి సిబ్బంది కేటాయింపు తగు స్థాయిలో లేదు. భారతదేశం ఏడాదికి 60,000 మంది డాక్టర్లను తయారుచేస్తుండగా, వారిలో చాలామంది నిరుద్యోగులుగానే ఉన్నారు. అనేకమంది ఎంబీబీఎస్ డాక్టర్లు నెలకు రూ.30–40,000 లతో పట్టణాలు, నగరాల్లో పనిచేయటానికి సిద్ధంగా ఉన్నారు.

**ఈ వాస్తవాలు, పరిస్థితుల నేపథ్యంలో.. తక్కువ ఖర్చులోనే అందరికీ ఆరోగ్య సేవల్ని అందించేలా ఆరోగ్య సంరక్షణ రంగాన్ని సమూలంగా మెరుగుపరిచేందుకు మూడు ప్రధాన ఏర్పాట్లను పరిగణలోకి తీసుకోవాలి:**

1. **ప్రాథమిక ఆరోగ్య సేవలను పటిష్ట పునాదిగా నిర్మించాలి:** ప్రతి 70,000 – 1,00,000 జనాభాకు ప్రాథమిక ఆరోగ్య సేవల్ని అందించేందుకు 10 మంది డాక్టర్లతో ఒక నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసే పద్ధతిని ప్రజారోగ్య వ్యవస్థలో ప్రవేశపెట్టాలి. దీనివల్ల పెద్ద గ్రామాలు లేదా చిన్న పట్టణాల్లో వైద్యుల ప్రాక్టీస్ వేళ్లూనుకుంటుంది, ప్రజలకు 10 కిలోమీటర్ల పరిధిలో వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయి. ఒక్కో కుటుంబం ఈ నెట్‌వర్క్‌లో ఉన్న డాక్టర్లలో తమకు నచ్చిన వైద్యుడిని తమ ఫ్యామిలీ ఫిజీషియన్ (ఎఫ్‌పీ)గా ఎంచుకుంటుంది. ఒక ఇల్లు/కుటుంబానికి అవసరమైన అన్ని మౌలిక ఆరోగ్య అవసరాలు, ఔట్‌పేషెంట్ సేవలు, చిన్న చిన్న ఆరోగ్య పరీక్షలు, మందులు వంటివన్నీ ఎఫ్‌పీ స్థాయిలోనే జరిగిపోతాయి. ఈ సేవలందించినందుకు

ఒకొక్కరి మీద ఏడాదికి కొంత మొత్తాన్ని, ఉదాహరణకు రూ.500 క్యాపిటేషన్ ఫీజుగా ప్రభుత్వం నుంచి ఎఫ్‌పీ అందుకుంటారు. కుటుంబాలు ఎఫ్‌పీలను ఎంచుకునే క్రమంలో, ప్రజలు ఏ వైద్యుడి సేవల పట్ల ఎక్కువ నమ్మకంతో రిజిస్టర్ చేయించుకుంటారో ఆ ఎఫ్‌పీకి ఎక్కువ ఆదాయం లభిస్తుంది. ఈ రకంగా, తమకు నచ్చిన వైద్యుడిని ఎంచుకునే అవకాశం ప్రతి కుటుంబానికీ, మెరుగైన సేవలనందించి ప్రజల నమ్మకాన్ని చూరగొంటే ఆదాయం పెరుగుతుందన్న ప్రోత్సాహకం ఎఫ్‌పీలకూ ఉంటుంది. ప్రభుత్వం నుంచి మందులు, టీకాలు వంటివి వారికి ఉచితంగా సరఫరా అవుతాయి. సరాసరిన ఒక్కో ఎఫ్‌పీ వద్ద 5,000 మంది రిజిస్టర్ చేసుకోవచ్చు. రోగి సీహెచ్‌సీ/ ప్రైవేటు నర్సింగ్ హోమ్ స్థాయిలో లేదా జిల్లా/తృతీయ స్థాయిలో ఆస్పత్రిలో చికిత్సకు వెళ్లాలంటే, ఫ్యామిలీ డాక్టర్ రిఫర్ చేస్తేనే సాధ్యం. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే నేరుగా ఆస్పత్రులకు వెళ్లే అవకాశం రోగికి ఉంటుంది.

ఇటువంటి వ్యవస్థతో తక్కువ ఖర్చుతోనే ఔట్‌పేషెంట్ స్థాయిలో నాణ్యమైన ఆరోగ్యాన్ని అందించవచ్చు. ఒకపక్కన, నాణ్యమైన వైద్య సేవల్ని అందించటానికి జనరల్ డాక్టర్లకు తగిన ప్రోత్సాహకాలు ఉంటాయి.. మరోపక్క ప్రజలకు ఫ్యామిలీ ఫిజీషియన్ జవాబుదారీతనంతో అందుబాటులో ఉంటారు.

2. **ద్వితీయ స్థాయి వైద్యసేవల్ని విస్తరించాలి:**

ద్వితీయస్థాయిలో, ఆరోగ్యశ్రీని ఏకీకృతం చేసి విస్తరించాలి. చిన్న ప్రైవేటు నర్సింగ్ హోమ్‌లనుకూడా అందుబాటులోకి తేవాలి. రోగులు సీహెచ్‌సీ లేదా ఏదైనా చిన్న ప్రైవేటు నర్సింగ్ హోమ్‌లలో దేనిపై ఎక్కువ నమ్మకం ఉంటే దానికి వెళ్లే ఎంపిక అవకాశాన్ని, పోటీని అందుబాటులోకి తేవాలి. సీహెచ్, ప్రైవేటు నర్సింగ్ హోమ్‌లకు అవి అందించే సేవల ప్రాతిపదికన ఖర్చుల్ని ప్రభుత్వం రీఇంబర్స్ చేస్తుంది. ఆరోగ్య సేవల్ని, వాటి ధరల్ని ఆమోదించిన ప్రమాణాల ప్రకారం పరిగణలోకి తీసుకుంటారు.

దీనివల్ల రోగులకు తమకు నమ్మకమున్న వైద్య కేంద్రాన్ని ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుంది, వైద్య సేవల నాణ్యత పెరుగుతుంది, సంతృప్తికరంగా తక్కువ ఖర్చులోనే ఈ దశ ఆరోగ్య సేవల్ని పొందగలుగుతారు.

3. **తృతీయ స్థాయి వైద్యాన్ని బలోపేతం చేయాలి:**

కింది స్థాయి నుంచి రెఫరల్ ప్రాతిపదికన వచ్చే రోగులకు తృతీయ స్థాయి వైద్య సేవల్ని అందించే జిల్లా, బోధనాస్పత్రులను బాగా పటిష్ఠం చేయాలి. మౌలిక వసతుల్ని నిర్మించి ప్రభుత్వానికి కొంత మొత్తానికి లీజుకిచ్చే విధంగా ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించాలి. రెండోది, బోధనాస్పత్రులకు, జిల్లా ఆస్పత్రులకు బడ్జెట్‌ను పెంచాలి. నైపుణ్య కేంద్రాలు, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులకూ బడ్జెట్ కేటాయింపులు పెరగాలి.

ఈ చర్యలు తృతీయ స్థాయి, జిల్లా ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాల్ని, కనీస వసతుల్ని, పారిశుద్ధ్యాన్ని, సేవల్లో నాణ్యతను గణనీయంగా పెంచుతాయి.

.. ఆరోగ్య సంరక్షణ వ్యయాన్ని ఏడాదికి రూ.2,900 కోట్ల మేర పెంచితే చాలు.. పైన చెప్పిన అన్ని మార్పుల్నీ సాధించవచ్చు, ప్రజలకవైద్య సేవల్ని గణనీయంగా మెరుగు పరచవచ్చు, రోగులకు సంతృప్తిని కలిగించవచ్చు. రూ. 2,900 కోట్లు అంటే రాష్ట్ర జీఎస్‌డీపీలో కేవలం 0.27%.

ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్య సంరక్షణను సమూలంగా మార్చి మెరుగుపరిచేందుకు పైన పేర్కొన్న ఈ విధాన నమూనాను పరిగణలోకి తీసుకోవాలని మేం విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ నమూనా వివరాల్ని తెలియజేందుకు ప్రభుత్వంతో చర్చించటానికి, దీన్ని విజయవంతంగా అమలు చేసేందుకు అధికారులతో కలిసి పనిచేయటానికీ మేం సంతోషంగా సిద్ధం. మీ ప్రభుత్వ సునిశిత పరిశీలన కోసం.. ఈ ఆరోగ్య సంస్కరణలోని అంశాల్ని స్థూలంగా తెలియజేసే చిన్న పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను కూడా జత చేస్తున్నాం."

**అభివందనలతో,**
**డా॥ జయప్రకాష్ నారాయణ్,**
**ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్),**
**లోక్‌సత్తా వ్యవస్థాపకులు**

**ప్రతులు:**

శ్రీ ఆళ్ల కాళి కృష్ణ శ్రీనివాస్,
ఉప ముఖ్యమంత్రి, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ,
వైద్య విద్య మంత్రి, ఆంధ్రప్రదేశ్
డా॥ కె. ఎస్ జవహర్ రెడ్డి, ఐఏఎస్,
ప్రిన్సిపల్ సెక్రటరీ, ఆరోగ్య వైద్య, మరియు కుటుంబ సంక్షేమం, ఆంధ్రప్రదేశ్

## మానవ వనరులు, మౌలిక వసతులకు కోతతో

# తెలంగాణ బడ్జెట్

## 2019-20

2016 నవంబర్‌లో ప్రకటించిన పెద్ద నోట్ల రద్దును మోదీ ప్రభుత్వం అటు అవినీతి పోకుండా, ఇటు కొత్త కరెన్సీ లేకుండా అసమర్థంగా అమలు చేయటం దగ్గర్నుంచి ఆర్థిక మందగమనం సంకేతాలు కన్పిస్తున్నా పట్టించుకోకుండా, తగు జాగ్రత్తలు తీసుకోకుండా, తెలంగాణ సంపన్న రాష్ట్రం కాబట్టి ఎంత అసంబద్ధమైన పథకాలనైనా అమలు చేయవచ్చు, ఎంత దుబారా అయినా చేయవచ్చు అని దబాయిస్తూ వ్యవహరించిన ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర రావు.. తాజా బడ్జెట్ రూపకల్పనలో కొంత వెనక్కి తగ్గారు. ఇప్పుడు కూడా పన్నుల వసూళ్లు వంటి అంశాల్లో కొన్ని అవాస్తవాల్ని, అతిశయోక్తుల్ని చెప్పారు గానీ.. మొత్తంగా ఆర్థికాంశాల్లో భేషజాలకు పోకూడదనే ప్రాప్తకాలజ్ఞతను ప్రదర్శించారు. ముందు జాగ్రత్త మీద కొంత దృష్టి సారించారు. ఓటాన్ అకౌంట్ కంటే 20 శాతం మేర, అంటే దాదాపు రూ. 35,000 కోట్ల మేర బడ్జెట్ పరిమాణాన్ని తగ్గించి 2019-20 తెలంగాణ వార్షిక బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఇందుకు చింతిస్తున్నట్లు వివరణ ఇచ్చారు. అయితే ఇంత వెనకడుగుకు కారణంగా ఆర్థిక మాంద్యాన్ని ఘాటుగా నిందించారుగానీ, మోదీ ప్రభుత్వంపై మాత్రం మొహమాటపు విమర్శలకే పరిమితమయ్యారు. స్వీయలోపంబెరుగుట అనే విద్యాప్రమాణంలో తన అధ్వాన్న రికార్డును మరోమారు యథావిధిగా చాటుకుంటూ తన వైఫల్యాల్ని చాలామేర కప్పిపుచ్చుకున్నారు. మరోవైపు ఆర్థిక మందగమనాన్ని ఒక అవకాశంగా మలచుకునే సృజనాత్మక ఆలోచనలేమీ కూడా బడ్జెట్‌లో చేయలేకపోయారు. తెలంగాణకసుస్థిరాభివృద్ధికి పునాదులైన మానవ వనరులు, మౌలిక వసతుల అభివృద్ధి మీద దృష్టి సారించలేదు. నాణ్యమైన విద్య-ఉపాధి నైపుణ్యాలు, ఆరోగ్యం, వ్యవసాయరంగ మార్కెటింగ్‌లో సమూల మార్పులు, చిన్న పట్టణాల అభివృద్ధి, అధికార వికేంద్రీకరణ తదితర అంశాలను పట్టించుకోకపోవటంతోపాటు.. ఈ రంగాలలో కేటాయింపులను 'ఖర్చు చేసే పద్ధతులను' కూడా మార్చి ప్రతి రూపాయికీ ఫలితం వచ్చేలా చేయాలన్న ప్రయత్నం కూడా చేయలేదు. తెలంగాణకు ప్రధాన ఆదాయ వనరైన హైదరాబాద్‌లో కనీస సౌకర్యాల మెరుగుదలను ఈసారి మరీ నిర్లక్ష్యం చేశారు. యాంత్రికంగా, సారరహితంగా ఉద్యోగుల జీతాలు, పాత స్కీముల పద్దులాగానే బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ముస్ముందు ఆదాయం మెరుగుపడితే అందుకు తగ్గట్లు అంచనాలు సవరిస్తామన్నారుగానీ.. అప్పుడైనా మానవ వనరులు, మౌలిక వసతుల అభివృద్ధి తమ ప్రాథమ్యాలని కేసీఆర్ ప్రభుత్వం భరోసా ఇవ్వటం లేదు.



రూ. 1,46,492 కోట్లతో తెలంగాణ రాష్ట్ర తాజా వార్షిక బడ్జెట్‌ను ముఖ్యమంత్రి అసెంబ్లీలో ప్రవేశపెట్టగా, ఆర్థికమంత్రి హరీష్‌రావు శాసనమండలిలో బడ్జెట్ ప్రసంగ పాఠాన్ని చదివారు. ఇందులో పథకాల వ్యయం రూ. 75,263 కోట్లుకాగా, నిర్వహణ వ్యయం రూ. 71,226 కోట్లు. రెవెన్యూ మిగులు రూ. 2,044 కోట్లు. ద్రవ్యలోటు రూ. 24,081 కోట్లు.

ఆర్థికమాంద్యం వల్ల కఠిన వాస్తవాల ప్రాతిపదికగా బడ్జెట్‌ను తయారు చేశామని కేసీఆర్ తన ప్రసంగంలో తెలిపారు. "రాష్ట్రంలో పన్నుల ఆదాయం గణనీయంగా పడిపోయింది.

పన్నేతర ఆదాయం పడిపోయింది. ఆర్థికమాంద్యం ప్రభావంతోపాటు కేంద్రం నుంచి వచ్చే నిధులు కూడా తగ్గిపోయాయి" అని చెప్పారు. ఆదాయ వనరుల ఆధారంగా ప్రభుత్వం ఎప్పటికప్పుడు తన ప్రాధాన్యాలను నిర్ణయించుకుంటూ, సవరించుకుంటూ, క్రియాశీలంగా వ్యవహరిస్తుందని తెలిపారు. పూర్తి ఆశావహ దృక్పథంతో, వాస్తవ పరిస్థితులను పరిగణలోకి తీసుకుని, ఎన్నికల హామీలను నెరవేర్చేలా బడ్జెట్ ప్రవేశపెడుతున్నామన్నారు. "దేశంలో స్థూల ఆర్థిక విధానాలను శాసించేది కేంద్రమే. అది తీసుకొచ్చిన విధానాలనే రాష్ట్రాలు అనుసరించాలి. దీనికి తెలంగాణ కూడా అతీతం కాదు" అని వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి స్వీయ ఆదాయం తగ్గటంతోపాటు పన్నుల్లో వాటా చెల్లింపు, నిధుల బదలాయింపులో కూడా కేంద్రం కోత పెట్టిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలోనే తెలంగాణకు రావాల్సిన పన్నుల వాటాలో 4.19 శాతం కోత పెట్టిందని, దీంతో రాష్ట్రానికి తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు.

రాబడులతోపాటు బడ్జెట్‌ను ఏటా పెంచుకుంటూ వచ్చిన ప్రభుత్వం ఈసారి 2018-19 ఆర్థిక సంవత్సరం వ్యయాన్ని ప్రాతిపదికగా తీసుకుని గత నాలుగు నెలల పన్ను రాబడులను విశ్లేషించి ఐదు నెలల కిందటి ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ఐదో వంతు మేర తగ్గించి బడ్జెట్‌ను తీసుకొచ్చింది. ఈసారి బడ్జెట్‌కు గతేడాది రూ.1.30 లక్షల కోట్ల వ్యయమే ప్రధాన ప్రాతిపదిక. గత ఐదేళ్లలో సగటున 15 శాతం వృద్ధి రేటును నమోదు చేసిన జీఎస్‌టీ ప్రస్తుతం గణనీయంగా తగ్గిందని తెలిపింది. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి నాలుగు నెలల్లో రాబడులు గణనీయంగా తగ్గటంతో పన్ను రాబడుల్లో గరిష్ఠంగా 6 శాతం మించి వృద్ధి రేటు ఉండబోదని విశ్లేషించింది. రాష్ట్ర ప్రభుత్వం ఈసారి బడ్జెట్‌లో పెట్టుబడి వ్యయం రూ.17,274 కోట్లుగా

## తెలంగాణ బడ్జెట్ స్థూల స్వరూపం (అంకెలు రూ.కోట్లలో)

| అంశం | 2017-18 | 2018-19 (సవరించిన అంచనా) | 2019-20 (అంచనా) |
|---|---|---|---|
| రెవెన్యూ రాబడులు | 88,824 | 1,19,099 | 1,13,099 |
| ఎ) కేంద్ర పన్నుల్లో వాటా | 16,420 | 17,960 | 19,718 |
| బి) పన్నుల ఆదాయం | 56,519 | 66,749 | 69,328 |
| సి) పన్నేతర ఆదాయం | 7,825 | 6,347 | 15,875 |
| డి) గ్రాంట్లు | 8,058 | 28,041 | 8,177 |

**+ ఈ ఏడాది పెట్టుబడులపై 33,444 కోట్లు సమీకరించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో మార్కెట్ రుణాలు రూ.31,000 కోట్లు. అప్పులు దాదాపు 3 లక్షల కోట్లకు చేరినందున ఈ ఏడాది వడ్డీకి రూ.14,574 కోట్లు వెచ్చించాల్సి ఉంది. రాష్ట్రంలో తలసరి అప్పు 2020 మార్చి నాటికి రూ.88,068కి చేరనుంది. ఇది 2019 మార్చి తలసరి అప్పుతో పోలిస్తే రూ.15,026 అధికం.**

ఆర్థికమాంద్యం నెలకొన్నా వ్యవసాయం, ప్రజాసంక్షేమానికి అధిక నిధుల్ని కేటాయిస్తున్నట్లు తెలిపిన ముఖ్యమంత్రి.. పలు సంక్షేమ/జనాకర్షక పథకాలకు కోత లేకుండా బడ్జెట్‌లో కేటాయింపులు చేశారు. త్వరలో పరిస్థితిలో మార్పు వస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో పరిస్థితి మెరుగుపడి ఆదాయం పెరిగితే అందుకు తగ్గట్లు అంచనాలు సవరిస్తామని ప్రభుత్వం పేర్కొంది.

ప్రభుత్వ ప్రాధాన్య పథకాలలో భాగంగా రైతుబంధుకు రూ.12,000 కోట్లు, రైతు రుణమాఫీకి రూ.6,000 కోట్లు, విద్యుత్ రాయితీకి రూ.8,000 కోట్లు, ఆసరాకు రూ.9,402 కోట్లు, ఉపకార వేతనాలకు రూ.3,257 కోట్లు, కల్యాణలక్ష్మికి రూ.1,540 కోట్లు, రైతు బీమాకు రూ.1,137 కోట్లు కేటాయించారు.

2014-15 ఆర్థిక సంవత్సరం నుంచి రాష్ట్ర ప్రతిపాదించింది. పెట్టుబడి వ్యయం గణనీయంగా తగ్గటం ఇదే మొదటిసారి.

ఖజానాకు వచ్చే మొత్తంలో అమ్మకపు పన్ను వాటా 52 శాతం. ఈ మొత్తం పెట్రోలియం ఉత్పత్తులు, మద్యం అమ్మకాల ద్వారా వస్తుంది. గత నాలుగు నెలల్లో ఈ రెండింటి రాబడులు గణనీయంగా తగ్గాయి. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ రాబడులు ప్రస్తుతానికైతే ఆశించిన మేరకు వృద్ధి రేటు కొనసాగుతున్నా ముమ్మందు దీనిపైనా మాంద్యం ప్రభావం ఉంటుందని అంచనా. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ నాటికి పన్నుల రాబడిలో 14 శాతం వృద్ధిరేటు ఉంటుందని భావించగా, తాజాగా 6 శాతంగా మాత్రమే ఉంటుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. కేంద్రం నుంచి గ్రాంట్ల రూపంలో అందే మొత్తం గత అంచనాల కంటే గణనీయంగా తగ్గింది. గ్రాంట్లు రూ.8,000 కోట్లకు మించి అందే అవకాశం లేదని భావిస్తోంది.

తెలంగాణ స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) జాతీయ స్థాయి కంటే ఎంతో ముందంజలో ఉంది. స్థిర ధరల వద్ద 10.5 శాతం వృద్ధి రేటును నమోదు చేసుకుంది. అయితే ఆర్థిక మందగమనం వల్ల జీఎస్‌డీపీ కూడా 1 శాతం మేర తగ్గే అవకాశముందని ప్రభుత్వం భావిస్తోంది.

## సాగునీటికి రుణాలపైనే దృష్టి

సాగునీటి రంగానికి రూ. 8,490 కోట్లు కేటాయించిన ప్రభుత్వం ప్రాజెక్టులకు బడ్జెట్ వెలుపల నుంచే నిధులను సమీకరించుకోవాలని చూస్తోంది. మిషన్ భగీరథ, రెండు పడక గదుల ఇళ్ల విషయంలోనూ రుణాలతోనే ముందుకు వెళ్లాల్సిన పరిస్థితి. ఇప్పటికే రూ. 10,000 కోట్లు రుణం తీసుకోగా మరో రూ. 20,000 కోట్లు అప్పుగా తీసుకోవలసిందే. బడ్జెట్ వెలుపల మరో రూ. 30,000 కోట్ల సమీకరణపైనా రాష్ట్ర సర్కారు దృష్టి సారించింది.

**రూ.10,000 కోట్లతో ప్రత్యేక అభివృద్ధి నిధి**

ప్రభుత్వం రూ. 10,000 కోట్లతో ప్రత్యేక అభివృద్ధి నిధిని ఏర్పాటు చేసింది. ప్రత్యేక పరిస్థితుల్లో.. వివిధ అభివృద్ధి పనులకు అవసరమైన మేర ఖర్చు చేయడానికి ఈ నిధి ద్వారా అవకాశం ఉంటుందని పేర్కొంది. భూముల అమ్మకం ద్వారా రూ. 10,000 కోట్లను సమీకరించి వాటిని ప్రత్యేక అభివృద్ధి నిధి ద్వారా ఖర్చు చేస్తారు.

## ప్రధాన శాఖలవారీగా బడ్జెట్ కేటాయింపులు (రూ.కోట్లలో)..

| | |
|---|---|
| వ్యవసాయం, సహకారం: | 20,566 |
| వ్యవసాయ మార్కెటింగ్: | 105.65 |
| పశు సంవర్ధక శాఖ, చేపలు: | 1,452.72 |
| నీటి పారుదల, ఆయకట్టు అభివృద్ధి: | 8,490.75 |
| ఉన్నత విద్య: | 1,691.80 |
| ప్రాథమిక విద్య: | 8,224.65 |
| వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం: | 5,694.17 |
| వెనుకబడిన తరగతులు: | 3,267.40 |
| స్త్రీ, శిశు సంక్షేమం, వికలాంగులు, వయోవృద్ధులు: | 1,507.70 |
| ఎస్.సి సంక్షేమం: | 2,753.88 |
| గిరిజనాభివృద్ధి: | 1,898.68 |
| మైనారిటీ సంక్షేమం: | 1,369.95 |
| ఆర్థిక శాఖ: | 34,519.25 |
| రెవెన్యూ: | 1,880.20 |
| హోం: | 4,989.87 |
| విద్యుత్తు (ఇంధనం): | 8,299.45 |
| శాస్త్ర సాంకేతిక రంగం: | 791.49 |
| ఆహార, పౌర సరఫరాలు: | 2,355.84 |
| గృహ నిర్మాణం: | 1,005.69 |
| పరిశ్రమలు: | 397.40 |
| సమాచార సాంకేతికత: | 63.30 |
| మౌలిక వసతులు, పెట్టుబడులు: | 28.23 |
| కార్మిక, ఉపాధి కల్పన: | 391.02 |
| న్యాయశాఖ: | 753.68 |
| పురపాలికలు, పట్టణాభివృద్ధి: | 3,284.03 |
| పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి: | 18,237.13 |
| ప్రణాళిక శాఖ: | 10,315.40 |
| రవాణా, రహదారులు, భవనాలు: | 1,411.94 |
| యువజన, పర్యాటక, సాంస్కృతిక శాఖ: | 107.29 |



# వారిది జాబ్‌లెస్ గ్రోత్..

## వీరి జమానాలో జాబూ లేదు, గ్రోతూ లేదు!

ఆర్థికమందగమనానికి ఆటోమొబైల్ రంగంలో కొనుగోళ్లు పడిపోవటమే నిదర్శనమని పలువురు విశ్లేషకులతోపాటు రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు కూడా అభిప్రాయపడుతుండటంపై స్పందిస్తూ.. ఈఎంఐల భారం పట్ల భయం, మారుతున్న ఆలోచనా ధోరణులతో మిలీనియల్ యువత ఊబర్, ఓలా క్యాబ్స్‌లో ప్రయాణంవైపు మొగ్గు చూపుతూ కొత్త కార్లను కొనటం లేదని, దీనివల్ల వాహనాల అమ్మకాలు పడిపోయాయని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల అన్నారు. కొత్త ఇంధన ప్రమాణాల వంటి అవరోధాలను కూడా ఆమె ప్రస్తావించినా.. ఊబర్, ఓలా ఫ్యాక్టర్‌పై మంత్రి చేసిన వ్యాఖ్యల మీదనే ఎక్కువ చర్చ జరిగి రచ్చగా మారింది, పెద్దఎత్తున విమర్శలు వచ్చాయి. అయితే ఆర్థికమంత్రి చేసిన ఆ వ్యాఖ్యలు పూర్తిగా కొట్టిపారేయలేనివి కూడా.

ఊబర్, ఓలా, ఇతరత్రా షేరింగ్ ప్రయాణాలు, మెట్రో కల్చర్ మనదేశంలో వాహనాల కొనుగోలును తీవ్రంగా ప్రభావితం చేసే స్థాయికి ఇంకా చేరకపోయినా, అమ్మకాలు తగ్గటానికి ఇంకా అనేక అంశాలు కారణంగా ఉన్నా కూడా.. ఆ కల్చర్ ప్రభావం మొదలైందనటంలో సందేహం లేదు. ఈ విషయంలో మనం ప్రభుత్వం మీద విమర్శ చేయటం కన్నా.. సమస్యపై సకాలంలో స్పందించటంలో, ప్రత్యామ్నాయ పరిష్కారాల్ని వెదకటంలో పాలకులు విఫలమవటాన్ని నిలదీయాలి.

కాస్త అటూఇటుగానైనా ఆటోమొబైల్ రంగంలో గడ్డుకాలం పొంచివుందని, దీన్ని గుర్తించకపోతే యువత, విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ సురాజ్య యాత్ర సందర్భంలో 2017లోనే హెచ్చరించారు. ఊబర్, ఓలా వంటి నూతన ఆలోచనల వల్ల.. ఇప్పటిదాకా అతి పెద్ద ఉపాధి కల్పన చేస్తున్న ఆటోమొబైల్ రంగంలో ఉద్యోగాలు తగ్గుతున్నాయని స్పష్టం చేశారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చర్ల మండలం చిలకలపాలెం జంక్షన్‌లోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులనుద్దేశించి జేపీ (ఫోటోలో చూడవచ్చు) చెప్పిన ఈ మాటల్ని 'లోక్‌సత్తా టైమ్స్ డిసెంబర్ 1-15, 2017 సంచిక'లో కూడా 'నెక్స్ట్ ఏంటి?.. 70 శాతం ఉద్యోగాలు ఏమిటో కూడా తెలియవు' అనే శీర్షికతో ప్రచురించాం. ఆ తర్వాత పశ్చిమ గోదావరి జిల్లాలోని మరో ఇంజినీరింగ్ కళాశాలలో కూడా ఆ అంశాన్ని జేపీ సోదాహరణంగా వివరించారు. 'భీమవరంలో



గజం స్థలం విలువ ఎంత? నెలకి కొన్ని గంటల్లో, మహాఅయితే ఓ వారం రోజులో మాత్రమే కారును ఉపయోగించేవారి పార్కింగ్ కోసం ఎంత స్థలం అవసరం? ఊబర్, ఓలా వంటి హైరింగ్, షేరింగ్ సర్వీసుల ద్వారా ఆ స్థలాన్ని ఆదా చేసుకునే, నిర్వహణ వ్యయాన్ని గణనీయంగా తగ్గించుకునే అవకాశం ఉన్నప్పుడు వ్యక్తిగతంగా కారును ఎందుకు కొనుక్కోవాలి? సంస్థలు కూడా కార్లు, డ్రైవర్లను ఎందుకు మెయిన్‌టెయిన్ చేయాలి?'.. వంటి ప్రశ్నల్ని విద్యార్థుల చేతే సమాధానం ఇప్పించారు. చివరికి ఆ సమావేశంలో విద్యార్థులే అంగీకరించారు- రాబోయే కాలంలో కార్ల అమ్మకాలు తగ్గి తద్వారా ఉద్యోగాలు తగ్గిపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి అని. ఈ అంశాన్ని ఇంకొందరు నిపుణులు ప్రస్తావిస్తూనే ఉన్నారు. కానీ ప్రభుత్వానికి ఇప్పటిదాకా ఈ మార్పుల మీద ఆలోచనే లేదు.

మన దేశంలో ఆటోమొబైల్ రంగం ప్రైవేటు కంపెనీలకు సంబంధించిన పోటీ రంగమే కావచ్చు, కొందరు వాదిస్తున్నట్లు ఈ రంగంలో ఇప్పటికిప్పుడు తీవ్ర సంక్షోభం లేకపోవచ్చు, కానీ వ్యక్తిగత వాహనాల సెగ్మెంట్‌లో పరిణామాలు సహా వివిధ కారణాల వల్ల గడ్డుకాలం పొంచివుందనే విశ్లేషణలు, సంకేతాలు స్పష్టంగా ఉన్నప్పుడు.. ఇందులో దేశ ఆదాయం, యువత ఉపాధి వంటి అనేక కీలకాంశాలు ఇమిడి ఉన్న దృష్ట్యా స్పందించి ప్రత్యామ్నాయాలను వెదకటం ప్రభుత్వ బాధ్యత. గ్రామీణాదాయాలు పెంచి అక్కడికి తగ్గ కొత్త బ్రాండ్లను, మార్కెట్లను సృష్టించే మార్గాలకు ప్రోత్సాహాన్నివ్వటం, మౌలిక వసతులను కల్పించటం ద్వారా అటు వ్యవసాయం, పర్యావరణం, ఇటు పరిశ్రమలు, మొత్తంగా దేశ ప్రయోజనాలనూ పరిరక్షించేలా సృజనాత్మక ప్రణాళికల్ని

తీసుకురావటం వంటివి ప్రభుత్వం చేయాలి. ఇక ఏ మార్గమూ లేని పరిస్థితి వచ్చేదాకా చేతులు ముడుచుకుని ప్రజల పన్నుల డబ్బును రాయితీలుగా పందేరం చేసేద్దాం అన్నట్లు ప్రభుత్వం వ్యవహరించటం అధికార దుర్వినియోగం, పక్షపాత పాలనే అవుతుంది. ఇక ఆర్థికమంత్రి కేవలం అమ్మకాలు, ఆర్థిక వృద్ధే తమ తొలి ప్రాధాన్యమన్నట్లు మాట్లాడటాన్ని కూడా మనం ఆమోదించకూడదు.

వృద్ధి, ఉద్యోగాలు వేర్వేరు కాదు. ముఖ్యంగా భారతీయ నేపథ్యంలో.. వృద్ధిని, ఉద్యోగాలను విధిగా కలిపి చూడాలి.

వృద్ధిని, ఉపాధిని వేర్వేరుగా చూడకూడదని యూపీయే హయంలో డా॥ మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పటి నుంచీ జాబ్‌లెస్ గ్రోత్ (దీన్నే ఇప్పుడు కొంతమంది నాణ్యతలేని ఆర్థికాభివృద్ధిగా అభివర్ణిస్తున్నారు) ఉంటే, మోదీ హయాంలో ఏకంగా జాబూ లేదు, గ్రోతూ లేదు అన్నట్లు పరిస్థితి తయారైంది. సింగ్ హయాంలో కూడా ఒకట్రొండేళ్లు ఇప్పుడున్న కనిష్ఠ వృద్ధి రేటు వచ్చిందిగానీ, మిగిలిన పరామితులు ఇంత వ్యవస్థీకృత అధ్వాన్నంగానైతే లేవు.

ఇంతకుముందే జేపీ సురాజ్య యాత్ర రిపోర్టులో






జేపీ స్పష్టం చేస్తూ వస్తున్నారు. అందుకే సింగ్ హయాంలో ఉపాధి లేని వృద్ధిని తీవ్రంగా విమర్శించారు.

"ప్రధానిగారూ! జాబ్‌లెస్ గ్రోత్‌ను మీరు కొనసాగిస్తున్నారు, ఇదే ఒరవడిని మీరు కొనసాగిస్తే దేశానికి మీరు చాలా నష్టం చేసినవారవుతారు. ఏటా 1 కోటీ 30 లక్షల మంది యువత కొత్తగా ఉద్యోగాల కోసం వస్తున్నారు. ఈ నేపథ్యంలో వస్త్ర పరిశ్రమలో చైనా వదిలేసిన లక్షలాది ఉద్యోగాలను ఒడిసిపట్టుకోవాలి. జన్యు సాంకేతిక పరిజ్ఞానానికి తోడు మన రైతుల కష్టం వల్ల భారత్ పత్తి ఉత్పత్తిలో మొదటిస్థానంలో ఉన్నా మన కార్మిక విధానాలు, ఉత్పత్తి రంగం పట్ల మన చిన్నచూపు వల్ల మనం అవకాశాల్ని కోల్పోతున్నాం. అలాగే వైద్య రంగ విధానాన్ని సమూలంగా మారిస్తే 1 కోటికి పైగా కొత్త ఉద్యోగాలను సృష్టించవచ్చు. విద్యారంగాన్ని సమూలంగా ప్రక్షాళన చేసి నైపుణ్యాలను పెంచితే సంపద సృష్టికర్తలు, రంగాలు, సంఘటిత రంగంలో ఉపాధిని అందుకోగలిగినవారు పెరుగుతారు. చైనాలోని ఎస్ఎంఈల తరహాలో చిన్న పట్టణాలను ఆర్థిక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తే వ్యవసాయాధారిత, వ్యవసాయేతర రంగాల్లో ప్రతి రాష్ట్రంలో లక్షల మందికి ఉపాధి అవకాశాల్ని కల్పించవచ్చు" అని 2010లోనే జేపీ డా॥ సింగ్ దృష్టికి తీసుకెళ్లారు. 2014లో బీజేపీ ప్రధాని అభ్యర్థి మోదీని జేపీ సమర్థించటానికి ప్రధానంగా ఉపాధి కల్పన హామీయే కారణం. మన్మోహన్ హయాంలో ప్రస్తావించినట్లు.. వృద్ధిని, ఉపాధిని కలిపి చూసే క్రమంలో విద్యాప్రమాణాల్ని కూడా అందులో భాగంగా చూడాలి. ఊబర్, ఓలాల వంటి పరిణామాల వల్ల ఆర్థిక వ్యవస్థలో కొత్త మార్పులు వస్తున్నప్పుడు ఉపాధి నైపుణ్యాలను పెంచాలంటే, ఎంటర్‌ప్రెన్యూర్‌లను తయారుచేయాలంటే.. ముందునుంచే విద్యాప్రమాణాల్ని పెంచటం, పాఠ్యాంశాలు, బోధనను మార్చటం చేయాలి. ఆటోమొబైల్ రంగంలోనైతే కొత్తగా ఇంజినీరింగ్ చదివేవాళ్లు నూతన మార్పులను అందిపుచ్చుకునే విధంగా వారికి నైపుణ్యాల్ని అందించాలి.. ఈ పని ఇప్పటికీ చేయటం లేదు. భావోద్వేగాలతో మైమరపిస్తూ కాలక్షేపం చేస్తున్నారు తప్ప నాణ్యమైన విద్య గురించి పట్టించుకోవటం లేదు. ఈ అంశాన్ని కూడా వివరంగా 2017 సురాజ్య యాత్రలో ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులతో జేపీ ప్రస్తావించారు.

"గత ఏడాది క్వశ్చన్ పేపర్లను వదిలేసి అంతకుముందు మూడేళ్ల పేపర్లను బట్టీ పట్టేస్తే పరీక్షల్లో ఫస్ట్ క్లాస్ గ్యారంటీ. కానీ ఉపాధి రంగంలో ఎలా ప్రిపేరవ్వాలో ఎవరూ చెప్పలేకపోతున్నారు. విషయాన్ని అర్థం చేసుకోకుండా, నూతన మార్పులకనుగుణంగా వ్యవహరించగల శక్తి లేకుండా చదువుకుంటే.. ఫస్టు ర్యాంకులు వచ్చినా జాబ్ మార్కెట్‌లో ఏమీ ఉపయోగం ఉండదు. ఎడిటివ్/ ప్రింటింగ్ గురించి ఎంతమంది విన్నారు? ఎడిటివ్, త్రీ డీ ప్రింటింగ్ టెక్నాలజీ వల్ల ముమ్ముందు ఉత్పత్తిరంగంలో మనుషుల అవసరం ఉండదు. జస్ట్


కంప్యూటర్‌ను ప్రోగ్రాం చేయటానికి మాత్రమే మానవ వనరులు అవసరమవుతాయి. అలాగే సమావేశ మందిరాలు వంటి వాటిలో ఏసీలు అవసరం లేకుండానే చిన్న ప్లాస్టిక్ పొరల వంటివి అతికిస్తే 19 డిగ్రీల వరకూ కూల్ అవుతుంది. అందుకే ఇంజినీరింగ్ చదువును మార్కుల కోసం కాకుండా.. సమాజ అవసరాల కోసం చదవాలి, సొంతంగా పరిష్కారాలను అభివృద్ధి చేసే సత్తాను ప్రదర్శించాలి. నూతన ఆవిష్కరణల మీద దృష్టి పెట్టండి. వ్యవసాయాన్ని-పరిశ్రమలను అనుసంధానించటం వల్ల ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. మీ తర్వాతి తరం గురించి కూడా కొంత ఆలోచన చేయండి. రాబోయే కాలంలో డిమాండ్ ఉండే ఉద్యోగాల్లో 70శాతం దాకా ఇంకా సృష్టించబడ లేదని పలువురు నిపుణులు చెబుతున్నారు. అలాంటి డిస్రప్టివ్ వ్యవస్థలో మనుగడ సాగించాలంటే గట్టి విద్యాపునాదులు ఉండాలి. అందుకోసం పాఠశాల విద్యను బలోపేతం చేయటమే మార్గం. ఇందుకోసం కూడా మీ వంతు ప్రయత్నం చేయండి" అని విద్యార్థులకు ఈ సందర్భంగా జేపీ సూచించారు.

### ఇంత పెద్ద సవాలును మానవజాతి చరిత్రలో ఏ దేశం ఎదుర్కోలేదు

"ఆర్థిక వ్యవస్థలోని వివిధ రంగాల్లో ఏరోజు ఎలాంటి మార్పు వస్తుందో తెలియని అనిశ్చితి దశలో ఉన్నాం. మనదేశంలో ఉద్యోగాల కోసం ఏటా మార్కెట్‌లోకి వస్తున్న 1కోటీ 30లక్షల మందికి ఏరకమైన ఉద్యోగాలు దొరుకుతాయో కూడా చెప్పలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఇంత పెద్ద సవాలును మానవజాతి చరిత్రలో ఏ దేశం ఎదుర్కోలేదు. దీన్ని ఎదుర్కోగలిగిన పాలనా సామర్థ్యాన్ని మన ప్రభుత్వాలు ప్రదర్శించకపోవటం వల్ల పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. ఓపక్క భారత్ మహాన్ వంటి నినాదాలతో కాలక్షేపం చేస్తున్న నేతలు, మరోపక్క జీవితం పట్ల ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్న విద్యార్థులు, యువతీయువకులు.. ఈ మోసాన్ని, వైరుధ్యాన్ని చూస్తుంటే గుండెల్లో నుంచి బాధ పెల్లుబుకుతోంది" అని జేపీ అన్నారు.

ఆటోమొబైల్ అనే కాదు, మిగిలినరంగాల్లో కూడా ఇప్పుడు భారతదేశానికి ప్రత్యేకించి ఆర్థిక మందగమనమో, మాంద్యమో లేదు.. సకాలంలో మార్పులకు తగ్గ విధానాలను గుర్తించి అమలు చేసే నాయకత్వం లేకపోవటం వల్ల తలెత్తిన సమస్యలు మాత్రమే ఉన్నాయి. ప్రభుత్వాల విధానాలు, ఆలోచనల వైఫల్యమే మన దేశాభివృద్ధిని, యువత ఉపాధిని దెబ్బతీస్తున్నాయి. యువతకు సంఘటిత రంగంలో ఉపాధి కల్పించటాన్ని, ఆర్థిక వృద్ధిని కలిపి చూస్తూ అందుకనుగుణంగా విద్యావ్యవస్థను కూడా మలిచే విధానాలు కావాలిప్పుడు. సురాజ్య యాత్రలో ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు 2017లో జేపీ చేసిన సూచనల్ని ప్రభుత్వాలు, సమాజం పట్టించుకుంటేనే ఇప్పటి ఆర్థిక అవరోధాలను దాటగలం, మున్ముందు అవరోధాలు రాకుండా నివారించుకోగలం. ఉద్దీపనల కన్నా ఇప్పుడు దేశానికి కావలసింది ఈ రకమైన చర్చ, పరిష్కారాలు!

## వలసల్ని నియంత్రించండి



విజయనగరం జిల్లాలో వ్యవసాయానికి గిట్టుబాటు ధర లేక రైతులు.. పరిశ్రమలు మూతపడి కార్మికులు.. ఉపాధి లేక విద్యార్థులు వలస వెళుతున్నారని, వీటిని నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పుష్పశ్రీవాణిని కలిసి విజ్ఞప్తి చేశారు. గతేడాది ఖరీఫ్, రబీ రెండూ దెబ్బతిన్నాయని, పంటలు చేతికి రాక అప్పులు పుట్టక రైతులు అల్లాడిపోతున్నారన్నారు. 34 మండలాల్లో 26 మండలాలు పంటలు పంటలు లేని దయనీయస్థితిలో ఉన్నాయన్నారు. గత ప్రభుత్వం గురజాడ పేరుతో యూనివర్సిటీని ప్రకటిస్తే ఏయూ అధికారులు ఆ పేరును తొలగించి తరగతులు నిర్వహిస్తున్నారని, దీనిపై ప్రభుత్వం తక్షణం ప్రకటన చేయాలన్నారు. జిల్లాకు క్యాన్సర్ ఆస్పత్రిని మంజూరు చేయించాలని, మూతపడిన పరిశ్రమలను తెరిపించాలని బాబ్జీ కోరారు. మంత్రిని కలిసినవారిలో లోక్‌సత్తా పార్టీ నాయకులు భాస్కర్, రాజారావు, మహేష్ తదితరులు ఉన్నారు.

## ఈజ్ ఆఫ్ లివింగ్:

# హౌడీ మోదీలో ప్రధాని చెప్పింది ఒట్టి గ్యాస్

క్రికెట్ ఐపీఎల్‌లో దక్షిణ భారతదేశంలోని ప్రతి రాష్ట్రంలోని నగరాల పేరు మీదా టీమ్‌లు ఉన్నాయిగానీ, ఆంధ్రప్రదేశ్‌లోని సిటీ పేరు మీద మాత్రం లేదని పలువురు తెలుగువారు వాపోతుంటారు. ఏపీ క్యాపిటల్ అమరావతిని అద్భుతంగా నిర్మించాలని సంకల్పించి, పని మాత్రం చేయకుండా తాత్కాలిక తాయిలాల్లా తాత్కాలిక నిర్మాణాలతో సాగదీస్తూ పొలిటికల్ క్యాపిటల్‌గా ఆ ప్రాజెక్టును వాడుకుందామని ప్రయత్నించి తెలుగుదేశం నేత చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి పదవిని కోల్పోతే.. అధికారంలోకొచ్చిన వైఎస్ జగన్ ప్రభుత్వం అమరావతికి అంత సీన్ అవసరమా అన్నట్లు నగరాభివృద్ధిని నీరుగార్చేలా వ్యవహరిస్తోంది.

పట్టణాలు, నగరాలు, గ్రామాలలో స్థానిక ప్రభుత్వాలైన మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు, పంచాయతీలలో పరిపాలన అంటేనే చిన్నచూపు చూస్తూ వాటిలో పాలనను ఛిన్నాభిన్నం చేసిన మన ప్రభుత్వాలు, సాంప్రదాయ రాజకీయ నాయకులు.. నగరానికి, రాజధానికి ఎంతెంత ప్రాధాన్యమిస్తే ప్రజలకు మేలు జరుగుతుందన్న ఆలోచన చేయకపోవటమే ఈ దుస్థితికి కారణం. రాజధాని, ప్రపంచస్థాయి రాజధాని వంటి కిరీటాల్ని పక్కనపెడితే.. నగరాలు ఆర్థికాభివృద్ధి, ఆదాయ కేంద్రాలుగా మారుతున్నాయి కాబట్టి ఏపీకి ఆర్థికంగా ఒక పెద్దనగరం అవసరమని, అందువల్ల అమరావతిని రాష్ట్ర ప్రభుత్వం, అసెంబ్లీ ఏ ఉద్దేశంతో రాజధానిగా ఎంచుకున్నా తిరగదోడకుండా ఆర్థిక, ఆదాయ కేంద్రంగా అభివృద్ధి చేయాలన్న లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ చేసిన సూచన చాలా ఆచరణీయమైనది.




ఇదేసమయంలో నగరాల్లో మౌలిక వసతుల్ని, నాణ్యమైన పౌర సేవల్ని అభివృద్ధి చేయకపోతే జనం బతుకులు నరకంగా మారి, అది క్రమంగా ఆర్థికంగా కూడా ప్రతికూల ప్రభావం చూపుతుంది. వీలైనన్ని నగరాలను ఆర్థిక కేంద్రాలుగా మార్చటం, వాటిల్లో వార్డు స్థాయి నుంచి స్థానిక పాలనను బలోపేతం చేయటం, ఇందుకోసం మేయర్ల ప్రత్యక్ష ఎన్నికల్ని నిర్వహించటం, నగర పాలక సంస్థలకు నిధులు, అధికారాలను రాష్ట్ర బడ్జెట్ నుంచే బదిలీ చేయటం వంటి చర్యల్ని ఒక విధానంగా అమలు చేయాలి. స్మార్ట్ సిటీల పేరుతో పాత గోడలకు కొత్తగా రంగులేసి అలంకరిస్తే సరిపోదు. విద్య, ఆరోగ్యం, తాగునీరు, మురుగునీటి పారుదల ఏర్పాట్లు, వరద ముంపు లేకుండా చేయటం వంటి చర్యల్ని తీసుకోవాలి. తాజాగా ఎకనామిస్ట్ ఇంటెలిజెన్స్ (ఈఐయూ) యూనిట్ విడుదల చేసిన వార్షిక సర్వే వివరాలు కూడా ఇదే హెచ్చరికను చేస్తున్నాయి. ప్రపంచంలో అత్యంత నివాసయోగ్య నగరాలు ఏవి? అని సర్వే చేసి 140 నగరాలతో ఒక జాబితాను విడుదల చేశారు. ఇందులో మనదేశ రాజధాని, ఆర్థిక రాజధానిగా మనం ఘనంగా చెప్పుకునే రెండు మహానగరాలు ఢిల్లీ, ముంబయిలకు 118, 119 స్థానాలు లభించాయి. గతేడాది కంటే తమ ర్యాంకుల్లో ఇవి దిగజారాయి. సుస్థిరత, ఆరోగ్యం, సంస్కృతి–పర్యావరణం, విద్య, మౌలిక వసతులు అనే ఐదు స్థూల కేటగిరీల కింద 30 అంశాల్లో సర్వేను నిర్వహించారు. సులభ వాణిజ్యం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్)లో వేగంగా ముందుకు దూసుకొస్తున్నాయని ప్రపంచ బ్యాంకు గుర్తింపు కూడా పొందిన నగరాలివి. ప్రపంచబ్యాంకు ప్రశంసకు ప్రధాని మోదీ ట్విట్టర్‌లో జబ్బలు కూడా చరుచుకున్నారు. కానీ మిగతా దేశాలతో పోలిస్తే జీవనయోగ్యతే లేనప్పుడు, ఉన్నది దిగజారుతున్నప్పుడు మేకిన్ ఇండియా, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తాత్కాలిక విన్యాసాలుగా మాత్రమే తప్ప.. సుస్థిరంగా ఎలా కొనసాగుతాయి?

ఇటీవలే మన దేశ పరిధిలో చేసిన ఓ సర్వేలో దేశంలో అత్యంత జీవనయోగ్య నగరాలుగా పేరు సంపాదించిన హైదరాబాద్ సహా పలు నగరాలకు అంతర్జాతీయ జాబితాలో చోటే దక్కలేదు. ఈ దేశీయ సర్వే ప్రమాణాలపై సందేహాలు రావొచ్చుగానీ.. ముంబయిలో వర్షాలకు రోడ్ల మీద పీకల్లోతు కూరుకుపోయిన వాహనాల్ని, దుకాణాల్ని, ఈదుకుంటూ వెళ్తున్నట్లు రాకపోకలు సాగిస్తున్న ప్రజానీకాన్ని చూశాక ఎకనామిస్ట్ గ్లోబల్ సర్వేపై సందేహించ దగినది కూడా ఏమీ కనిపించదు. ఈజ్ ఆఫ్ లివింగ్‌లో కూడా మేం భేషుగ్గా ఉన్నామని హ్యూస్టన్ హౌడీ – మోదీ సభలో నరేంద్ర మోదీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఎన్నారైల ముందు చెప్పింది ఒట్టి గ్యాస్ తప్ప నిజం కాదని ఈ సర్వే ఆధారంగా నిస్సంకోచంగా చెప్పేయవచ్చు.

ప్రపంచస్థాయి వనరులు, అవకాశాలు ఉన్నా.. అథమస్థాయి రాజకీయాల వల్ల మన దేశంలోని నగరాలకు ఈ దుస్థితి ఏర్పడింది. అధికారాన్ని వికేంద్రీకరించి నగరాలలో స్వయంపాలనను ప్రోత్సహించి ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రి కేవలం పర్యవేక్షణకే పరిమితమైతే మన నగరాలు తమ అర్హతకు తగ్గట్టు ప్రపంచస్థాయిని అందుకోగలుగుతాయి, ప్రజలు కూడా సుఖసంతోషాలతో బతకగలుగుతారు. హాయిగా బతకటానికి కాకపోతే రాజకీయాలు, పాలన, అభివృద్ధి ఎందుకంట?

# మీడియాలో 'క్' కామెంట్లు!

*స్వతంత్ర భారతదేశ చరిత్రలోనే ఎన్నడూలేని స్థాయిలో రూ.1,76,000 కోట్ల మేర దేశ ఖజానాకు నష్టం చేకూర్చేలా 2జీ స్పెక్ట్రం కేటాయింపుల్లో అక్రమాలు జరిగాయని 'కాగ్' ఇచ్చిన రిపోర్టును ఆ కేసు విచారణలో సుప్రీంకోర్టు పరిగణలోకి తీసుకోలేదు. రిపోర్టు పీఏసీ ముందు పెండింగ్‌లో ఉన్నందున దాన్ని ఆధారంగా తీసుకోవటం లేదని కోర్టు ఉత్తర్వులో స్పష్టం చేసింది. 2జీ కేటాయింపుల్లో అక్రమాలు జరిగాయని, వాటిని రద్దు చేయాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్)లోని వాదనల ఆధారంగానే సుప్రీంకోర్టు ఆ లైసెన్సుల్ని రద్దుచేసింది. (2జీ స్పెక్ట్రం లైసెన్సుల రద్దుని కోరుతూ డిసెంబర్, 2010లో సుప్రీంకోర్టులో లోక్‌సత్తా పిటిషన్ దాఖలు చేసింది. లాలూచీతో అవినీతికి పాల్పడ్డ కేసులలో లంచం ఇచ్చి లాభాలు పొందినవారి నుంచి ఆ సొమ్మును కక్కించకపోతే భవిష్యత్తులో అవినీతిని, లాలూచీని అడ్డుకోవటం సాధ్యంకాదని వాదించింది. ఇకనుంచైనా ప్రకృతి వనరుల కేటాయింపులో లాలూచీ అవినీతికి ఆస్కారం లేకుండా పోటీ బిడ్డింగ్, పారదర్శకతలతో కేటాయింపులు జరపాలని కోరింది. అత్యున్నత న్యాయస్థానం లోక్‌సత్తా వాదనల్ని బలపరిచింది. 2జీ లైసెన్సుల కేటాయింపు ఏకపక్షంగా, రాజ్యాంగవ్యతిరేకంగా జరిగాయని 2012, ఫిబ్రవరి 2న సుప్రీంకోర్టు నిర్ద్వంద్వంగా ప్రకటించింది. 122 లైసెన్సుల్ని రద్దు చేసింది. దీనివల్ల రూ.లక్ష కోట్లకు పైగా దేశ ప్రజల డబ్బు దోపిడీ నుంచి రక్షించబడి ఖజానాకు ఆదాయంగా మారింది. ఈ తీర్పు వల్లే 2014 నుంచి.. బొగ్గు సహా అన్ని ప్రకృతి వనరుల కేటాయింపుల్లో బహిరంగ వేలం పోటీ విధానం అమల్లోకి వచ్చి దోపిడీకి ఓ పెద్ద మార్గం మూసుకుపోయింది. సంయుక్త పార్లమెంటరీ సంఘం (జేపీసీ) వేయటం, దోషులను శిక్షించటం అని ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న డిమాండ్ల కన్నా ముందు.. లైసెన్సుల రద్దుతో దేశ ప్రజల డబ్బును కాపాడటం, ఇక ముందు వనరుల దోపిడీకి ఆస్కారంలేని విధానాలు ముఖ్యమని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ చేసిన వాదన కూడా వాస్తవికమైనదని ఆ తరువాతి పరిణామాలు రుజువు చేశాయి. హై ప్రొఫైల్ కేసుల్లో దోషులకు శిక్ష పడేలా చేసే శక్తిసామర్థ్యాలు మన దర్యాప్తు సంస్థలకు లేవని మరోమారు తేటతెల్లమైంది). కానీ దోషులపై కేసు విచారణకొచ్చేసరికి, నేర నిరూపణలో ప్రాసిక్యూషన్ ఘోరంగా విఫలమవటంతో వారంతా నిర్దోషులుగా విడుదలయ్యారు. ఇది నా అభిప్రాయం కాదు. ప్రాసిక్యూషన్ వైఫల్యంపై సీబీఐ ప్రత్యేక కోర్టు జడ్జి స్వయంగా అన్న మాటల్నే నేను చెబుతున్నాను.*



*- వినోద్ రాయ్, 2జీ కేటాయింపులపై నివేదికను రూపొందించిన సీఏజీ*

సుప్రసిద్ధ రాజ్యాంగ వ్యాఖ్యాత, అమెరికన్ అటార్నీ, మానవ హక్కుల పరిరక్షణా సంస్థ ప్రతినిధి జాన్ వైట్‌హెడ్ "మూడే మూడు మాటలతో" ప్రారంభమయ్యే అన్ని దేశాల రాజ్యాంగాల గురించి ఇలా అన్నాడు: "ఆ మూడు అందమైన మాటలు– "మేము అంటే ప్రజలం" అని. మనం లేకుండా, మన శ్రమ లేకుండా సంపదైశ్వర్యాలు.. మనం సృష్టించే ఆర్థిక వ్యవస్థ లేకుండా ప్రభుత్వాలు, పాలకులు ఉండరు. అయినా విచారకరమైన 'పచ్చి' వాస్తవం– మన మనస్సులను కుదిపి కదపలేక పోవటం! ఎందుకని? దేశ పాలనా రథానికి రథికులు (డ్రైవర్లు) అయినవారు నిద్రపోవటం వల్ల వాస్తవాలు కనుమరుగవుతున్నాయి. మనం ప్రశ్నించడం మానుకున్నాం, మన శాసన వేదికలకు పంపిన ప్రతినిధులు రాజ్యాంగ నిబంధనలకు కట్టుబడి ఉండేలా కట్టడి చేయడంలో విఫలమవుతున్నాం, ఫలితంగా పాలకులు మన నెత్తిపైన ఎక్కి అసాధారణ అధికారాన్ని చెలాయిస్తున్నారు. ప్రజలను అణచివేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజలు నిద్రమత్తు వదలకపోతే మన మీద విరుచుకుపడ్డానికి కాచుక్కూర్చున్న మృగాన్ని అదుపుచేయడం కష్టమని గ్రహించాలి."

**- ఏబీకే ప్రసాద్, సీనియర్ సంపాదకులు**

అంబేద్కర్‌పై ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాలలో వచ్చిన ఒక వివక్షాపూరితమైన కార్టూన్‌పై 2012లో దేశవ్యాప్తంగా నిరసన వ్యక్తమైంది. ఈ సందర్భంగా పరిస్థితిని చక్కదిద్దేందుకు అప్పటి కేంద్ర ప్రభుత్వం సుఖ్‌దేవ్ థోరాట్ కమిటీని నియమించింది. ఈ కమిటీకి సమర్పించే నిమిత్తం, ఉన్నమతి శ్యామసుందర్ అనే అంబేద్కర్‌వాద కార్టూనిస్టు ఆనాటి ఆంగ్ల పత్రికల్లో శంకర్, లక్ష్మణ్ తదితర ప్రముఖ కార్టూనిస్టుల వ్యంగ్య చిత్రాలను విశ్లేషించారు. అయితే, ఈ పరిశోధనకు ఎక్కువ సమయం పట్టినందున ఈ విశ్లేషణలతో కూడిన సమాచారాన్ని అందించకముందే థోరాట్ కమిటీ ప్రభుత్వానికి నివేదిక అందించింది. ఈ కారణంగా శ్యామ్ తన పరిశోధనాత్మక విశ్లేషణలను ఇటీవలే పుస్తకరూపంలో తీసుకొచ్చారు. 'నో లాఫింగ్ మేటర్' పేరిట వచ్చిన ఈ పుస్తకాన్ని 'నవయాన' ప్రచురించింది. 1932-1956 మధ్యకాలంలో వచ్చిన 122 కార్టూన్లను, అవి వెలువడిన సందర్భాన్ని, దానిలోని ప్రాసంగికతను తెలియచెబుతూ శ్యామ్ తన వ్యాఖ్యానాన్ని పుస్తకంలో పొందుపరిచారు. వ్యంగ్య చిత్రకారులు తాము సమకాలీన రాజకీయ పరిణామాలపై, నాయకుల తీరుపై, సమాజ ధోరణులపై నిష్పక్షపాతంగా సమదృష్టితో కార్టూన్లు వేస్తామని చెప్పుకుంటారు. ఇది నిజమో కాదో శ్యామ్ తన పరిశోధనలో నిగ్గుతేల్చారు. వాస్తవానికి ఆనాటి పత్రికలు తొలుత అంబేద్కర్ వార్తలనే దాదాపు విస్మరించాయి. ఆ తర్వాత కార్టూన్లలో అంబేద్కర్‌ను విలన్‌గా, బఫూన్‌గా చిత్రించేవి.

**- బి.భాస్కర్, సీనియర్ జర్నలిస్టు**

పురపాలక శాఖలోనూ, రెవెన్యూ శాఖలోనూ కొరవడిన ముఖ్య అంశం పౌర ప్రణాళిక (సిటిజన్స్ చార్టర్) లేకపోవడం. రెవెన్యూ శాఖలోని వివిధ అంశాలకు, పురపాలక శాఖ అంశాలకు ఒక సిటిజన్స్ చార్టర్ తయారుచేసి, నిర్దేశించిన సమయంలో ఆ సేవలను అందించకపోతే పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీలు పౌరులకు నష్టపరిహారం చెల్లించే విధంగా సంస్కరణల్ని రూపొందించాలి. ఆనాడే పరిపాలనా సంస్కరణలకు అర్థం ఉంటుంది.

**- ఐవైఆర్ కృష్ణారావు,**
**ఏపీ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి**

**జాతిపిత మహాత్మాగాంధీ ప్రబోధాలను మరచిపోని, తిరస్కరించని భారతీయులందరూ కాశ్మీర్‌ను విషమ పరిస్థితి నుంచి రక్షించడానికి నిరంతరం ప్రయత్నిస్తూనే ఉండాలి. లక్ష్య పరిపూర్తి వరకు ఆ ప్రయత్నాలకు ఎలాంటి విరామం ఉండకూడదు. సంభాషణ, రచనలో సత్యసంధత, చర్చ, వాదనలో వివేచన, కార్యాచరణలో అహింస, నిత్యజీవితంలో మత సామరస్యరక్షణకు నిబద్ధత.. ఈ ఆదర్శాలు, జీవనసూత్రాలను ఈ నిరాశామయ రోజుల్లో కూడా సజీవంగా, స్ఫూర్తిదాయకంగా ఉంచాలి.**

**- రామచంద్ర గుహ, చరిత్రకారులు**

**గ్రామ న్యాయాలయాల చట్టం అమలు ద్వారా దేశంలో 5,000 గ్రామీణ న్యాయాలయాలు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలు ఉన్నాయి. వీటి ఏర్పాటు వల్ల సులభంగా సత్వర న్యాయం గ్రామీణులకు అందుబాటులోకి వస్తుంది. కోర్టుల వెలుపల వివాదాలు పరిష్కరించుకోవచ్చని చాలామందికి తెలియదు కాబట్టి, వారికి ఈ విషయం తెలియజెప్పడానికి విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలి.**

**- జస్టిస్ ఎన్.వి రమణ,**
**సుప్రీంకోర్టు న్యాయమూర్తి**

ఎవరో ఒకసారి అడిగారు. మీ పిల్లలు ఒకవైపు, విప్లవం ఒకవైపు ఉంటే దేన్ని ఎంచుకుంటారు? అని. 'విప్లవాన్నే!' అని చెప్పాను. ఎందుకంటే నేను పెరిగిన కుటుంబ తత్వంతోనే నా కుమార్తెలు కూడా పెరగాలని ఆశిస్తాను. నేను కూడా సంతోషాన్నీ మంచి వస్తువులనూ కోరుకుంటాను. అయితే వాటి కోసం మానవులుగా మనం ఎదగడానికి దోహదపడే ఆదర్శాలను వదులుకోను. అందరికీ ఒక ఉత్తమమైన, సమానమైన అవకాశాలున్న ప్రపంచం రూపొందడం కోసం చే గువేరా లాంటి మరింతమంది పురుషులు, మహిళల అవసరం బహుశా ఈరోజు మనకు ఎక్కువ ఉందేమో!

**- అలైదా, చే గువేరా కుమార్తె**



# ఢిల్లీ, పంజాబ్, హర్యానాల్లో జేపీ బృందం 'విద్య, ఆరోగ్య యాత్ర'

మంచి ప్రమాణాల విద్యను, ఆరోగ్యాన్ని రాజకీయానికి, సమాజానికి కేంద్రబిందువు చేసి ప్రతి బిడ్డకూ, ప్రతి కుటుంబానికీ ఆర్థిక భారం లేకుండా అందుబాటులోకి తెచ్చే లక్ష్యంతో బహుముఖ కృషి చేస్తున్న లోక్‌సత్తా, ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఈ క్రమంలో ఇటీవల తన బృందాలతో ఢిల్లీ, పంజాబ్, హర్యానాల్లో పర్యటించారు. విద్య, ఆరోగ్య రంగాల్లో ఈ రాష్ట్రాలు చేపట్టిన కొన్ని మెరుగైన చర్యల్ని పరిశీలించారు.

వీలైనన్ని ఎక్కువ రాష్ట్రాల్లో పర్యటించి ఆచరణీయమైన అత్యుత్తమ విద్య, ఆరోగ్య పద్ధతులను గుర్తించటం, ప్రభుత్వాలతో కూర్చుని ఇప్పటికే అమలులో ఉన్నాయని తెలియజెబుతూ దేశమంతటా అమలు చేయించటం ఈ ప్రయత్నం లక్ష్యం. ఇందులో భాగంగానే ఎక్స్‌ప్లోఎడ్యుకేషన్ పేరుతో ఇటీవల ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో కూడా ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా బృందాలు విద్యాయాత్రను నిర్వహించాయి. విద్యను బాగు చేయాలన్న ఆసక్తి ఉన్న పలువురు సామాజిక నాయకులు ఈ కార్యక్రమాల్లో స్వచ్ఛందంగా పాల్గొన్నారు. విద్య, ఆరోగ్యాల్లో సమూల మార్పులపై ప్రజల్లోనూ అవగాహన పెంచేందుకు, వాటిని ప్రజల డిమాండ్‌గా మార్చేందుకూ జిల్లా, మండల స్థాయి వరకూ ఇలాంటి కార్యక్రమాల్ని విస్తరించాలని, ఈ అంశాలపై సంఘటితంగా, నాయకత్వ చొరవతో పనిచేసే కమ్యూనిటీ లీడర్‌షిప్‌ను ఎక్కడికక్కడ తయారుచేయాలని జేపీ భావిస్తున్నారు.

ఢిల్లీలో ప్రభుత్వ స్కూళ్లు, ఆస్పత్రులను సందర్శించాక జేపీ బృందం సెక్రటేరియట్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను కలిసింది. విద్య, ఆరోగ్యంలో ఢిల్లీ ప్రభుత్వ కృషి మిగతా దేశానికి మార్గదర్శకమని జేపీ ప్రశంసించినట్లు తెలుపుతూ కేజ్రీవాల్ తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేసిన ఫోటోలివి.








# సంస్కృతిని జాతిగా తీర్చిదిద్దింది గాంధీగారే!

"గాంధీగారి వల్ల స్వాతంత్ర్యం రాలేదు. ఆయన లేకపోయినా వచ్చి ఉండేది. తెల్లవాడు పారిపోయాడు - ఇంక మేము చెయ్యలేమయ్యా, మాకు శక్తి లేకపోయింది, మా బతుకు మేం చూసుకుంటాం అని! గాంధీగారి గొప్పతనం స్వాతంత్ర్యం తేవడం కాదు. గాంధీగారు లేని దేశాలకు కూడా స్వాతంత్ర్యం వచ్చింది. ఆయన లేకున్నా కచ్చితంగా మనకూ స్వాతంత్ర్యం వచ్చి ఉండేది. గాంధీగారు 5,000 సంవత్సరాల చరిత్రలో తొలిసారిగా ఒక సంస్కృతిని ఒక జాతిగా తీర్చిదిద్దారు. ఆయన లేకపోతే భారతదేశం లేదు. ఆయన లేకపోతే.. ఎన్నో కులాలున్నాయి ఎన్నో మతాలున్నాయి, ఎన్నో భాషలున్నాయి, ప్రాంతాలున్నాయి గానీ, ఒక దేశం లేదు! ఆ దేశం కేవలం ఓ చట్టం రూపంలో, రాజ్యాంగం రూపంలో రావడం కాదు. మనందరికీ కూడా ఉమ్మడి ప్రయోజనాలు ఒక్కటే. కాశ్మీరులోనో, గంగా నదీలోయలోనో, ఈశాన్య భారతంలోనో ఎవరికన్నా అన్యాయం జరిగి గుండె తల్లడిల్లితే.. అది మనందరికీ బాధని కలిగించాలి, మన కంట కన్నీరు ఒలకాలి. అదీ నిజమైన దేశభక్తి భావం. ఆ దేశభక్తిని మొట్టమొదటిసారిగా ఈ జాతికి అందించింది మహాత్మాగాంధీ. గాంధీజీ లేకపోతే జాతినిర్మాణం లేదు. స్వాతంత్ర్యం, వీడు కాకపోతే వాడు పరిపాలిస్తాడు, పెద్ద తేడా ఉండదు. కానీ జాతిని నిర్మాణం చేసింది ఆయన. అందుకోసం అప్రయత్నంగానే అయినా ఆసేతు హిమాచలం ఆయన్ని గుర్తుంచుకుంటున్నారు."

**-డా॥ జయప్రకాష్ నారాయణ్,**
**లోక్‌సత్తా, ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) వ్యవస్థాపకులు**

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HD-913/2018-2020 Published on 10th October, 2019 Posting Date 15 &16th of every month

# ఈ ఆరు అంశాలకు 10 శాతం కేటాయించండి చాలు..



“గాంధీజీ జాతీయోద్యమంలో చేసిన పెద్ద ఉద్యమాలు మూడో, నాలుగో మాత్రమే. అయినా కూడా ప్రజల్ని బాగా ప్రభావితం చేశారు. ఆనాడు గాంధీగారి పిలుపును అనుసరించడానికి అనేకమంది పూర్తి సమయాన్నిచ్చారు. అప్పటి వ్యవసాయాధారిత ఆర్థికవ్యవస్థ వారికి ఆ వెసులుబాటును కూడా ఇచ్చింది. కానీ ఈనాడున్న పోటీ వ్యవస్థలో అలా సాధ్యం కాదు. అందుకే ప్రతి ఒక్కరూ, ముఖ్యంగా యువత తమ సమయంలో, ఆదాయంలో కొంతమేర సమాజం కోసం కేటాయించే నమూనాను ఎంచుకోవాలి. మనం తెచ్చుకున్న అరకొర స్వరాజ్యాన్ని సంపూర్ణ స్వరాజ్యంగా, సురాజ్యంగా మార్చాలి. సోషల్ మీడియా, ఇతర సాంకేతికతల్ని ఇందుకు అనువుగా ఉపయోగించుకోవాలి. మనదేశం అగ్రరాజ్యం కాబోతోందని పాలకులు పైకి చెబుతున్నారుగానీ, ఆ అవకాశాన్ని చేజార్చేలాగానే వారు వ్యవహరిస్తున్నారు. కాస్త మధ్యస్థ ఆదాయమున్న దేశంగా భారత్‌ని నిలబెట్టగలిగితే చాలని మన ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, మంత్రులు తదితరులు నిర్ణయించేసుకున్నారు. జనం ముందు మాత్రం నటిస్తున్నారు. దీనర్థం ఓ పది శాతానికి తప్ప ఈ దేశంలో ఇక గొప్పగా ఎదిగే అవకాశాలుండవు. ఈ అవకాశాలు కూడా ఎక్కువగా పుట్టుకను బట్టే నిర్ణయమైపోతాయి. వివక్ష లేకుండా ఎదిగే అవకాశాలకు కీలకమైన రంగాలను, పాలనా విధానాలను పట్టించుకోకపోవటం వల్లే భారత్ లక్ష్యం పరిమితమైపోయి తొంభై శాతం ప్రజానీకం అరకొరగా, ఉన్నదాంతో సర్దుకుపోయే దిగువ మధ్యతరగతిగానే మిగిలిపోవాల్సి వస్తోంది. ఈ పరిస్థితిని మార్చటానికి ప్రధానంగా యువత గాంధీ ఛాలెంజ్‌ని స్వీకరించాలి. ‘నివారించదగ్గ బాధలను తొలగించే, పుట్టుకతో వివక్ష లేకుండా అందరికీ ఎదిగే అవకాశాలనిచ్చే’ అభివృద్ధి చెందిన భారత్‌ను నిర్మించటానికి నడుం కట్టాలి. గాంధీలా అందరూ జీవితాల్ని త్యాగం చేయనక్కర్లేదు. కానీ చట్టబద్ధపాలన, అందరికీ నాణ్యమైన విద్య–ఉపాధి, ఆరోగ్యం, లాభసాటి వ్యవసాయం, హక్కుగా పౌర సేవల చట్టం, స్థానిక ప్రభుత్వాల సాధికారత వంటి లక్ష్యాల కోసం ప్రతి ఒక్కరూ తమ సమయం, ఆదాయంలో 10 శాతం, అది కూడా స్థానికంగా ఎక్కడికక్కడ కేటాయిస్తే చాలు.. స్వాతంత్ర్యం వచ్చినప్పుడు ఉత్సవాలకు దూరంగా ఢిల్లీకి వెలుపల ఎక్కడో ఉండి గాంధీజీ కార్చిన కన్నీటిని తుడవగలం.”

**- డా॥ జయప్రకాష్ నారాయణ్, లోక్‌సత్తా, ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) వ్యవస్థాపకులు**

**BOOK POST**

**PRINT MATTER**

*If undelivered please return to:*

*LOKSATTA UDYAMA SAMSTHA,*
*Tulips Apartments, 6-3-655,*
*Flat.No. 407,*
*Behind civil supplies office,*
*Somajiguda,*
*Hyderabad - 500 082*

**Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, Tulips Apartments, 6-3-655, Flat.No. 407, Behind civil supplies office, Somajiguda, Hyderabad - 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC “X” Roads, Hyderabad 500 020**